# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 289 | హైదరాబాద్ | మంగళవారం 12-05-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

త్వరలో 17 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల్లో 'ఎస్ఐఆర్': ఎన్నికల సంఘం

## ఏపీకి నిధులు.. మాకేవి?




- జనగణన ఫారమ్‌లలో లోపాలు ఉన్నాయన్న పొన్నం
- బీసీలను విస్మరించారని విమర్శ
- గత 12 ఏళ్లలో తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధమని సవాల్

11లో

## భారత్‌ను ఎవరూ లొంగదీయలేరు

- 1998 పోఖ్రాన్ అణు పరీక్షలను గుర్తుచేస్తూ మోదీ కీలక వ్యాఖ్యలు
- సోమనాథ్ ఆలయ 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని
- బుజ్జగింపు రాజకీయాలపై ప్రతిపక్షాలను విమర్శించిన మోదీ
- సోమనాథ్ పునరుద్ధరణ భారత సాంస్కృతిక స్వేచ్ఛకు ప్రతీక అని వెల్లడి

11లో




11లో

## తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా విజయలక్ష్మి

- ఆరుగురు సభ్యులను కూడా నియమించిన ప్రభుత్వం
- సభ్యుల్లో కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత తదితరులు
- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

## మే 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగలు




- నెల రోజుల పాటు వాడవాడలా టీఆర్ఎస్ జెండా పండుగలు
- రాజధాని నుంచి గ్రామస్థాయి వరకు జెండా పండుగ
- పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జెండా పండుగ

11లో

## ఫిన్‌లాండ్‌కు విద్యా బృందం



- అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి ఉత్తమ విద్యావిధానాలను అమలు చేస్తామని హామీ
- విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకు రాగలమన్న రేవంత్ రెడ్డి
- అందుకే విద్యాశాఖను తాను నిర్వహిస్తున్నట్లు వెల్లడి

11లో



## హంటావైరస్ ఎఫెక్ట్

షిప్ నుంచి ప్రయాణికుల తరలింపు 11లో

- ఎంవీ హోండియస్ క్రూయిజ్ షిప్‌లో హంటావైరస్ వ్యాప్తి
- నౌకలో ఒకరు మరణించడంతో ప్రయాణికులను తరలిస్తున్న దేశాలు
- తమ పౌరులను రప్పించి క్వారంటైన్‌లోకి పంపుతున్న జర్మనీ, బ్రిటన్, స్పెయిన్
- బ్రిటన్ ప్రయాణికులకు 45 రోజుల పాటు ఐసోలేషన్ తప్పనిసరి
- ఎలుకల నుంచి మనుషులకు ఈ వైరస్ వ్యాపిస్తుందన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ

## చెన్నైలో స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం విజయ్

11లో

- తమిళనాడు సీఎం విజయ్, మాజీ సీఎం స్టాలిన్‌తో భేటీ
- ఎమ్మెల్యేగా ప్రమాణం చేశాక స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం
- విజయ్‌ను ఆలింగనం చేసుకుని శాలువాతో సత్కరించిన స్టాలిన్
- ఈ సమావేశంలో ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్న వైనం



## గృహహింస కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

11లో


11లో

## నీట్ 2026 పేపర్ లీక్?.. రాజస్థాన్‌లో కలకలం

- నీట్ 2026 పరీక్షలో అక్రమాలపై తీవ్ర ఆరోపణలు
- అసలు ప్రశ్నపత్రంతో గెస్ పేపర్‌కు పోలికలున్నట్లు గుర్తింపు
- రాజస్థాన్‌లో రంగంలోకి దిగిన స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్
- పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న అధికారులు

# నియోజకవర్గాల పెంపు ఎవరికి లాభం.. ఎవరికి నష్టం

ఉమ్మడి ఏపీలో 2014 వరకు 294 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 42 లోక్ సభ స్థానాలు ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 175 స్థానాలు.. తెలంగాణకు 119 స్థానాలు వెళ్లాయి. అదే సమయంలో లోక్ సభ స్థానాల అంశాన్నే తీసుకుంటే.. ఏపీకి 25 స్థానాలు.. తెలంగాణకు 17 స్థానాలు కేటాయించారు. విభజన చట్టంలో రెండు తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచుతామని చెప్పారు. ఈ లెక్కన ఏపీ అసెంబ్లీలో ఉన్న 175 స్థానాలకు 225 స్థానాలు పెరగాలి. తెలంగాణలో.. ప్రస్తుతం 119 అసెంబ్లీ స్థానాలు 150కు పెరుగుతాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో ఏపీ రాష్ట్ర వాటా 4.08 శాతం. ఆ నిష్పత్తి ప్రకారం ఏపీకి వచ్చే లోక్ సభ స్థానాలు 33 మాత్రమే.తెలుగు రాష్ట్రాల్లో పెరిగే సీట్లు ఎక్కడ పెరుగుతాయి..? తగ్గే సీట్లు ఎక్కడ తగ్గుతాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. జనాభా ఎక్కువగా ఉన్న పెద్ద నగరాల్లో సీట్లు పెరిగి.. గ్రామీణ ప్రాంతాల్లో తగ్గొచ్చనేది అంచనా. అలా జరిగితే.. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి చుట్టుపక్కలే ఎక్కువ సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే తెలంగాణ జనాభా 3.60 కోట్లు కాగా.. జీహెచ్ఎంసీ జనాభానే కోటి పైగా ఉంది. కాబట్టి ఇక్కడ సీట్లు పెంచక తప్పదు. గతంలో పునర్విభజన జరిగినప్పుడు కూడా హైదరాబాద్‌లో సీట్లు పెరిగిన సంగతిని సీనియర్లు గుర్తుచేసుకుంటున్నారు..ఏతావాతా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నగర ప్రాంతాల్లో సీట్లు పెరిగి.. గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు తగ్గుతాయనేది ప్రముఖంగా వినిపిస్తున్న మాట. అలా జరిగితే అర్బన్ ప్రాంతాల్లో పట్టున్న పార్టీలకు, నేతలకు అడ్వాంటేజ్ ఉంటుందనే వాదన వినిపిస్తోంది. తద్వారా గ్రామీణ ఓటర్ల కంటే అర్బన్ ఓటర్లను ఆకట్టుకోవటానికి పార్టీలు, నేతలు ఎక్కువ ప్రయత్నాలు చేస్తారనడంలో సందేహం అక్కర్లేదనే అభిప్రాయాలు వస్తున్నాయి. ఈ పరిణామాల్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో పార్టీలన్నీ తమ బలాబలాలు, ట్రాక్ రికార్డ్, ఓట్ల శాతం, పట్టున్న ప్రాంతాల లెక్కలు తీసే పనిలో పడ్డాయి. దాన్ని బట్టి భవిష్యత్ రాజకీయ వ్యూహం ఖరారు చేసుకునే పనిలో పడొచ్చని నేతలు భావిస్తున్నారు. పార్టీలకు మాత్రం స్వతహాగా మహిళల్లో అనుకూలత లేదు. కొన్నింటికైతే తమ తప్పు లేకుండానే ప్రత్యర్థుల చాతుర్యం కారణంగా మహిళా వ్యతిరేకులనే ముద్ర పడిపోయింది. ఇప్పటికిప్పుడు ఆ ముద్ర చెరిపేసుకోవడం కుదురుతుందా అనేది కొత్త టెన్షన్. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్లు అమలు కాకుండానే.. ఎన్నికల్లో గెలుపోటములకు మహిళా ఓట్లే కీలకంగా మారుతున్నాయి. ఇటీవలే జరిగిన బీహార్ ఎన్నికల్లో నారీశక్తి ఘనంగా పనిచేసింది. 2029 ఎన్నికల నాటికి ఈ సంఖ్య కనీసం 9కి చేరనుంది. గత ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మహిళలకు తక్కువ టికెట్లు కేటాయించినప్పటికీ.. భవిష్యత్తులో ప్రతి పార్టీ కచ్చితంగా 9 మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దించాల్సి ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఖమ్మం, కరీంనగర్ వంటి జిల్లాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఈ మార్పులు మహిళల గొంతు పార్లమెంటులో మరింత బలంగా వినిపించడానికి దోహదపడతాయని అంటున్నారు.

నియోజకవర్గాల పునర్విభజనలో అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దుల ఆధారంగా లోక్‌సభ స్థానాలను పునర్విభజించాలన్న నిబంధన పెట్టారు. ఈ లెక్కన ముందు అసెంబ్లీ నియోజకవర్గాలను ఏర్పాటు చేస్తారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా చేస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 27,41,239 మంది జనాభా ఉన్నారు. ప్రాథమికంగా అందుతున్న సమాచారం, జరుగుతున్న ప్రచారం మేరకు ప్రతి 2లక్షల జనాభాకు ఒక సీటు పెరిగే అవకాశం ఉంది. ఇక లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26 లేదా 27 అయ్యే అవకాశాలున్నాయి. జనాభా లెక్కల ఆధారంగా ఏర్పాటు చేస్తే అత్యధిక జనాభా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎక్కువ ఎంపీ సీట్లు పెరుగుతాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం 10 అసెంబ్లీ స్థానాలు, పునర్విభజన అనంతరం 14 లేదా 15 అయ్యే అకాశాలున్నాయి. వీటిలో 33 శాతం కనిష్ఠంగా 4 నుంచి గరిష్ఠంగా 5 స్థానాలు మహిళలకు కేటాయిస్తారు. ఎస్సీ, ఎస్టీ స్థానాలను కలుపుకొనే మహిళల రిజర్వేషన్ కల్పిస్తారు. అంటే రిజర్వేషన్ పురుషులు, మహిళలు అని మారుతూ ఉంటుంది. దీంతో రాజకీయంగా కొత్త వారికి అవకాశాలు వస్తాయి. పురుషులతోపాటు మహిళలు అవకాశాలు అందిపుచ్చుకొనే వీలు ఉంటుంది. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వచ్చే ఎన్నికల నాటికి అధికారాన్ని అందుకోవాలని తెగతాపత్రయపడుతోంది. ఇలాంటి సమయంలో నియోజకవర్గాల పునర్విభజనను అనుకూలంగా మార్చుకోవాలని కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా వ్యవహరించే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. కానీ రాష్ట్రంలో తమకు ఉన్న సంస్థాగత బలం.. ఉపయోగపడుతుందనేది బీఆర్ఎస్ లెక్కగా ఉంది. తెలంగాణలో ప్రస్తుతం 17 పార్లమెంటు నియోజకవర్గాలు ఉండగా, కాంగ్రెస్, బీజేపీ 2024 ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు చొప్పున గెలుచుకున్నాయి. 1971 జనాభా లెక్కల ప్రకారం 1972లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. ఆ తర్వాత? నియోజకవర్గాల సంఖ్య పెరగలేదు. కానీ? కొన్ని పరిధులు, పేర్ల మార్పుతో 2009లో ఎన్నికలు జరిగాయి. జనాభా గణన అనంతరం విధిగా జరిగే నియోజక వర్గాల పునర్విభజన ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ అన్న సూత్రం ప్రాతిపదికన జరగాలని రాజ్యాంగ నిబంధన పేర్కొంది. కానీ ఇప్పుడు కేంద్రం మాత్రం 2011లో చేసిన జనగణన ఆధారంగా డీలిమిటేషన్‌కు రెడీ అయింది. లోక్‌సభకు ఎన్నికయ్యే ప్రతి సభ్యుడు ప్రాతినిధ్యం వహించే ఓటర్ల సంఖ్య సమానంగా ఉండి తీరాలని ..ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ అనే ప్రజాస్వామిక సూత్రం నిర్దేశిస్తుంది. ఈ సూత్రం ఉల్లంఘనకు గురైతే పెద్ద నియోజకవర్గాలలోని ఓటు విలువ చిన్న నియోజకవర్గాలలోని ఓటు విలువ కంటే తక్కువగా ఉంటుంది. ఈ సూత్రాన్ని ఏ మేరకు ఫాలో అవుతారనేది చూడాల్సి ఉంది. ప్రస్తుతానికి 50 శాతం సీట్ల పెంపు అని చెబుతున్నా.. సమాన ఓటు విలువ విషయంలో తేడాలొస్తాయేమోననే సందేహాలు లేకపోలేదు. జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకేవిధంగా ఉండాలి. ఏతావాతా ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగకుండా.. ప్రజా ప్రాతినిధ్యానికి ఇబ్బంది లేకుండా డీలిమిటేషన్ చేయాలనేదే రాజ్యాంగం సూత్రీకరణ. దేశంలో గతంలో జరిగిన పునర్వి?భజన ప్రక్రియలు కూడా ఇదే విషయం చెబుతున్నాయి. మరి ఇప్పుడు జరిగే డీలిమిటేషన్ ఎలా జరుగుతుందోనని ఏపీతో పాటు అన్ని రాష్ట్రాలూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

# నేతలపై అపనమ్మకమే...

## క్లైమాక్స్‌లో బిగ్ ట్విస్ట్.. మహానాడు వేదిక చేంజ్.

నెల్లూరు, మే 11

తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ మహానాడు జరిపినా తమ సొంత ఇంటి కార్యక్రమంగానే భావిస్తుంటారు టీడీపీ క్యాడర్. అలాంటి పసుపు పండుగ జరిపే అవకాశం ఈ సారి మొదట సిక్కోలు గడప తొక్కింది. రాక రాక జిల్లాకు ఛాన్స్ ఇచ్చినట్లే ఇచ్చి..మహానాడును నెల్లూరుకు ఎందుకు తరలించారంటూ కార్యకర్తలు పెదవి విరుస్తున్నారట. అయితే పసుపు పండుగ నెల్లూరుకు షిఫ్ట్ కావడం వెనుక సిక్కోలు టీడీపీలో ఇంటర్నల్‌గా పెద్ద కథే నడిచిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.ఏపీ పాలిటిక్స్‌లో ఎప్పుడూ హాట్ టాపిక్‌గా ఉండే జిల్లా శ్రీకాకుళం. ఏ పార్టీ అధికారంలో ఉన్నా జిల్లా నేతలకు పెద్దపీట వేస్తుంటారు ఆ పార్టీ అధినేతలు. ఇక టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి కంచుకోటగా నిలిచిన జిల్లా ఇది. స్వయంగా ఎన్టీఆరే శ్రీకాకుళం జిల్లా నుంచి బరిలోకి దిగి గెలిచారంటూ తెలుగు తమ్ముళ్లు గుర్తు చేస్తున్నారు. 2024లో కూడా సిక్కోలు వాసులు టీడీపీకి బ్రహ్మరథం పట్టడంతో క్లీన్ స్వీప్ చేశారు. దీంతో టీడీపీ అధినేత కూడా కింజరాపు అచ్చెన్నాయుడుకు రాష్ట్ర మంత్రి వర్గంలో..రామ్మోహన్ నాయుడుకు కేంద్ర మంత్రివర్గంలో అవకాశం ఇచ్చారు. ఇక క్యాడర్‌తో సమావేశంలో భాగంగా జిల్లాలో ఈ సంవత్సరం టీడీపీ పసుపు పండగ మహానాడు సిక్కోలులోనే నిర్వహిస్తామని హామీ ఇచ్చారు టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్.ఇచ్చిన మాట ప్రకారం ఈ సంవత్సరం శ్రీకాకుళం జిల్లాలోనే టీడీపీ మహానాడుకు ఏర్పాట్లు చేయాలంటూ లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు. పార్టీ పెద్దలు, జిల్లా ఇంచార్జ్ మంత్రితో సహా టీడీపీ కీలక నేతలంతా రంగంలోకి దిగారు. మహానాడుకు అనువైన స్థలాల కోసం జల్లెడ పట్టారు. శ్రీకాకుళం జిల్లాలోని పైడి భీమవరంతో పాటు శ్రీకాకుళం పట్టణంలోని చాపురం, పాత్రునివలస వంటి ప్రాంతాల్లో పర్యటించి అనువైన స్థలాలు ఎంపిక చేశారు. వాస్తు సిద్దాంతులు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇక పనులు షూరూ చేయండని అధిష్టానం నుంచి ఆదేశాలు కూడా వచ్చాయి. జిల్లాలో మహానాడు జరుగుతుందంటూ తెలుగు తమ్ముళ్లు సైతం ఖుస్ అయ్యారు. సీన్ కట్ చేస్తే క్లైమాక్స్‌లో బిగ్ ట్విస్ట్ ఇచ్చారు. మహానాడు వేదిక శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరుకు మారిపోయింది. దీంతో సిక్కోలు టీడీపీ క్యాడర్ అంతా షాక్ అయిపోయిన పరిస్థితి.తెలుగు వార్తలుమహానాడు వేదిక మార్పునకు సిక్కోలు టీడీపీ నేతల తీరే కారణమన్న చర్చ జరుగుతోంది. ఉత్తరాంధ్రలో ప్రధానమంత్రి మోదీ పర్యటన ఉందని..ఆ కార్యక్రమాన్ని కూడా పెద్దఎత్తున నిర్వహించే ప్లాన్ ఉండటంతోనే మహానాడు వేదికను మార్చినట్లు పైకి చెబుతూ వస్తున్నారు నేతలు. కానీ అసలు కారణం వేరే ఉందంటూ గుసగుసలు మొదలయ్యాయి. మహానాడు నిర్వహణ, ఏర్పాట్లు కోసం ఇనీషియేషన్ తీసుకోవాల్సిన సిక్కోలు టీడీపీ ముఖ్యనేతలు అధిష్టానం ఆశించినంత ఉత్సాహం చూపించలేదట. పసుపు పండుగ అంటే దాదాపు 20 రోజులు అక్కడే మకాం వేయాలి. అతిథులకు వసతి ఏర్పాట్లు, పసందైన వంటకాలు వడ్డించడం వంటివి చాలా రిస్క్. ఈ స్థాయిలో ఎఫర్ట్స్ పెట్టి మహానాడు నిర్వహణకు అరేంజ్‌మెంట్స్ చేసేందుకు కీలక నేతలెవరూ ముందుకు రాలేదన్నది ఇన్‌సైడ్ టాక్.ఏదో లోకేశ్ నుంచి ఆదేశాలు వచ్చాయి కాబట్టి ..స్థల పరిశీలన అంటూ హడావుడి చేశారే తప్ప..లీడర్లలో సీరియస్‌నెస్ కనిపించలేదట. దీంతో శ్రీకాకుళం నేతలను నమ్ముకుంటే..సీన్ సితారైపోతుందని భావించిన పార్టీ పెద్దలు..వెంటనే మహానాడు వేదికను మార్చేశారట. పసుపు పండుగ నిర్వహణకు ఆసక్తిగా ఉన్న సింహపురి నేతలు మహానాడు బాధ్యతలను భుజాన వేసుకున్నారట. ఇప్పటికే ఏర్పాట్లకు శంకుస్థాపన చేసి..పనులను స్పీడప్ చేశారు. అయితే రాకరాక అవకాశం దక్కితే మహానాడు వేదిక మరో చోటుకు తరలిపోయేలా చేశారంటూ శ్రీకాకుళం టీడీపీ క్యాడర్ తమ నేతలపై తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. సొంత జిల్లాలో మహానాడు వేడుక జరుగుతుందని సంబరపడితే..ఆ ఆనందం ఎంతసేపు మిగలలేదంటూ నిరుత్సాహ పడిపోయారట. మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ పదవులు వెలగబెట్టిన అనుభవమున్న నేతలు..మహానాడును నిర్వహించలేకపోయారా.? అంటూ పెదవి విరుస్తున్నారు

# సిద్ధమైన కృష్ణాజలాల ప్రాజెక్టు

విజయవాడ, మే 11,

ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు మండలంలోని కిడ్నీ బాధిత గ్రామాలకు స్వచ్ఛమైన కృష్ణా జలాలను అందించే ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. సుమారు 15 తండాల్లోని 57 వేల మంది జనాభాకు ప్రతిరోజూ 22 లక్షల లీటర్ల నీటిని అందించేలా కుదప సంపు నుంచి పైప్‌లైన్ నిర్మించారు. గత పదేళ్లుగా కిడ్నీ వ్యాధులతో వందలాది మంది మరణించిన ఈ ప్రాంతంలో.. సురక్షిత నీటి సరఫరా ద్వారా వ్యాధులను అరికట్టడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా.. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని అధికారికంగా ప్రారంభించనున్నారు.ఎన్టీఆర్ జిల్లాలోని ఎ కొండూరు మండలం అంటేనే కిడ్నీ వ్యాధులకు నిలయంగా మారిపోయిన దుస్థితి. ఇక్కడి భూగర్భ జలాల్లో ఉన్న ఫ్లోరైడ్, ఇతర రసాయనాల కారణంగా వందలాది మంది గిరిజనులు కిడ్నీ వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ కిడ్నీ మరణాల పరంపరకు అడ్డుకట్ట వేయాలంటే సురక్షితమైన మంచినీటి సరఫరా ఒక్కటే మార్గమని దశాబ్ద కాలంగా బాధితులు మొరపెట్టుకుంటున్నారు. ఎట్టకేలకు ఈ ప్రాంత వాసుల కల నెరవేరుస్తూ.. కృష్ణా నది జలాలను తరలించే ప్రాజెక్టు నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం రికార్డు సమయంలో పూర్తి చేసింది, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలోనే ఈ మండలంలో సుమారు 250 మందికి పైగా కిడ్నీ వ్యాధులతో మరణించారని గణాంకాలు చెబుతున్నాయి. ప్రాజెక్టు పనులు అప్పట్లో మందకొడిగా సాగడంతో కిడ్నీ బాధితుల వెతలు తీరలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా గుర్తించి ఆఖరి దశలో ఎదురైన సాంకేతిక సమస్యలను పరిష్కరించింది. కుదప సంపు నుంచి పది కిలోమీటర్ల పొడవైన భారీ పైప్‌లైన్ ద్వారా కృష్ణా జలాలను ఎ.కొండూరు మండలానికి తరలిస్తున్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా



నీటిని నిల్వ చేసేందుకు తండాల్లో ఉన్న 44 పాత ట్యాంకులను పునరుద్ధరించడంతో పాటు కొత్తగా మరో 12 ట్యాంకులను నిర్మించారు. మొత్తం 56 ట్యాంకుల ద్వారా గిరిజన తండాల్లోని ఇంటింటికీ నీటిని పంపిణీ చేయనున్నారు. ప్రారంభంలో కొత్తగా నిర్మించిన నాలుగు ట్యాంకులకు నీరు ఎక్కకపోవడంతో కొంత ఆందోళన నెలకొన్నప్పటికీ అధికారులు శక్తివంతమైన మోటార్లను ఏర్పాటు చేసి ఆ సమస్యను అధిగమించారు. ప్రస్తుతం ట్రయల్ రన్‌లో భాగంగా గ్రామాలకు నీటిని విడుదల చేస్తున్నారు.అయితే ప్రస్తుత ప్రాజెక్టు సామర్థ్యంపై ప్రజల నుంచి కొన్ని విన్నపాలు అందుతున్నాయి. రోజుకు 57 వేల మందికి తలసరి 50 లీటర్ల చొప్పున 22 లక్షల లీటర్లను పంపింగ్ చేసేలా ఈ లైన్‌ను రూపొందించారు. కానీ ప్రజల అవసరాలు వంద లీటర్లకు పైగా ఉండటంతో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉంది. దీనివల్ల కొందరు మళ్లీ పాత బోర్ల నీటినే వాడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం 22 లక్షల లీటర్ల పరిమితిని దాటి అదనపు నీటిని అందించేందుకు ఎ.కొండూరుకు మరో ప్రత్యేక పైప్‌లైన్ వేసేలా కొత్త ప్రతిపాదనలను సిద్ధం చేస్తోంది. ఈ ప్రాజెక్టును శనివారమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ.. ఆయన టూర్ రద్దవటంతో మరో ముహూర్తానికి వాయిదా పడింది. త్వరలోనే ఈ ప్రాజెక్టును ప్రజలకు పూర్తిస్థాయిలో అంకితం చేయనున్నారు.

# 258 గ్రామాల్లో బోర్ల తవ్వకాలు నిషేధం

కడప, మే 11,

ఏపీ ప్రభుత్వం కొత్తగా బోర్లు తవ్వకుండా నిషేధం విధించింది. మొత్తం 7 జిల్లాల్లోని 258 గ్రామాల్లో బోర్ల తవ్వకాలను నిషేధించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాకపోతే జనాల కోసం తాగునీటి అవసరాలకోసం మాత్రం బోర్లు వేసుకోవచ్చు. ఈ జిల్లాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతుండటంతో ఏపీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. బోర్ల తవ్వకాలపై నిషేధం విధించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7 జిల్లాల్లోని 258 గ్రామాల్లో కొత్తగా బోర్ల తవ్వకాలను నిషేధించారు. ఈ 258 గ్రామాల్లో ప్రజల తాగునీటి అవసరాల కోసం చేతిబోర్లకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. మిగిలిన కొత్త బోర్లు తవ్వేందుకు, ఇసుక తవ్వకాలకూ అనుమతి లేదని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో భూగర్భ జలాలు అడుగంటటడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. బోర్లపై నిషేధం విధిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళంలో 76, ప్రకాశంలో 91, పల్నాడులో 20, చిత్తూరులో 8, అనంతపురం జిల్లాలో 14, శ్రీసత్యసాయి జిల్లాలో 39, కడపజిల్లాలో 10 గ్రామాలు కలిపి మొత్తం 258 గ్రామాల్లో నీటి వినియోగం మోతాదుకు మించి ఉన్నట్లు అధికారులు గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు ఏపీ రైతులకు వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది ముందస్తుగా నీటి విడుదల కారణంగా ముందుగానే, ఇప్పటి నుంచే ఖరీఫ్ సన్నద్ధతపై దృష్టి సారించాలన్నారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లో వ్యవసాయ అధికారుల్ని ఆదేశించారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ జిల్లా వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటింజెన్సీ ప్లాన్‌తో ఎల్‌నినో ప్రభావం చూపే మెట్ట ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా సిద్ధంగా ఉండాలని సూచించారు.

# ఏపీలోకి టీవీకేపార్టీ.. కాంగ్రెస్ తో పొత్తు

తిరుపతి, మే 11, (

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ టీవీకే పార్టీ ప్రభంజనం సృష్టించింది.. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచింది. టీవీకేతో కలిసొచ్చే పార్టీలతో కలిసి విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. సినిమాలతో అభిమానులతో మొదలైన విజయ్ ప్రస్థానం.. ఎన్నికల గెలుపు వరకు సాగింది. తమిళనాడులో పార్టీ ప్రారంభించిన రెండేళ్లలోనే తిరుగులేని విజయం సాధించడంతో టీవీకేలో కొత్త జోష్ నింపింది. విజయ్ ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో ఓ ట్రెండ్ సెట్టర్‌గా మారారనే చెప్పాలి.. టీవీకే విజయం దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారి తీసింది.తమిళనాడులో టీవీకే విజయం తర్వాత.. విజయ్ నెక్స్ట్ ప్లాన్ ఏంటి.. దళపతి తమిళనాడుతో ఆగుతారా పొరుగున ఉన్న రాష్ట్రాల్లోకి ఎంట్రీ ఇస్తారా అనే చర్చ మొదలైంది. ముఖ్యంగా విజయ్ కన్ను ఆంధ్రప్రదేశ్‌పై పడిందనే ఊహాగానాలు మొదలయ్యాయి.. టీవీకే అధినేత తమిళనాడు సరిహద్దులో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని విస్తరించే అవకాశం ఉందంటున్నారు. తమిళనాడు ఎన్నికలకు ముందు నుంచే ఆంధ్రప్రదేశ్ టీవీకే పార్టీ పేరుతో కొందరు సోషల్ మీడియాలో పేజీలు కూడా నడపుతుండటంతో టాక్ మొదలైంది. విజయ్ ముందు తమిళనాడులో స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని.. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకు టీవీకే పార్టీని విస్తరిస్తారనే ఊహాగానాలు మొదలయ్యాయి.విజయ్ ఆంధ్రప్రదేశ్‌వైపు రావడానికి కారణాలు చాలానే ఉన్నాయి. తమిళనాడులో విజయ్‌కు యువత నుంచి మంచి ఆదరణ వచ్చింది.. దళితులు, క్రిస్టియన్లు మద్దతు తెలిపారు. ఇక్కడ కూడా అడుగుపెట్టి ఆయా సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే అవకాశం ఉందంటున్నారు. ఏపీలో ముఖ్యంగా తీరప్రాంత జిల్లాలతో పాటుగా యువత, క్రిస్టియన్లు, దళిత ఓటర్లను ఆకట్టుకుంటే బలమైన రాజకీయశక్తిగా ఎదగొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే తమిళనాడుతో పోలిస్తే ఏపీలో క్రిస్టియన్ల సంఖ్య ఎక్కువగా ఉండటం కూడా కలిసొస్తుందంటున్నారు. తమిళనాడు ఫార్ములాను ఫాలో అవుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రస్తుతం ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎంట్రీ ఇచ్చే అవకాశాలు లేకపోలేదంటున్నారు. టీవీకే పార్టీని విస్తరించేందుకు ఆంధ్రప్రదేశ్ మంచి ఆప్షన్ అనే వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే తెలుగు ఇండస్ట్రీ నుంచి, ఇతర రాజకీయ పార్టీల నుంచి వచ్చేవారిని ఏకం చేస్తే ఇంకా ప్లస్ అవుతుందంటున్నారు.అంతేకాదు విజయ్ టీవీకే పార్టీ ఏపీలో కాంగ్రెస్‌తో జతకట్టి ఎన్నికలకు వెళ్లే అవకాశాలు లేకపోలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ తమిళనాడు సరిహద్దుతో పాటుగా మరికొన్ని చోట్ల టీవీకే అభ్యర్థులకు అవకాశం ఇచ్చి కూటమిగా బరిలోకి దిగే అవకాశాలు కొట్టిపారేయలేం అంటున్నారు. ఏపీ సరిహద్దులోని కొన్ని జిల్లాలపై తమిళనాడు ప్రభావం ఉంటుంది.. మిగిలిన చోట్ల బలపడాలంటే కష్టంగా ఉంటుంది. అందుకే ఏపీలో కాంగ్రెస్‌తో కలిసి ముందుకు సాగితే సక్సెస్ కావొచ్చు అంటున్నారు.

యానాంలో ఘోర ఓటమి

యానాంలో విజయ్ టీవీకే అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. యానాం నియోజకవర్గం కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల మధ్యలో ఉంది. ఈ నియోజకవర్గంలో తెలుగు ప్రజలు ఎక్కువ. రాజకీయంగా వారి ప్రభావం కూడా ఎక్కువే. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉన్న యానాం నియోజకవర్గంలోని ఓటర్లు విజయ్ టీవీకేకు ఘోర పరాభవాన్ని రుచి చూపించారు. టీవీకే అభ్యర్థి తోట రాజు కేవలం 167 ఓట్లు మాత్రమే సాధించి డిపాజిట్ కూడా పోగొట్టుకున్నారు. టీవీకే అభ్యర్థి కంటే.. నోటాకు 193 ఓట్లు పడటం విశేషం. దీంతో తెలుగు ప్రజలు విజయ్‌కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.మరోవైపు యానాం అసెంబ్లీ నియోజకవర్గంలో 37,972 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 35,445 మంది అంటే 93.35 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఎన్నార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మల్లాడి కృష్ణారావు విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌పై మల్లాడి కృష్ణారావు 4,568 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎమ్మెల్యేగా మల్లాడి కృష్ణారావు ఆరోసారి విజయం సాధించారు.మరోవైపు పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమి విజయానికి హామీలు కూడా ప్రధాన కారణమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మంచినీటి ఏటీఎంలు, అటల్ క్యాంటీన్లు, బాలికలకు ఈ-స్కూటర్లు, స్థానికులకే ఉద్యోగ రిజర్వేషన్లు వంటి హామీలు ఓటర్లను ఆకర్షించాయి. మత్స్యకారులను వెనుకబడిన జాబితాలో చేరుస్తామని ప్రకటించడం కూడా కలిసి వచ్చింది. విజయ్ టీవీకే పార్టీ కూడా ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చటం ఎన్డీఏ కూటమికి కలిసి వచ్చింది.

# బాలినేనికి కీలక బాధ్యతలు

ఒంగోలు, మే 11,

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, డీ లిమిటేషన్ ప్రక్రియపై ఉమ్మడి జిల్లాల వారీగా కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలలో వైసీపీ నుంచి వచ్చిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభానులకు స్థానం కల్పించారు. బాలినేని శ్రీనివాసరెడ్డికి ఉమ్మడి రాయలసీమ జిల్లాలతో పాటుగా ప్రకాశం, నెల్లూరు జిల్లాలను అప్పగించారు. ఇక సామినేని ఉదయభానుకు, నాదెండ్ల మనోహర్‌కు కలిపి కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతలు అప్పగించారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేనలో చేరిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కీలక బాధ్యతలు అప్పగించారు. డీ లిమిటేషన్ ప్రక్రియతో పాటుగా ఏపీలో త్వరలోనే జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ కమిటీలను ఏర్పాటు చేసింది. మొత్తం 11 మంది సభ్యులతో మూడు కమిటీలను ఏర్పాటు చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. సభ్యులకు తాజాగా జిల్లాల బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలోనే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి రాయలసీమ జిల్లాలైన ఉమ్మడి అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలతో పాటుగా.. ప్రకాశం, నెల్లూరు జిల్లాల బాధ్యతలు అప్పగించింది.పవన్ కళ్యాణ్ ఆదేశాలత బాలినేని శ్రీనివాసరెడ్డి రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో పర్యటించనున్నారు. ఆయా జిల్లాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు. డీలిమిటేషన్ అంశాలపై చర్చిస్తారు. అనంతరం ఈ పర్యటన వివరాలతో సమగ్ర నివేదికను పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు సమర్పించనున్నారు.అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల కోసం ఏర్పాటు చేసిన కమిటీలో బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటుగా ఆరణి శ్రీనివాసులు,



టీసీ వరుణ్‌కు స్థానం కల్పించారు. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల కోసం కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, సీహెచ్ వంశీకృష్ణలతో కమిటీ ఏర్పాటైంది. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల కోసం పంతం నానాజీ, బొలిశెట్టి శ్రీనివాస్, కొటికలపూడి గోవిందరావులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఇక కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతలను నాదెండ్ల మనోహర్, సామినేని ఉదయభానులకు అప్పగించారు.మరోవైపు జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. వచ్చే వారం కమిటీలను ప్రకటించనున్నట్లు జనసేన పార్టీ తెలిపింది. జనసేన పార్టీ సంస్థాగత విస్తృత నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన ప్రక్రియలో పవన కళ్యాణ్ నిమగ్నమై ఉన్నారన్న జనసేన.. పార్టీ నిర్మాణంలో భాగమైన కమిటీల ఏర్పాటు కోసం గత కొన్ని నెలలుగా పవన్ కళ్యాణ్ ముఖ్య నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. శస్త్రచికిత్స నుంచి పూర్తిస్థాయిలో ఇంకా కోలుకోకపోయినప్పటికీ.. ఆరోగ్యపరమైన ఇబ్బందులున్నా కూడా కమిటీల ప్రకటనపై దృష్టిపెట్టారని తెలిపింది.

# విశాఖకు ఇన్నర్ రింగ్ రోడ్...

విశాఖపట్టణం, మే 11



విశాఖ నగరాన్ని రాబోయే 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి చేసేందుకు ఏపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కిలోమీటర్ల మేర సెమీ రింగురోడ్డు నిర్మించనున్నారు. భోగాపురం విమానాశ్రయానికి ఏడు కనెక్టింగ్ రోడ్లు, బీచ్ కారిడార్‌తో పాటు రూ.14 వేల కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఉత్తరాంధ్రను ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మారుస్తూ ఆర్థిక కారిడార్‌ను బలోపేతం చేయడమే ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చెబుతోంది.విశాఖ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, పారిశ్రామిక ప్రాంతాలను అనుసంధానించడానికి రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కిలోమీటర్ల పొడవైన సెమీ రింగురోడ్డును ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ఈ నెలాఖరు నాటికి సిద్ధం కానుంది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే.. నగరం మధ్యలోకి భారీ వాహనాలు రాకుండా నేరుగా హైవేలకు అనుసంధానం అయ్యే అవకాశం ఉంటుంది. దీనివల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా నగర శివారు ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి.నిర్మాణంలో ఉన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రాధాన్యతనిస్తూ.. దానికి ఏడు కనెక్టింగ్ రోడ్లను వీఎంఆర్డీఏ నిర్మిస్తోంది. ఇప్పటికే మూడు రోడ్ల నిర్మాణం పూర్తి కాగా.. మిగిలినవి తుది దశలో ఉన్నాయి. విశాఖ నగరం నుంచి భోగాపురం వరకు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేలా ప్రత్యేక బీచ్ కారిడార్‌ను కూడా ప్రతిపాదించారు. ఇది పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించడమే కాకుండా సముద్ర తీర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దోహదపడుతుంది.నగరవాసుల ప్రాథమిక అవసరాలను తీర్చేందుకు రూ.14 వేల కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే విశాఖలోని 95 శాతం ఇళ్లకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని మంత్రి నారాయణ వివరించారు. అలాగే మాస్టర్ ప్లాన్ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన 90 శాతం వినతులను అధికారులు పరిష్కరించారు. ఉత్తరాంధ్రను ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మార్చడమే లక్ష్యంగా.. విశాఖ ఎకనామిక్ కారిడార్‌ను బలోపేతం చేస్తూ ఐటీ, ఫార్మా, లాజిస్టిక్స్ రంగాలకు పెద్దపీట వేస్తున్నారు. ఈ సమీక్షలో తీసుకున్న నిర్ణయాలు విశాఖను గ్లోబల్ సిటీగా మార్చడంలో కీలక పాత్ర పోషించనున్నాయని అధికారులు వెల్లడించారు.

# దువ్వాడకు జగన్ షాక్



శ్రీకాకుళం, మే 11,

తెలుగు రాష్ట్రాల్లో పొలిటికల్ సెలబ్రిటీ అంటే.. ముందుగా గుర్తొచ్చే పేరు దువ్వాడ శ్రీనివాస్. వైసీపీ ఎమ్మెల్సీగా ఉండి ఒక మహిళ కోసం జరిగిన కుటుంబ వివాదంతో పార్టీకి చెడ్డ పేరు వస్తుందని చెప్పి ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. అయితే ఇది తాత్కాలికమేనని.. తిరిగి తాను వైసీపీలో యాక్టివ్ అవుతానని దువ్వాడ శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఆయన మాటల్లో జగన్మోహన్ రెడ్డి పట్ల ఫ్లేవరు, ఫేవర్ కనిపిస్తూ వచ్చింది. జగన్మోహన్ రెడ్డి సైతం మొన్న ఆ మధ్యన ఏంటి శ్రీనివాస్ అని పలకరించే సరికి పులకించుకుపోయారు దువ్వాడ. ఇక తాను అడిగిందే తరువాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి జగన్ మోహన్ రెడ్డి తిరిగి ఆహ్వానిస్తారు అని భావించారు. కానీ ఇటీవల జగన్ వద్దకు వెళ్లిన దువ్వాడకు షాక్ కొట్టే విషయాన్ని చెప్పారు అధినేత. పార్టీలో చేరిక విషయంలో తానేం చేయలేనంటూ జగన్మోహన్ రెడ్డి తేల్చి చెప్పినట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది.శ్రీకాకుళం జిల్లాలో దూకుడు కలిగిన నేతగా దువ్వాడ శ్రీనివాస్ కు పేరు ఉంది. దశాబ్దాల కిందట నుంచి కాంగ్రెస్లో రాజకీయాలు నడుపుతూ వచ్చారు. కానీ ఎందుకో చట్టసభలకు మాత్రం వెళ్లలేకపోయారు. కానీ ఆ ముచ్చట తీర్చారు జగన్మోహన్ రెడ్డి. ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టడంతో శాసనమండలిలో అడుగుపెట్టారు. అయితే ప్రత్యక్ష ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ఎంపీగా, ఎమ్మెల్యేగా మూడుసార్లు ఛాన్స్ ఇచ్చారు. ఒక్కసారి కూడా నెగ్గుకు రాలేకపోయారు దువ్వాడ శ్రీనివాస్. కానీ కింజరాపు ఫ్యామిలీ పై దూకుడుగా అడుగులు వేయాలంటే దువ్వాడ ఉండాల్సిందేనని చెప్పి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి ప్రోత్సహించారు. కానీ వ్యక్తిగత, కుటుంబ వ్యవహారాలతో పార్టీకి చేటు తెచ్చారు. అందుకే సస్పెన్షన్ వేటు పడింది.అయితే ప్రారంభంలో వైసిపి నేతల నుంచి ఏం హామీ వచ్చిందో తెలియదు కానీ.. ఆ పార్టీలో సీనియర్ నేతలైన ధర్మాన బ్రదర్స్ పై ఒంటికాలితో లేచారు దువ్వాడ. దానికి కాస్త కులం రంగు పులిమారు. వైసీపీలోకి వస్తే కాచుకోండి అంటూ తేల్చి చెప్పారు. అంతటితో ఆగకుండా వైసీపీ లేకపోతే ఇండిపెండెంట్ ప్యానల్స్ తో ఓడిస్తాను అంటూ శపథం కూడా చేశారు. అయితే పార్టీలోకి వస్తానని చెప్పి ఇటీవల జగన్మోహన్ రెడ్డిని దువ్వాడ శ్రీనివాస్ కలిశారట. అయితే ధర్మాన సోదరులు పావులు కాదపడంతో జగన్మోహన్ రెడ్డి నో అని చెప్పారట. అయితే మొన్నటికి మొన్న తన వెనుక నిలిచిన వైసిపి పెద్దలు సైతం ఇప్పుడు ముఖం చాటేసారట. అయితే దువ్వాడ శ్రీనివాస్ ఇటీవల రాజకీయ ప్రకటనలు చేయలేదు. మరి జగన్ నో చెప్పిన నేపథ్యంలో దువ్వాడ శ్రీనివాస్ ఎలా స్పందిస్తారో చూడాలి.

# సోషల్ మీడియా ట్రెంగింగ్ లో కీర్తన...

చెన్నై, మే 11,

తమిళనాడులో గత కొన్ని రోజుల రాజకీయ హైడ్రామాకు తెరతీస్తూ.. ఇవాళ టీవీకే నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం చేయగా.. ఆయనతోపాటు మరో 9 మంది కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇక ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తరఫున గెలిచిన అత్యంత యువతిగా 29 ఏళ్ల కీర్తన సంజయ్ విజయం సాధించారు. ఇప్పుడు ఆమె తాజాగా విజయ్ మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. దీంతో ఇప్పుడు అందరి దృష్టి ఆమెపైనే పడింది.విరుదునగర్ జిల్లాలోని శివకాశి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీవీకే తరఫున పోటీ చేసిన కీర్తన సంజయ్.. గెలుపొంది తమిళనాడు రాజకీయాల్లో కొత్త ఎమ్మెల్యేగా నిలిచారు. ఇక తాజాగా మీడియాతో మాట్లాడిన కీర్తన.. తాను రాజకీయాల్లో ఉండాలని ఎప్పుడూ ఊహించుకున్నానని.. అందుకే రాజకీయ వ్యూహకర్తగా తన వృత్తిని ఎంచుకున్నానని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తాను చాలా మంది రాజకీయ నాయకులతో కలిసి పనిచేశానని.. వ్యవస్థ ఎలా పనిచేస్తుందో, అధికార యంత్రాంగం ఎలా నడుస్తుందో అర్థం చేసుకున్నానని ఆమె చెప్పారు.1996లో విరుదునగర్‌లో పుట్టిన కీర్తన.. రాజకీయ సలహాదారుగా తన వృత్తిని ప్రారంభించారు. గవర్నమెంట్ తమిళ్ మీడియం స్కూల్లో చదువుకున్న కీర్తన.. మదురై కామరాజ్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న కాలేజీ నుంచి బీఎస్సీ మ్యాథ్స్ పూర్తి చేశారు. ఆ తర్వాత 2019లో పుదుచ్చేరి యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ పూర్తి చేశారు.ఇక కీర్తన ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాకముందు.. షోటైమ్ కన్సల్టింగ్, ఐప్యాక్ వంటి రాజకీయ వ్యూహాలు రచించే సంస్థల్లో పనిచేశారు. రాజకీయ సలహాదారుగా, డిజిటల్ ప్రచార వ్యూహకర్తగా పనిచేశారు. ఇక 2024లో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ తరఫున.. 2026లో పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తరఫున.. 2021 ఎన్నికల్లో తమిళనాడులో ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) పార్టీ తరఫున ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్నారు.ఈ క్రమంలోనే గత కొన్నేళ్లుగా.. ఆమె మాజీ ముఖ్యమంత్రులైన ఎంకే స్టాలిన్, మమతా బెనర్జీలతోపాటు.. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులతో కలిసి పనిచేశారు. తాను రాజకీయ వ్యూహకర్తగా తన పని తనకు పరిపాలన, పాలన, అధికార యంత్రాంగం పనితీరుపై లోతైన అవగాహన కల్పించిందని కీర్తన వెల్లడించారు. తమిళం, ఇంగ్లీష్, హిందీ, తెలుగుతో సహా మొత్తం 5 భాషలను కీర్తన అనర్గళంగా మాట్లాడగలరు. దీంతో ఆమె బహుభాషా కోవిధురాలిగా కూడా నిలిచారు. ఎక్కువ భాషలు నేర్చుకోవడం ద్వారా.. వివిధ రాష్ట్రాల్లో పనిచేయడానికి, అక్కడి ప్రజలతో మరింత ప్రత్యక్షంగా మమేకం కావడానికి సహాయపడిందని పేర్కొన్నారుతనకు ఇలా చాలా భాషలు రావడం వల్ల వివిధ రాష్ట్రాల్లో పనిచేయడానికి ఎన్నో అవకాశాలు వచ్చాయని కీర్తన తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సందేశాన్ని దేశం మొత్తంలో ఎక్కువ మంది అర్థం చేసుకుని.. ఆయనకు మద్దతు తెలపాలనే ఉద్దేశ్యంతోనతాను హిందీ మాట్లాడటాన్ని ఎంచుకున్నానని ఆమె తెలిపారు. ఈ అసెంబ్లీ ఎన్నికలలో శివకాశి స్థానంలో 68,709 ఓట్లు సాధించిన కీర్తన.. కాంగ్రెస్ అభ్యర్థి అశోకన్ జిని 11,670 ఓట్ల తేడాతో ఓడించారు. గత 7 దశాబ్దాల్లో శివకాశి నుంచి ఒక మాజీ ఏఐఏడీఎంకే మంత్రిని ఓడించిన తొలి మహిళా ఎమ్మెల్యే కీర్తన కావడం విశేషం.తాను టీవీకే పార్టీలో చేరడానికి గల కారణాన్ని వివరించిన కీర్తన.. ఈ పార్టీ ప్రజలు అందరికీ అందుబాటులో ఉండే పార్టీ అని తెలిపారు. తనకు రాజకీయ, ఆర్థిక నేపథ్యం లేకపోయినా.. తాను ఇవాళ మంత్రి స్థానంలో ఉన్నానంటే అది కేవలం టీవీకే పార్టీ సామాన్యులకు కూడా అవకాశం ఇవ్వడం వల్లేనని స్పష్టం చేశారు. ప్రజల కోసం ఏదైనా చేయాలనే తపన ఉంటే.. టీవీకే పార్టీ స్వాగతం పలుకుతుందని పిలుపునిచ్చారు.

# ప్రోటోకాల్ పక్కన పెట్టి ఫ్రెండ్ షిప్...
# భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై సంకేతాలు

హైదరాబాద్, మే11,

హైదరాబాద్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన రాజకీయంగా విస్తృత చర్చకు దారి తీసింది. సాధారణంగా ప్రధాని ఏ రాష్ట్రానికి వెళ్లినా అధికారిక కార్యక్రమాలకే పరిమితం కావడం ఆనవాయితీ. కానీ ఈసారి తెలంగాణ పర్యటనలో భాగంగా జూబ్లీహిల్స్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసాలకు మోదీ వెళ్లడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా అధికారిక ప్రోటోకాల్‌కు అతీతంగా మిత్రపక్ష నేతల ఇళ్లకు వెళ్లడం, వ్యక్తిగతంగా పలకరించడం, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీయడం వంటి పరిణామాలు ఎన్డీయే రాజకీయాల్లో కొత్త చర్చకు కారణమయ్యాయి.తెలంగాణలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రధాని సమయం చేసుకుని మరీ నేరుగా పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లారు. ఇటీవల సైనస్ శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కొంతసేపు కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడినట్లు సమాచారం. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి వెళ్లి భేటీ కావడం రాజకీయంగా మరింత ఆసక్తి రేకెత్తించింది. ఒకే పర్యటనలో ఏపీకి చెందిన ఇద్దరు కీలక నేతల నివాసాలకు ప్రధాని వెళ్లడం అరుదైన పరిణామంగా రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఎన్డీయే కూటమిలో ప్రస్తుతం టీడీపీ, జనసేన కీలక భాగస్వాములుగా ఉన్నాయి. ముఖ్యంగా 2024 ఎన్నికల తర్వాత కేంద్ర రాజకీయాల్లో చంద్రబాబు పాత్ర మరింత ప్రాధాన్యం పొందింది. సంఖ్యాపరంగా మాత్రమే కాదు, పరిపాలనా అనుభవం, పెట్టుబడుల ఆహ్వానం, దక్షిణాదిలో రాజకీయ ప్రభావం వంటి అంశాల్లో టీడీపీని బీజేపీ కీలక మిత్రపక్షంగా చూస్తోంది. అదే సమయంలో పవన్ కళ్యాణ్ యువతలో ప్రభావం ఉన్న నాయకుడిగా, జనసేన ద్వారా ఎన్డీయేకు సామాజికంగా విస్తరణ కల్పించే నేతగా గుర్తింపు పొందారు. ఈ నేపథ్యంలో మోదీ వ్యక్తిగతంగా ఇద్దరి నివాసాలకు వెళ్లడం ద్వారా మిత్రధర్మానికి గౌరవం ఇచ్చినట్టుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కూటమి రాజకీయాల్లో పరస్పర నమ్మకం, వ్యక్తిగత అనుబంధం కూడా ముఖ్యమనే సంకేతాన్ని ఈ భేటీలు ఇచ్చాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గతంలో బీజేపీ ? టీడీపీ మధ్య విభేదాలు చోటుచేసుకున్నప్పటికీ, ఇప్పుడు అదే నాయకత్వంతో సమన్వయం బలపడుతున్న దృశ్యం దేశానికి కనిపించేలా చేయడంలో ఈ భేటీలు కీలకంగా మారాయని విశ్లేషణలు వస్తున్నాయి.మరోవైపు దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ వ్యూహంలో కూడా ఈ భేటీలకు ప్రాధాన్యత కనిపిస్తోంది. తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల ప్రభావం ఎక్కువగా ఉండటంతో, బలమైన మిత్రపక్షాలతో కలిసి ముందుకు వెళ్లాలనే ఆలోచన బీజేపీలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆ కోణంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను రాజకీయంగా ప్రాధాన్యంతో చూడడం ద్వారా దక్షిణాదిలో ఎన్డీయే బలం పెంచాలనే సంకేతాన్ని ప్రధాని పర్యటన ఇచ్చిందని భావిస్తున్నారు.హైదరాబాద్ వేదికగా జరిగిన ఈ భేటీలు మరో ఆసక్తికర చర్చకు కూడా దారి తీశాయి. రాష్ట్ర విభజన తర్వాత కూడా హైదరాబాద్ తెలుగు రాష్ట్రాల రాజకీయ, వ్యాపార, మీడియా కేంద్రంగా కొనసాగుతోంది. అలాంటి నగరంలో ప్రధాని ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం నివాసాలకు వెళ్లడం తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. తెలంగాణ పర్యటనలో ఉండగానే ఏపీ రాజకీయ నాయకులతో ప్రత్యేక సమయం గడపడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.ఇటీవల అమరావతి, పోలవరం, పెట్టుబడులు, కేంద్ర సహకారం వంటి అంశాల్లో కేంద్రం నుంచి ఏపీకి అనుకూల సంకేతాలు వరుసగా వస్తున్నాయి. అలాంటి సమయంలో ప్రధాని ఈ భేటీలు చేయడం ద్వారా కేంద్ర ? ఏపీ సమన్వయం బలంగా ఉందన్న అభిప్రాయం మరింత బలపడుతోంది. ముఖ్యంగా ఎన్డీయేలో ఏపీ భాగస్వామ్యానికి ఉన్న ప్రాధాన్యతను బహిరంగంగా చాటే చర్యగా ఈ పర్యటనను రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.మొత్తంగా చూస్తే, ఇది కేవలం మర్యాదపూర్వక సమావేశం లేదా ఆరోగ్య పరామర్శ మాత్రమే కాదు. దక్షిణాదిలో ఎన్డీయే వ్యూహం, మిత్రపక్షాలకు ఇస్తున్న ప్రాధాన్యత, కేంద్ర?ఏపీ రాజకీయ సమన్వయం, భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై సంకేతాలు ఇచ్చిన పరిణామంగా ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన నిలిచింది.

# మోడీ మీటింగ్
# కమలంలో జోష్...

హైదరాబాద్, మే11, (

దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కాషాయం జెండాను రెపరెపలాడించాలనేది బీజేపీ ప్రధాన లక్ష్యం.. అదే వ్యూహంతోని ప్రధాని మోదీ ముందుకు సాగుతున్నారు. పొత్తులతోనైనా లేదా ఒంటరిగానైనా ఒక్కో రాష్ట్రంలో బీజేపీ జెండాను పాతుకుంటూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంది వస్తోంది. ఈ సూత్రంలోనే చరిత్రను తిరగరాస్తూ బెంగాల్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది బీజేపీ. ఇప్పుడు ఫోకస్ తెలంగాణపై పెట్టింది. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని ప్రధాని మోదీ పరేడ్ గ్రౌండ్ సభలో మాట్లాడడం తెలంగాణ నేతల్లో జోష్‌ను పెంచేసింది.అందుకు తగ్గట్టుగానే సభలో తెలంగాణ బీజేపీ నేతలు కూడా మాట కలిపారు. తొలత ఎంపీ డీకే ఆరుణ మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉందన్నారు. మళ్లీ మళ్లీ ప్రజలు సుపరిపాలన అందించడం వల్లే బీజేపీ అధికారంలోకి వస్తోందన్నారు. బీజేపీ నెక్ట్స్ టార్గెట్ తెలంగాణే అనీ.. అందుకు తగ్గట్టుగా కార్యకర్తలు పని చేయాలనీ మోదీ పిలుపునిచ్చినట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేననటి స్పష్టం చేశారు.దేశ వ్యతిరేక శక్తులతో బీజేపీ పోరాడుతోందన్నారు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు. దేశాన్ని ఉత్తరాది, దక్షిణాదిలుగా విభజించే వారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఎంతో ముఖ్యమన్నారు. ఇక అధికారంలోకి వచ్చేముందు కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు కేంద్రమంత్రి బండి సంజయ్. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని విమర్శించారు. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు పోరాడాలన్నారు.ఇక తెలంగాణలో బీజేపీ 8 ఎంపీ సీట్లు గెలిచిందన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. ఒక కుటుంబం చేతిలో పదేళ్లు తెలంగాణ నలిగిపోయిందన్నారు. తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలంగాణలో ప్రధాని మోదీ సభ విజయవంతం కావడంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మోదీ ఇచ్చిన స్ఫూర్తితో ముందుకు సాగాలంటూ నేతలు కార్యకర్తలకు సూచించారు. బెంగాల్ తరహాలోనే తెలంగాణలోనూ అధికారం సాధించాలని సూచించారు.

# బండి భగీరథ్ ఇరుక్కున్నాడా.. ఇరికించారా...

హైదరాబాద్, మే 11,

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ చుట్టూ వివాదాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. బండి సంజయ్ కుమారుడు ఒక బాలిక మీద లైంగికంగా దాడి చేశాడని ఇప్పటికే కేసులు నమోదు



అయ్యాయి. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో ఇప్పటికే కేసు నమోదు అయింది. ఫోక్సో చట్టం కింద ఈ కేసు నమోదు కావడంతో రాజకీయంగా కలకలం చెలరేగుతుంది. దీనిపై ఇప్పటికే కేంద్రమంత్రి కుమారుడు స్పందించారు. తనపై వస్తున్న ఆరోపణలు మొత్తం నిజం కావని.. అవన్నీ బెదిరించడానికి చేస్తున్నవని ఆయన స్పష్టత ఇచ్చారు. ఇది కోట్ల కోసం తనను ఈ స్థాయిలో ఇబ్బంది పడుతున్నారని ఆయన కరీంనగర్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ నగరంలోని కొంపల్లి ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం ఐదు కోట్ల కోసం తనను ఈ స్థాయిలో ఇబ్బంది పెడుతోందని అతడు ఆ ఫిర్యాదులో స్పష్టం చేశాడు. ఆ అమ్మాయి తనకు స్నేహితుల ద్వారా పరిచయమైందని.. పార్టీలతోపాటు ఆలయాలకు కూడా ఆమెతో కలిసి వెళ్లినట్టు బండి సంజయ్ కుమారుడు స్పష్టం చేశారు. ఆమెను పెళ్లి చేసుకోవాలని లేకపోతే ఐదు కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని మంత్రి కుమారుడు చెబుతున్నారు. ఇప్పటికే ఆమెకు 50,000 ఇచ్చానని.. తనను డబ్బుల కోసం ఇంకా ఇబ్బంది పెడుతున్నారని.. తనను కాపాడాలని కేంద్ర మంత్రి కుమారుడు ఇప్పటికే చెప్పారు.

కేంద్ర మంత్రి కుమారుడి మీద ఆరోపణలు రావడం ఇదే తొలిసారి కాదు. గతంలో అతడు మహీంద్రా యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు ఒక వ్యక్తిపై దాడి చేశాడని.. కేంద్ర మంత్రి కుమారుడు వల్ల అతడు తీవ్రంగా గాయపడ్డాడని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ ఘటన జరిగినప్పుడు తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉంది. నాడు గులాబీ పెద్దలు ఈ కేసును తీవ్రంగా పరిగణించారు. అంతే కాదు కేంద్ర మంత్రి కుమారుడి మీద నాడు అధికార పార్టీకి కరపత్రం గా ఉన్న పత్రికలో ఇష్టానుసారంగా కథనాలు ప్రసారమయ్యాయి. తర్వాత ఈ కేసు సంగతి ఏమైందో తెలియదు. ఇప్పుడు కేంద్రమంత్రి కుమారుడ మీద మరో ఆరోపణలు రావడం.. ప్రధానమంత్రి తెలంగాణకు వస్తున్న సమయంలో ఈ ఘటన వెలుగులోకి రావడంతో రాజకీయంగా బండి సంజయ్ తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఈ ఘటనలో బండి సంజయ్ కుమారుడు తప్పు చేశాడా? లేదా? అనే విషయాలను పక్కన పెడితే.. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న బండి సంజయ్ కచ్చితంగా ఈ కేసును తీవ్రంగా తీసుకోవాలి. సోషల్ మీడియాలో పోస్ట్ చేసినంత మాత్రాన ప్రజల్లో నిర్దోషులు కాలేరు. సోషల్ మీడియా జస్టిస్ పాత్ర పోషించలేదు. అలాంటప్పుడు బండి సంజయ్ కచ్చితంగా తన కుమారుడి విషయంలో నిజాయితీని నిరూపించుకోవాలి. ఇప్పటికే గులాబీ పార్టీ కౌంటర్ మొదలుపెట్టింది. తన పార్టీ అధినేత కుమారుడు కేటీఆర్ మీద పదేపదే బండి సంజయ్ ఆరోపణలు చేసేవారని.. ఇప్పుడు ఆ బాధ అర్థం అవుతుందా అంటూ ఆ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. బండి సంజయ్ కుమారుడి మీద కచ్చితంగా విచారణ జరగాలని.. అప్పుడే నిజాలు బయటికి వస్తాయని గులాబీ నేతలు అంటున్నారు.

# తెలంగాణలో పెరగనున్న భూముల విలువ

హైదరాబాద్, మే 11,

తెలంగాణ ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలను మే 26 నుంచి సవరించాలని నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ధరలు పెరగకముందే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలని ప్రజలు పోటీ పడుతుండటంతో రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం ఈ నెల 12 నుంచి 15 వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పనివేళలను పొడిగించింది. ముఖ్యంగా హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లోని 15 ప్రధాన కార్యాలయాల్లో ఉదయం 9.30 నుండి సాయంత్రం 6.30 వరకు సేవలు అందుబాటులో ఉంటాయి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా స్థిరాస్తుల మార్కెట్ విలువలను పెంచాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించడంతో రిజిస్ట్రేషన్ల శాఖ ఒక్కసారిగా బిజీ అయిపోయింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత భూముల విలువలను 20 శాతం నుండి 100 శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నూతన ధరలు మే 26 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉండటంతో పాత ధరలకే తమ రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలని సామాన్యుల నుంచి బిల్డర్ల వరకు అందరూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. ఈ భారీ రద్దీని క్రమబద్ధీకరించేందుకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ఈ నెల 12 నుంచి 15 వరకు ఎంపిక చేసిన 15 ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పనివేళలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ నాలుగు రోజుల పాటు కార్యాలయాలు ఉదయం 9.30 గంటలకే తెరుచుకుని సాయంత్రం 6.30 గంటల వరకు నిరంతరాయంగా పనిచేస్తాయి. రద్దీ ఎక్కువగా ఉన్న చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్వో, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ కార్యాలయాల్లో ఈ నిబంధనలు వర్తిస్తాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూడాలని, తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను పెంచాలని, సర్వర్లపై ఒత్తిడి పడకుండా సాంకేతిక జాగ్రత్తలు తీసుకోవాలని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతును ఆదేశించారు. ఒకవేళ నిర్ణీత గడువు తర్వాత కూడా రద్దీ తగ్గకపోతే పనివేళలను మరింత పొడిగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. అలాగే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా ఇదే విధమైన సమన్వయం ఉండాలని కోరారు. భూముల మార్కెట్ విలువల సవరణ వల్ల ప్రభుత్వం ఈ ఏడాది సుమారు రూ. 19 వేల కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. కొకపేట్, గండిపేట్ వంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ప్రస్తుతం ప్రభుత్వ ధర కంటే మార్కెట్ ధరలు చాలా ఎక్కువగా ఉండటంతో ఈ వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం శాస్త్రీయ పద్ధతిలో రేట్లను సవరిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రజలు ధరల భారానికి భయపడి ముందుగానే రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి పారదర్శకంగా వేగంగా సేవలు అందించాలని ప్రభుత్వం కోరుతోంది.

============

# యూపీ గ్యాంగ్ పనే రాబరీ...

కరీంనగర్, మే 11,

కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలరీ షాపులో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో విచారణ వేగంగా కొనసాగుతోంది. ఈ కేసు పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. చోరీ జరిగి ఐదు రోజులైనా దొంగలను పట్టుకోలేదు. కానీ కీలక ఆధారాలను మాత్రం సేకరించారు. ఈ చోరీ తర్వాత పోలీసులు, అధికార పార్టీ నేతలు, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇది పోలీసులపై మరింత ఒత్తిడి పెంచుతోంది. ఈ భారీ దోపిడీ ఒక్కసారిగా తెలంగాణ పోలీసుల అవగాహనను మార్చేసింది. కోట్ల విలువైన ఆభరణాలు ఎత్తుకెళ్లడంతో ఈ సంఘటన వెనుక బిహార్ మూలాలు కలిగిన ఆరుగురు సభ్యుల అంతర్రాష్ట్ర 'గోల్డ్ థీఫ్' గ్యాంగ్ ఉందని పోలీసులు నిర్ధారించారు. ఈ ముఠా ఉత్తరప్రదేశ్‌లో అనేక కిడ్నాపింగ్ కేసుల్లో చిక్కుకుంది. వారు ధనవంతులను లక్ష్యంగా చేసుకుని డబ్బు వసూళ్లు చేసి, బంగారు దోపిడీల వైపు మళ్లారు. బిహార్ నుంచి తెలంగాణకు వలస వచ్చిన వీరు ధర్మపురి, పెద్దపల్లి ప్రాంతాల్లో లాడ్జీలు బుక్ చేసుకుని వారం రోజులు రెక్కీ నిర్వహించారు. గ్యాంగ్ లీడర్ గతంలో జైలు శిక్ష అనుభవించాడని సమాచారం. వారి నెట్‌వర్క్ దక్షిణ భారతదేశంలో విస్తరిస్తోంది. దోపిడీ తర్వాత స్థానిక సినిమా ఫక్కీల్లో తమ ఆధారాలు వదిలి వెళ్లారు. ఇది పోలీసుల దృష్టిని స్థానికుల వైపు తిప్పడానికి వ్యూహాత్మక చర్య. ఫోరెన్సిక్ టీమ్ ఈ ఆధారాల నుంచి డీఎన్ఏ, మొబైల్ ట్రాకింగ్ ద్వారా గ్యాంగ్‌ను గుర్తించింది. ఈ టెక్నిక్ వారి సంక్లిష్ట 'రెడ్ హెర్రింగ్' వ్యూహం భాగం. కరీంనగర్ పోలీసులు, బిహార్, ఉత్తరప్రదేశ్ పోలీసులతో కోఆర్డినేట్ అవుతున్నారు. రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు. డ్రోన్‌లు, ఏఐ టూల్స్‌తో గాలింపు ముమ్మరం చేశారు. ఇప్పటికే రెండు వాహనాలు సీజ్ చేశారు. పోలీసు అధికారి ప్రకారం, 48 గంటల్లోపు అరెస్టులు జరుగుతాయి. గతేడాది ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి గ్యాంగ్ దోపిడీ చేసింది. దక్షిణ భారతదేశంలో బిహార్ ముఠాలు 30 శాతం పెరిగాయి. ఆర్థిక పురోగతితో జ్యువెలరీ లక్ష్యాలు ఎక్కువవుతున్నాయి.

## గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ

హైదరాబాద్ గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగింది. దొంగలు ఇంటికి తాళం వేసి పెళ్లికి వెళ్లిన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి భారీగా బంగారం, వెండి, నగదును అపహరించారు. జైన్ స్కూల్ సమీపంలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు.

# పాలమూరులో పారిశ్రామిక విప్లవం

మహబూబ్ నగర్, మే 11,

హైదరాబాద్-పనాజీ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటక సరిహద్దులోని గుడెబల్లూర్ వరకు 80 కి.మీ. మేర ఎన్‌హెచ్-167 విస్తరణ పనులకు ప్రధాని మోదీ ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. రూ.3,180 కోట్ల అంచనా వ్యయంతో పీఎం గతిశక్తి పథకం కింద చేపట్టే ఈ ప్రాజెక్టు ద్వారా మూడు ఎకనమిక్, ఏడు లాజిస్టిక్ నోడ్స్ అందుబాటులోకి రానున్నాయి. ఈ రహదారి విస్తరణతో హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌కు అనుసంధానం ఏర్పడి, పాలమూరు ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా మారనుంది. తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను పారిశ్రామికంగా మరో ఉన్నత స్థాయికి చేర్చే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో బృహత్తర అడుగు వేసింది. హైదరాబాద్-పనాజీ ఎకనమిక్ కారిడార్‌లో అత్యంత కీలకమైన ఎన్‌హెచ్-167 జాతీయ రహదారి విస్తరణ పనులకు ప్రధాని నరేంద్ర మోదీ నేడు హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పీఎం గతిశక్తి పథకంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టు కేవలం రహదారి విస్తరణ మాత్రమే కాకుండా సమగ్ర ఆర్థిక వృద్ధిని లక్ష్యంగా చేసుకుంది. మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటక సరిహద్దులోని గుడెబల్లూర్ వరకు ఉన్న 80 కిలోమీటర్ల మేర ప్రస్తుతమున్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఫార్మాసిటీలు, మెడికల్ క్లస్టర్లను హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌తో అనుసంధానం చేస్తుంది. ఈ రహదారి వెంట మూడు ఎకనమిక్ నోడ్స్, ఏడు లాజిస్టిక్స్ నోడ్స్, తొమ్మిది సామాజిక నోడ్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే జడ్చర్ల వరకు ఉన్న నాలుగు వరుసల రహదారిని భవిష్యత్తులో ఆరు వరుసలకు పెంచే ఆలోచన ఉండగా.. వెనుకబడిన మహబూబ్‌నగర్-గుడెబల్లూర్ మార్గాన్ని ఇప్పుడు నాలుగు వరుసలుగా మార్చడం వల్ల ఈ ప్రాంతంలో పారిశ్రామిక పెట్టుబడులు వెల్లువెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా షాద్‌నగర్, కొత్తూరు, జడ్చర్ల పారిశ్రామికవాడలకు ఈ కొత్త రహదారి అదనపు బలాన్ని ఇస్తుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. మౌలిక సదుపాయాల పరంగా ఈ ప్రాజెక్టును అత్యున్నత ప్రమాణాలతో నిర్మిస్తున్నారు. ఈ 80 కి.మీ. విస్తరణలో 5 పెద్ద వంతెనలు, 36 చిన్న వంతెనలు, 260 కల్వర్టులను నిర్మించనున్నారు. ప్రయాణికుల భద్రత, సులభతర రాకపోకల కోసం 11 హై-లెవల్ వెహికల్ అండర్‌పాస్‌లు, 22 లో-లెవల్ వీయూపీలు, ఒక రైల్వే ఓవర్ బ్రిడ్జిని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను ప్రముఖ నిర్మాణ సంస్థ కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ దక్కించుకోగా.. రూ.3,180 కోట్ల అంచనా వ్యయంతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, గుత్తేదారు సంస్థ మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం.. పనులను ప్రారంభించిన రెండేళ్లలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ రహదారి పూర్తయితే.. మహబూబ్‌నగర్, దేవరకద్ర, మరికల్, మక్తల్, మాగనూరు మీదుగా కర్ణాటకకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా, స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇది తెలంగాణ మరియు కర్ణాటక రాష్ట్రాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే కీలక వారధిగా నిలవనుంది.

# 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు సెమిస్టర్ విధానం?

హైదరాబాద్, మే 11,

తెలంగాణ విద్యా విధానం కమిటీ రాష్ట్రంలో 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని భావిస్తోంది. వార్షిక పరీక్షల వల్ల విద్యార్థులపై పడే ఒత్తిడిని తగ్గించి, విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే చదువుపై శ్రద్ధ చూపేలా ఈ మార్పు చేయనున్నారు. థియరీ కంటే ప్రాక్టికల్స్‌కు, అనుభవపూర్వక అభ్యసనానికి ప్రాధాన్యతనిస్తూ, పాఠశాల విద్యలో ఇంటర్‌ను విలీనం చేసే అంశాన్ని కూడా కమిటీ పరిశీలిస్తోంది. తెలంగాణ రాష్ట్ర విద్యా రంగంలో చారిత్రాత్మక మార్పులకు సర్కార్ సిద్ధమవుతోంది. ప్రస్తుతమున్న వార్షిక విద్యా విధానం స్థానంలో.. ఉన్నత విద్య (యూజీ/పీజీ) తరహాలోనే పాఠశాల స్థాయిలోనూ సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టే దిశగా తెలంగాణ విద్యా విధానం కమిటీ సభ్యులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా తొమ్మిదో తరగతి నుంచి ప్రారంభించి పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు ఈ నూతన విధానాన్ని అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దీనివల్ల విద్యార్థులు ఏడాది పొడవునా సిలబస్ మొత్తాన్ని గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉండదు. సిలబస్‌ను రెండు భాగాలుగా విభజించి పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులపై మానసిక ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వార్షిక విధానంలో విద్యార్థులు పరీక్షలకు కొద్ది నెలల ముందు మాత్రమే పుస్తకాలు పట్టే ధోరణి కనిపిస్తోంది. అలాగే, మార్చి, ఏప్రిల్ నెలల్లో భారీ సిలబస్‌ను పునశ్చరణ చేయడం విద్యార్థులకు సవాలుగా మారుతోంది. సెమిస్టర్ విధానం వల్ల విద్యార్థులు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే చదువుపై దృష్టి సారిస్తారు. మొదటి సెమిస్టర్‌లో సాధించిన ఫలితాలను బట్టి ఉపాధ్యాయులు విద్యార్థుల బలహీనతలను గుర్తించి రెండో సెమిస్టర్ నాటికి వారిని మెరుగుపరిచే అవకాశం ఉంటుంది. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కూడా ఈ విధానానికి సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఒకవేళ స్కూల్ స్థాయిలో సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే తొలుత ఇంటర్మీడియట్‌కైనా ఈ విధానాన్ని వర్తింపజేయాలని కమిటీ భావిస్తోంది. ఈ మార్పులతో పాటు, బట్టీ పద్ధతికి స్వస్తి పలికి అనుభవపూర్వక అభ్యసన విధానానికి ప్రభుత్వం పెద్దపీట వేయనుంది. కేవలం థియరీ పాఠాలకే పరిమితం కాకుండా విద్యార్థులు తాము చదువుతున్న విషయాలను ప్రయోగాత్మకంగా అర్థం చేసుకునేలా ల్యాబ్‌లను ఆధునీకరించనున్నారు. ప్రతి విషయాన్ని జ్ఞాపకశక్తితో కాకుండా, అనుభవపూర్వకంగా నేర్చుకోవడం వల్ల అది వారి మెదడులో శాశ్వతంగా నిలిచిపోతుందని కమిటీ బలంగా నమ్ముతోంది. ఇందులో భాగంగానే పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్‌ను విలీనం చేసే ప్రక్రియను కూడా ఒక కీలక అడుగుగా భావిస్తున్నారు. ల్యాబ్‌ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనపై కూడా కమిటీ ప్రత్యేక నివేదికను రూపొందిస్తోంది. విద్యా వ్యవస్థలో నాణ్యతను పెంచడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షలకు తెలంగాణ విద్యార్థులను సిద్ధం చేయడమే ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశ్యం. ఈ ప్రతిపాదనలు గనుక పట్టాలెక్కితే.. తెలంగాణ విద్యా వ్యవస్థ దేశంలోనే ఒక ఆదర్శవంతమైన నమూనాగా మారనుంది. టీచర్లు కూడా ప్రణాళికాబద్ధంగా సిలబస్‌ను పూర్తి చేసేందుకు ఈ సెమిస్టర్ విధానం ఎంతో సహకరిస్తుందని కమిటీ సభ్యులు వెల్లడించారు.

# జూన్ 2న 22 జిల్లాల్లోఇందిరా మహిళా శక్తి భవనాలు సిద్ధం

వరంగల్ మే 11,

తెలంగాణ ప్రభుత్వం 22 జిల్లాల్లో రూ.110 కోట్లతో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాలను జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రారంభించనుంది. మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశాలు, శిక్షణ, ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం వీటిని శాశ్వత వేదికలుగా తీర్చిదిద్దారు. ఒక్కో భవనాన్ని 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.5 కోట్లతో నిర్మించారు. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళా సమాఖ్యలకు గొప్ప ఊరటనివ్వడమే కాకుండా ఆర్థిక పురోగతికి మార్గం సుగమం చేయనుంది. తెలంగాణ రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక అడుగు వేసింది. రాష్ట్రంలోని 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి పేరుతో నిర్మిస్తున్న అత్యాధునిక భవనాలు ప్రారంభోత్సవానికి ముస్తాబవుతున్నాయి. జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా వీటిని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. గ్రామీణ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ఈ భవనాలు ఇకపై కేంద్ర బిందువులుగా మారనున్నఉమ్మడి పది జిల్లాల్లో ఇప్పటికే భవనాలు ఉండగా.. కొత్తగా ఏర్పడిన 22 జిల్లాల్లో ఒక్కో భవనానికి రూ.5 కోట్ల చొప్పున ప్రభుత్వం మొత్తం రూ.110 కోట్లను కేటాయించింది. సుమారు 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో ఈ భవనాలను నిర్మిస్తున్నారు. హనుమకొండ, నిజామాబాద్, జగిత్యాల, ములుగు, సూర్యాపేట, యాదాద్రి వంటి జిల్లాల్లో ఇప్పటికే 17 భవనాల నిర్మాణం పూర్తి కాగా.. మిగిలిన 5 జిల్లాల్లో పనులు తుది దశకు చేరుకున్నాయి. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ పర్యవేక్షణలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తోంది. ఇప్పటివరకు మహిళా సమాఖ్యలకు సొంత కార్యాలయాలు లేకపోవడంతో సమావేశాలు నిర్వహించాలన్నా, శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలన్నా అద్దె భవనాలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇకపై ఆ ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ఈ భవనాల్లో కేవలం కార్యాలయ పనులే కాకుండా, మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, మార్కెటింగ్ కార్యకలాపాలు కూడా సాగనున్నాయి. జిల్లా స్థాయి సమావేశాలు, సెమినార్ల నిర్వహణకు ఇవి వేదికలుగా నిలవనున్నాయని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. వచ్చే నెల 2వ తేదీ నాటికి ఏవైనా పెండింగ్ పనులు ఉంటే పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మహిళా సాధికారతకు ఈ భవనాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. జూన్ 2న జరిగే సామూహిక ప్రారంభోత్సవ కార్యక్రమం మహిళా లోకానికి ఒక తీపి గుర్తుగా మిగిలిపోనుందని ప్రభుత్వం చెబుతోంది.

# బండి సంజయ్ కొడుకు చుట్టూ రాజకీయం

కరీంనగర్, మే 11,

కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ చుట్టూ ప్రస్తుతం ఒక పెను సంచలనం నెలకొంది. హనీ ట్రాప్, బ్లాక్‌మెయిల్, మైనర్ వేధింపుల వంటి తీవ్రమైన ఆరోపణలతో కూడిన ఈ వ్యవహారం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసులో ఇరు పక్షాల నుంచి పరస్పర విరుద్ధమైన ఫిర్యాదులు అందడం రాజకీయంగానూ, సామాజికంగానూ పెను దుమారం రేపుతోంది. బండి భగీరథ్ కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో స్వయంగా ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తనను కొంతకాలంగా ఒక కుటుంబం పథకం ప్రకారం హనీ ట్రాప్ చేసి, బ్లాక్‌మెయిల్ చేస్తోందని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన ఒక కుటుంబం తన నుంచి రూ.5 కోట్లు డిమాండ్ చేస్తోందని భగీరథ్ ఆరోపించారు. స్నేహితుల ద్వారా పరిచయమైన సదరు యువతితో కలిసి పార్టీలు, ఫంక్షన్లు, చివరకు గుడులకు కూడా వెళ్లానని, అయితే ఇప్పుడు ఆ సాన్నిహిత్యాన్ని అడ్డుపెట్టుకుని వీడియోలు, చాటింగ్ స్క్రీన్ షాట్లతో తనను వేధిస్తున్నారని ఆయన వెల్లడించారు. ఇప్పటికే సదరు యువతి తండ్రికి రూ.50,000 చెల్లించానని, అయినప్పటికీ వారు ఇంకా పెద్ద మొత్తంలో డబ్బు కావాలని ఒత్తిడి తెస్తున్నారని భగీరథ్ పోలీసులకు వివరించారు. భగీరథ్ ఫిర్యాదు చేసిన కొద్ది సేపటికే సదరు యువతి కుటుంబం కూడా పోలీసులను ఆశ్రయించడం ఈ కేసులో కీలక మలుపు. అయితే, వారు హైదరాబాద్‌లో ఫిర్యాదు చేస్తూ భగీరథ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ యువతి మైనర్ అని, భగీరథ్ ఆమెను వేధించాడని ఆ కుటుంబం పేర్కొంది. ఒకవేళ ఈ ఆరోపణలు నిజమని ప్రాథమిక విచారణలో తేలితే, భగీరథ్‌పై అత్యంత కఠినమైన పోక్సో చట్టం కింద కేసు నమోదయ్యే అవకాశం ఉంది. ఇది బండి సంజయ్ కుటుంబానికి రాజకీయంగా పెద్ద ఇబ్బందిగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ మొత్తం ఉదంతం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందనే ప్రచారం కూడా బలంగా సాగుతోంది. ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనకు ముందు ఈ వివాదం తెరపైకి రావడం చర్చనీయాంశమైంది. త్వరలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ జరగబోతోందని, ఈ క్రమంలో బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తప్పించి, ఆ స్థానాన్ని దక్కించుకోవాలని చూస్తున్న సొంత పార్టీకి చెందిన కొందరు నేతలే ఈ వ్యవహారాన్ని వ్యూహాత్మకంగా బయటకు తెచ్చారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ కేసుపై రెండు భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. కేంద్ర మంత్రి కుమారుడు నిజంగానే ఒక ప్లాన్ ప్రకారం హనీ ట్రాప్‌కు గురయ్యారా? లేక మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించి, ఆ తప్పు నుంచి తప్పించుకోవడానికి ముందే ఫిర్యాదు చేశారా? ఈ రెండు వెర్షన్లలో ఏది నిజమనేది పోలీసుల లోతైన విచారణలో మాత్రమే తేలాల్సి ఉంది. ఒకవైపు కేంద్ర మంత్రి కుమారుడి హోదా, మరోవైపు మైనర్ బాలిక రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ కేసుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నిందితులు ఎవరైనా, చట్టం తన పని తాను చేసుకుపోతుందా లేదా రాజకీయ ఒత్తిళ్లు పని చేస్తాయా అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది.

పొలిటికల్ టర్న్..

రాజకీయ నేతల పిల్లలు చేసే కొన్ని పనులు.. నేతలకు తలనొప్పిగా మారుతున్నాయి. రాజకీయంగా ఇబ్బందులు తెస్తున్నాయి. తాజాగా కేంద్ర మంత్రి బండి సంజయ్ విషయంలో కూడా ఆయన కుమారుడు సాయి భగీరథ్ చేసే పనులు ఇబ్బందిగా మారుతున్నాయి. కష్టపడి సామాన్య కార్యకర్త నుంచి కేంద్ర మంత్రి వరకు సంజయ్ ఎదిగారు. మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లోని మహేంద్ర కాలేజీలో సహచర విద్యార్థిపై దాడి ఘటన సంచలనంగా మారింది. అప్పుడు సంజయ్ ఎంపీగా ఉన్నారు. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న సంజయ్ తనయుడిపై పోక్సో కేసు నమోదు కావడం ఇప్పుడు మరింత సంచలనంగా మారింది. ఇది క్రమంగా రాజకీయం రంగు పులుముకుంది. సంజయ్ ఎదుగుదలను ఓర్వలేకనే కొందరు కుట్ర చేస్తున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ నేతలు.. సంజయ్ తనయుడికి సంబంధించిన పాత ఘటనల ఫొటోలతోపాటు తాజా ఘటనల ఫొటోలు వీడియోలో సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. సంజయ్ తనయుడి కొడుకు అంటూ సంజయ్ ఇమేజ్ డ్యామేజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. సంజయ్ తనయుడిపై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై కేంద్ర మంత్రి తాజాగా స్పందించారు. ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'నాకు చట్టంపై గౌరవం, న్యాయ వ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంది. జీవితాంతం భారత రాజ్యాంగానికి కట్టుబడే ఉన్నాను. దశాబ్దాలుగా ప్రజలతోనే ఉన్న నేను మచ్చ లేని జీవితం గడిపానని గర్వంగా చెప్పగలను. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేక కొందరు నా పిల్లలను, కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగుతున్నారు. ఇది వారిలో గూడుకట్టుకున్న నిరాశ నిస్పృహలకు అద్దం పడుతుంది' అని పేర్కొన్నారు. అట్టడుగు స్థాయి నుంచే నా ప్రజా జీవితాన్ని మొదలుపెట్టాను. కష్టపడి పనిచేసి ప్రజల ఆశీర్వాదంతో నాడు కార్పొరేటర్ గా, నేడు ఎంపీగా ఎన్నికై, కేంద్రమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వెనకబడి వర్గాలకు చెందిన బీసీ వ్యక్తి, నాయకుడిగా కేంద్రమంత్రి స్థాయికి ఎదగడాన్ని కొన్ని శక్తులు జీర్ణించుకోలేక కుట్రలకు తెరతీశాయి' అని వెల్లడించారు.

# హస్తం లక్ష్యం ... ఆ ముగ్గురే...

కరీంనగర్, మే 11, (

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్.. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ... ఇక బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా మన్నె క్రిశాంక్..వీళ్లు ముగ్గురు సోషల్ మీడియా యాంటి సర్కార్ పోస్టులతో హోరెత్తిస్తున్నారు. దీంతో ఆ ముగ్గురు టార్గెట్‌గా అధికార కాంగ్రెస్ కూడా అన్నింటికీ రెడీ అయిపోయింది. బీఆర్ఎస్‌లోని ట్రిపుల్ కే పైనే అధికార పార్టీ సీరియస్ ఫోకస్ పెట్టిందా? అందుకే కేసులు, అరెస్టుల దాకా వ్యవహారం వెళు_ందా? రాజకీయ విశ్లేషణతెలంగాణలో టార్గెట్ పాలిటిక్స్ ట్రెండింగ్‌గా మారాయి. అధికార కాంగ్రెస్..ప్రతిపక్ష నేతల విమర్శలను, ఆరోపణలను తిప్పికొట్టడంలో పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి పెరుగుతున్న రాజకీయ దాడిని హస్తం పార్టీ వ్యూహాత్మకంగా తిప్పికొట్టే ప్లాన్ చేస్తోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, యువ నాయకుడు మన్నె క్రిశాంక్‌లను కంట్రోల్ చేసేందుకు అధికార పార్టీ పక్కా స్కెచ్ వేసి ముందుకు పోతోంది. ఈ మధ్య కాంగ్రెస్ సర్కార్‌పై పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాల్లో కేటీఆర్ అటాకింగ్ డోస్ పెంచారు. ఇష్యూ ఏదైనా..సబ్జెక్ట్ మరేదైనా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై గళమెత్తుతున్నారు కేటీఆర్. వరంగల్ రైతు సంగ్రామ సదస్సులో రేవంత్‌పై, అధికార పార్టీపై కాస్త గట్టిగానే అటాక్ చేశారు. 420 హామీలు, ఆరు గ్యారెంటీలు అట్టర్ ఫ్లాప్ అంటూ ప్రజాక్షేత్రంలో పవర్ ఫుల్ వాయిస్ వినిపించారు. సభలు, సమావేశాలతో ఎన్నికల మూడ్ లోకి వెళ్లిపోయిన బీఆర్ఎస్..ఇప్పటి నుంచి ఇక పూర్తిస్థాయిలో జనంలో ఉండేలా రూట్ మ్యాప్ రెడీ చేసుకుని గ్రౌండ్‌లోకి దిగుతోంది. ఇందులో భాగంగా ఆరు గ్యారంటీలు అటకెక్కాయంటూ..కాంగ్రెస్ సభలు పెట్టిన చోటే కౌంటర్ మీటింగ్స్ పెడుతూ కేటీఆర్ విమర్శల దాడిని పెంచుతూ వస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నుంచి మొదలు మంత్రులపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి కేటీఆర్ కొరకరాని కొయ్యగా మారడంతో..వ్యక్తిగత విమర్శలు, ఆరోపణలతో తమ నేత క్యారెక్టర్‌ను దెబ్బతీసే కుట్ర చేస్తున్నారని అంటోంది బీఆర్ఎస్. ఈ-కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ విచారణ వంటివి కేటీఆర్ ను కార్నర్ చేసే కుట్రలో భాగమేనంటున్నాయి బీఆర్ఎస్ వర్గాలు. ఇక హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి..అధికార కాంగ్రెస్‌పై అటాకింగ్‌కు ఏ మాత్రం వెనకాడట్లేదు. అసెంబ్లీ లోపల, బయట రేవంత్ సర్కార్‌పై దూకుడుగా విమర్శలు చేస్తున్నారు. స్థానిక సమస్యల నుంచి రాష్ట్ర రాజకీయాల వరకు తనదైన స్టైల్లో రెస్పాండ్ అవుతూ లైమ్‌లైట్‌లో ఉంటున్నారు. ఈ మధ్య కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై, అధికారులపై చేస్తున్న వ్యాఖ్యలు, విమర్శలు రాజకీయ దుమారానికి దారితీస్తున్నాయి. ముఖ్యమంత్రి నుంచి మొదలు, మంత్రులు, అధికారులపై కౌశిక్ రెడ్డి సంచలన ఆరోపణలు చేయడం చర్చనీయాంశమవుతోంది. ఈ క్రమంలోనే కౌశిక్ రెడ్డి అధికార కాంగ్రెస్ పార్టీకి టార్గెట్ అయిపోయారని బీఆర్ఎస్ నేతలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే పలు కేసులు కౌశిక్ పై నమోదుకాగా..తాజాగా కరీంనగర్ దాడి బీజేపీ చేసినా? దానికి కాంగ్రెస్ సహకారం ఉందంటూ మండిపడుతున్నారు బీఆర్ఎస్ నేతలు. ఇవన్నీ కౌశిక్‌ను సైలెంట్ చేసే ప్రయత్నాలే అంటున్నారు గులాబీ లీడర్లు. గత అసెంబ్లీ సెషన్‌లో కౌశిక్ రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్న అంశాన్ని ఎథిక్స్ కమిటీకి సిఫారసు చేశారంటే ఏ రేంజ్‌లో టార్గెట్ చేశారో అర్థం చేసుకోవచ్చంటున్నారు బీఆర్ఎస్ నేతలు.

మరోవైపు సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ సర్కార్‌పై పదునైన విమర్శలు, స్కామ్‌లు అంటూ ఆరోపణలు చేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మన్నె క్రిశాంక్‌పై వరుస కేసులు నమోదు అవుతున్నాయి. ఎక్స్ వేదికగా తన వాయిస్‌ను బలంగా వినిపిస్తున్న క్రిశాంక్..ప్రభుత్వంలో ఇంటర్నల్‌గా జరుగుతున్న అవినీతి వ్యవహారాలపై సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. దీంతో క్రిశాంక్ కూడా అధికార కాంగ్రెస్‌కు కంట్లో నలుసులా మారారని..అందుకే ఆయన్ను టార్గెట్ చేసి మరీ ఒక కేసు అయిపోకముందే మరో కేసులో కోర్టులు, జైళ్ల చుట్టూ తిప్పుతున్నారని మండిపడుతోంది బీఆర్ఎస్. సంబంధం లేని సెక్షన్ల కింద కేసులు పెట్టి జైలుకు పంపించారని అంటున్నారు. తమ పార్టీ తరఫున గట్టిగా మాట్లాడుతున్న నేతలను కాంగ్రెస్ కావాలనే టార్గెట్ చేస్తోందనేది గులాబీ పార్టీ వాదన. ఇలా బీఆర్ఎస్‌లో ట్రిపుల్ కే చుట్టూ కాంగ్రెస్ పార్టీ, పోలీసులు చక్కర్లు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గట్టిగా మాట్లాడే నేతలను ఇప్పటి నుంచే కంట్రోల్ చేయకపోతే..ఎన్నికల నాటికి మరింత చెలరేగిపోతారనేది సర్కార్ ఆలోచనగా కనిపిస్తోంది. దీనిని బీఆర్ఎస్ ఎలా ఎదుర్కొంటుందో చూడాలి.

# బీజేపీ అవకాశవాద రాజకీయాలను కడప ప్రజలు తిప్పికొట్టాలి

## మతోన్మాద శక్తుల కుట్రలు ప్రజలు అప్రమత్తంగా గమనించాలి

## –సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

కడప మే 11,

రాష్ట్రంలో బీజేపీ, మతోన్మాద శక్తులు అమలు చేస్తున్న అవకాశవాద రాజకీయాలను కడప ప్రజలు అప్రమత్తంగా గమనించాలని, ప్రజల అసలు సమస్యలను పక్కదారి పట్టించే కుట్రలకు లోనుకావద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడమే బీజేపీ ప్రధాన అజెండాగా మారిందన్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, కేంద్రం ఇచ్చిన హామీల అమలు వంటి కీలక అంశాలపై సమాధానం చెప్పలేని పరిస్థితిలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు మత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. 2018లో బీజేపీ ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్ ఇప్పటివరకు అమలు కాలేదని, కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటు హామీ పూర్తిగా గాలిలో కలిసిపోయిందని గుర్తుచేశారు. విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం నిధులు, పరిశ్రమల ఏర్పాటు వంటి అంశాలపై ప్రజలకు సమాధానం చెప్పకుండా మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టడం దుర్మార్గ రాజకీయమన్నారు. కడప నగరంలో కావాలనే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా కొన్ని మతోన్మాద శక్తులు వ్యవహరిస్తున్నాయని తప్పుపట్టారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో చంద్రబాబు.. కడపలోని అల్మాస్‌పేట సర్కిల్‌ను టిప్పు సుల్తాన్ సర్కిల్‌గా అభివృద్ధి చేస్తామని బహిరంగ సభలో ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం కడప కార్పొరేషన్ కూడా ఈ అంశంపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక ప్రతిపాదనలు పంపిందన్నారు. ఇప్పుడు అదే అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం మతోన్మాద శక్తులు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న పరిస్థితిని ఆసరాగా చేసుకొని కొందరు కావాలనే ఉద్రిక్తతలను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కడప నగరంలో సామరస్య వాతావరణాన్ని దెబ్బతీయాలనే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కడపలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను చల్లార్చాలని, అన్ని వర్గాల ప్రజలతో చర్చలు జరిపి మత సామరస్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కుట్రపూరితంగా ప్రజలను రెచ్చగొట్టే శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైతే దాని పూర్తి బాధ్యత చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనని ఈశ్వరయ్య హెచ్చరించారు. ప్రజలు మతం, కులం పేరుతో విడిపోకుండా ప్రజాస్వామ్య, లౌకిక విలువలను కాపాడాలని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపైనే రాజకీయ చర్చలు జరగాలని కోరారు.

# కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శిగా కంబాల శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక

సత్తెనపల్లి, మే 11, (

పిడబ్ల్యుడి వర్క్ షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ మహాసభ పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని అరండలపేట యూనియన్ ఆఫీస్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. పీడబ్ల్యుడి వర్క్ షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శిగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి చెందిన కంబాల శ్రీనివాస్ ను మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ, వర్క్ చార్జింగ్ సిబ్బంది సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నది కెనాల్స్ వర్కర్స్ యూనియన్ అని శ్రీనివాస్ గుర్తు చేశారు. శ్రీనివాస్ ఎన్ని కావటం పట్ల కెనాల్ వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి డివిజన్ గౌరవాధ్యక్షులు స్థానిక న్యాయవాది నరిశెటి వేణుగోపాల్, ఎఐటియుసి సత్తెనపల్లి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఈసిరెడ్డి అంజిరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు యల్లమంద, మస్తాన్ వలి, యేసయ్య, భాస్కర్, కిరణ్, ప్రజానాట్యమండలి సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, వల్లెం లక్ష్మీ చెన్నకేశవ, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు డీ.ఆర్. మస్తాన్, పోకల శంకర్, సిపిఐ సత్తెనపల్లి నియోజకవర్గం కార్యదర్శి ముసునూర్ రమేష్, ఎస్ టి యు రాష్ట్ర నాయకులు ఎస్ఎమ్ సుభాని, జిల్లా నాయకులు జె విజయ ప్రసాద్, ఎం అప్పారావు, కే సురేష్. టి రాజు, ఎస్ టి యు సత్తెనపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు పి వెంకయ్య, ఎస్ సుభాని, ప్రజా చైతన్య భారతి ఉపాధ్యక్షులు పి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి కె. ప్రేమ్ కుమార్, ప్రభుత్వ వైద్యశాల శానిటరీ అండ్ సెక్యూరిటీ గార్డుల వర్కర్స్ యూనియన్ నాయకులు రాము, జోసఫ్, శేఖరు, అన్నమ్మ, భారతి, భవాని, పట్టణ ప్రముఖులు తాండవ కృష్ణ, కే వెంకటేశ్వరరావు, ఎం వెంకటరావు, జర్నలిస్ట్ యూనియన్ పల్నాడు జిల్లా నాయకులు ఎస్ కె. సైదా, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎం ఏడుకొండలు, బి. సంగీతారావు, ఏపీఎస్ఆర్టీసీ హయ్యర్ బస్ డైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి డిపో అధ్యక్షులు కొలుసు యలమంద, కోశాధికారి టీ. ప్రదీప్ చంద్ర, యూత్ నాయకులు టి. తిరుపతిరావు, ఏ. కోటేశ్వరరావు, తదితరులు కంబాల శ్రీనివాస్ కు అభినందనలు తెలియజేశారు.

# మే 23 నుండి శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

## తిరుపతి, 2026 మే 27న గరుడసేవ

## మే 30న రథోత్సవం

## మే 18న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

కలియుగ వైకుంఠమైన తిరుపతిలో వెలసిన శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మే 23 నుండి 31వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మే 22వ తేదీ సాయంత్రం అంకురార్పణంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. భక్తజనుల గోవింద నామస్మరణల మధ్య స్వామివారు వివిధ వాహనాలపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు. ప్రతిరోజూ ఉదయం 7 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి. వాహనసేవల విశేషాలుమే 23 ? ధ్వజారోహణం, పెద్దశేష వాహనంఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమవుతాయి. రాత్రి పెద్దశేష వాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహించనున్నారు

.మే 24 చిన్నశేష, హంస వాహనాలుఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనంపై స్వామివారు విహరించనున్నారు. మే 25 ? సింహ, ముత్యపుపందిరి వాహనాలుఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనసేవ భక్తులను అలరించనున్నాయి. మే 26 ? కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలుఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనంపై స్వామివారు దర్శనమివ్వనున్నారు. మే 27 ? మోహినీ అవతారం, గరుడసేవఉదయం మోహినీ అవతారంలో స్వామివారు భక్తులను కటాక్షించనుండగా, రాత్రి జరిగే గరుడవాహనసేవ బ్రహ్మోత్సవాల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మే 28 ? హనుమంత, గజ వాహనాలుఉదయం హనుమంత వాహనం, రాత్రి గజవాహనసేవలు భక్తులను భక్తిరసంలో ముంచెత్తనున్నాయి.

మే 29 ? సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలుఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు ఊరేగనున్నారు.

మే 30 ? రథోత్సవం, అశ్వవాహనంఉదయం రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుండగా, రాత్రి అశ్వవాహనసేవ నిర్వహించనున్నారు.

మే 31 ? చక్రస్నానం, ధ్వజావరోహణంఉదయం చక్రస్నాన మహోత్సవం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు సంపూర్ణం కానున్నాయి. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మే 18న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనంబ్రహ్మోత్సవాల సందర్భంగా మే 18వ తేదీన ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 7 నుండి 9 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమమైన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితరాలను పవిత్రజలాలతో శుద్ధి చేసి, నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ తదితర సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన పవిత్ర మిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు.

# గ్రామీణ జీవనోపాధులను బలపరచడానికి 125 రోజుల చట్టబద్ధమైన ఉపాధి హామీ

**-ఉపాధి, జీవనోపాధులు, గ్రామీణ అభివృద్ధికి రూ.95,692 కోట్ల భారీ కేటాయింపు**

**-ప్రస్తుత జాబ్ కార్డులు చెల్లుబాటులోనే ఉంటాయి, కొనసాగుతున్న పనులు ఆగవు**

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, మే 11:

భారత గ్రామీణాభివృద్ధి చరిత్రలో మరో కీలకమైన అడుగు వేస్తూ, భారత ప్రభుత్వం 11 మే 2026న వికసిత భారత్ -- గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) : వికసిత భారత్-జీ రామ్ జీ చట్టం, 2025ను జూలై 1, 2026 నుంచి దేశమంతటా అమలు చేసేలా నోటిఫై చేసింది.

ఈ కొత్త చట్టం అమలులోకి వచ్చిన రోజు నుంచి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (మహాత్మా గాంధీ చీ=జు+ూా), 2005 రద్దు అవుతుంది. ఇది భారత గ్రామీణాభివృద్ధిలో చారిత్రక మార్పుకు నాంది. వికసిత భారత్ ఏ2047 లక్ష్యానికి అనుగుణంగా గ్రామాలను సమగ్రంగా, భవిష్యత్తు అవసరాలకు సరిపడేలా అభివృద్ధి చేయడమే దీని లక్ష్యం.

కొత్త చట్టం కింద, పని చేసేందుకు ముందుకొచ్చే వయోజన సభ్యులున్న ప్రతి గ్రామీణ కుటుంబానికి ప్రతి ఆర్థిక సంవత్సరంలో 125 రోజుల వేతన ఉపాధికి హామీ ఇస్తుంది. దీంతో గ్రామీణ కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడి, ఆదాయాలు పెరిగి, గ్రామ స్థాయిలో స్థిరమైన అభివృద్ధి జరుగుతుందని భావిస్తున్నారు.

పని కోసం అడిగిన కార్మికులకు నిర్ణీత గడువులోగా పని చూపించాల్సి ఉంటుంది. లేదంటే చట్టంలోని నిబంధనల ప్రకారం నిరుద్యోగ భత్యం చెల్లించాలి.

సకాలంలో, పారదర్శకంగా వేతనాలు చెల్లించడంపై ఈ చట్టం ప్రత్యేక దృష్టి పెట్టింది. వేతనాలు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (ఐడీ) ద్వారా నేరుగా కార్మికుల బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతాలకు పంపుతారు. వేతనాలు వారానికోసారి లేదా మస్టర్ రోల్ మూసిన 15 రోజులలోపు చెల్లించాలి; లేకపోతే చట్టం ప్రకారం ఆలస్య పరిహారం ఇవ్వాలి.

వికసిత భారత్ -- జీ రామ్ జీ చట్టం, 2025 సరిగ్గా అమలు చేయడానికి భారత ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు సమకూర్చింది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రూ.95,692.31 కోట్లు కేటాయించింది. గ్రామీణ ఉపాధి పథకానికి బడ్జెట్ అంచనా దశలో ఇంత వరకు జరిగిన అత్యధిక కేటాయింపు.

రాష్ట్రాల వాటాతో కలిపితే మొత్తం పథకానికి అయ్యే ఖర్చు రూ.1.51 లక్షల కోట్లు దాటుతుందని అంచనా. దీంతో గ్రామీణ మౌలిక సదుపాయాలు మెరుగుపడి, పెద్ద ఎత్తున ఉపాధి కల్పన జరిగి, గ్రామీణ ఆదాయాలు పెరుగుతాయని భావిస్తున్నారు.

కొత్త చట్టం అమలు తేదీ వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధీ హామీ పథకం కింద పనులు ఆగకుండా కొనసాగుతాయి. జూన్ 30 నాటికి కొనసాగుతున్న పనులు కొత్త చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా సజావుగా కొనసాగిస్తారు. గ్రామీణ కార్మికులకు సమయానికి పని దొరకడం, వేతనాలు వెంటనే చెల్లించడం ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత.

వికసిత భారత్-జీ రామ్ జీ చట్టం మొదలయ్యే ముందు అర్హత గల ఏ గ్రామీణ కుటుంబానికీ ఇబ్బంది కలగకుండా, డిమాండ్ తీరు, క్షేత్ర స్థాయి అవసరాలను బట్టి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు తగిన లేబర్ బడ్జెట్ ఏర్పాట్లు చేయబడ్డాయి.

గ్రామీణ రోజ్‌గార్ గ్యారెంటీ కార్డులు ఇచ్చే వరకు వ-ఖ్జ ధృవీకరించిన ప్రస్తుత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధీ హామీ పథకం జాబ్ కార్డులు వికసిత భారత్--జీ రామ్ జీ కింద చెల్లుబాటులో ఉంటాయి. జాబ్ కార్డు లేని కార్మికులు గ్రామ పంచాయతీ స్థాయిలో పేర్లు నమోదు చేసుకోవచ్చు. వ-ఖ్జ పెండింగ్‌లో ఉందని పని నిరాకరించరు; వ-ఖ్జ పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్ర స్థాయిలో సహాయం చేస్తాయి.

వికసిత భారత్--జీ రామ్ జీ చట్టం, 2025 కింద వివిధ నిబంధనల ముసాయిదాలను గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో కలిసి తయారు చేస్తోంది.

నిధుల పంపిణీకి సంబంధించిన నిబంధనలు

పాత పథకం నుంచి కొత్త పథకానికి మారే సమయానికి సంబంధించిన నిబంధనలు.

జాతీయ స్థాయి స్టీరింగ్ కమిటీ నిబంధనలు

కేంద్ర గ్రామీణ రోజ్‌గార్ గ్యారెంటీ కౌన్సిల్ నిబంధనలు

పరిపాలనా వ్యయం నిబంధనలు

ఫిర్యాదుల పరిష్కార నిబంధనలు

వేతనాలు, నిరుద్యోగ భత్యం చెల్లింపు విధానంపై నిబంధనలు

అదనపు వ్యయాన్ని భరించే విధానంపై నిబంధనలు

శాసనసభ లేని కేంద్రపాలిత ప్రాంతాల్లో పథకం ఖర్చులు భరించే నిబంధనలు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధీ హామీ పథకం నుంచి వికసిత భారత్--జీ రామ్ జీకి సజావుగా మారేందుకు పరివర్తన నిబంధనలలో తగిన ఏర్పాట్లు చేర్చబడుతున్నాయి; ఇవి త్వరలో విడుదల అవుతాయి. పైన పేర్కొన్న ఇతర నిబంధనలు కూడా తయారై, త్వరలో అందరి అభిప్రాయాల కోసం విడుదల చేయబడతాయి.

వికసిత భారత్ -- జీ రామ్ జీ చట్టం, 2025 ఉపాధి కల్పన, గ్రామీణాభివృద్ధి, గ్రామాల స్వావలంబనకు కొత్త శక్తి ఇస్తుందని భావిస్తున్నారు. గ్రామ పంచాయతీలను గ్రామీణ అభివృద్ధికి కేంద్ర బిందువుగా చేసే ఈ చట్టం, బలమైన, సంపన్నమైన, అభివృద్ధి చెందిన గ్రామీణ భారత్ నిర్మాణంలో ఒక చారిత్రక మైలురాయిగా నిలవనున్నది.

# సోమనాథ్- 1,000 ఏళ్ళు: కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్

**(సోమనాథ్: విశ్వాసం, తట్టుకోగల శక్తి, పునరుద్ధరణ, శాశ్వత లయ)**

శ్రీమద్ భగవద్గీతలోని ఈ శ్లోకం (2.20) యొక్క సారాంశం మరియు భారతీయ గ్రంథాలు, సంప్రదాయాలలో నిక్షిప్తమై ఉన్న నాగరికత జ్ఞానం, గుజరాత్ రాష్ట్రంలోని కతియావాడ్ దక్షిణ తీరంలో ఉన్న సోమనాథ్ ఆలయ సారాంశంలో ప్రతిబింబిస్తుంది. పన్నెండు జ్యోతిర్లింగాలలో మొదటిదిగా పరిగణించబడే ఈ ఆలయ గోడలు, అనేకసార్లు క్రూరమైన ఆక్రమణదారుల చేతిలో యుద్ధం యొక్క దెబ్బలను భరించాయి, కానీ మళ్ళీ మళ్ళీ పుంజుకుని ఆరాధన యొక్క గంటలను, డప్పులను మ్రోగించాయి. వెయ్యి సంవత్సరాలకు పైగా ఉన్న భారతీయ చరిత్రలో, సనాతన ధర్మం రాజకీయ విజయాలు, ప్రభుత్వ మార్పులు మరియు అధికార నిర్మాణాల మార్పుల వల్ల కలిగే అంతరాయాలను పదేపదే అనుభవించింది. ఈ అంతరాయాలలో దేవాలయాలు, మఠాలు మరియు విద్యా కేంద్రాల విధ్వంసం, అలాగే మతపరమైన సంస్థలను ఆదుకునే నెట్‌వర్క్‌ల స్థానభ్రంశం కూడా ఉన్నాయి. అయినప్పటికీ, ఈ విచ్ఛిన్నాల మధ్య కూడా, విస్తృతమైన మత సంప్రదాయం కాలక్రమేణా మనుగడ సాగించింది, తనను తాను మార్చుకుంది మరియు తిరిగి పుంజుకుంది. ఈ పట్టుదల యొక్క చారిత్రక ప్రాముఖ్యత నిరంతర ఆధిపత్యం గురించి కాదు, సంస్థాగత నష్టాన్ని మరియు రాజకీయ బలహీనతను తట్టుకుని నిలబడగలిగే మత జీవితం యొక్క సామర్థ్యం గురించి తెలియజేస్తుంది.



ప్రారంభ మధ్యయుగ కాలం నుండి, దేవాలయాలు కేవలం ప్రార్థనా స్థలాలే కాకుండా ఆర్థిక, సాంస్కృతిక మరియు రాజకీయ కేంద్రాలుగా కూడా పనిచేశాయి. పాలక వర్గాలతో వాటికున్న సన్నిహిత సంబంధం కారణంగా సైనిక సంఘర్షణల సమయంలో అవి దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉండేది. గజనీ మహమూద్ సోమనాథ్ ఆలయంపై జరిపిన దాడి ఇందుకు ఒక ప్రముఖ ఉదాహరణ. పర్షియన్ వృత్తాంతాలు దీనిని ఒక విజయంగా జరుపుకోగా, తరువాతి భారతీయ సంప్రదాయాలు నష్టం, ప్రతిఘటన మరియు చివరికి జరిగిన పునరుద్ధరణను నొక్కి చెప్పాయి. చారిత్రక వాస్తవం ఏమిటంటే, ఆలయం మత జీవితం నుండి అదృశ్యం కాలేదు; ఇది చౌలుక్యుల వంటి ప్రాంతీయ పాలకుల ఆధ్వర్యంలో పునర్నిర్మించబడింది మరియు భక్తిని ఆకర్షిస్తూనే ఉంది. ఇటువంటి పోకడలు ఇతర చోట్ల కూడా కనిపిస్తాయి.

సోమనాథ్ చరిత్రను ఎప్పుడూ ఒక్క సంఘటనకే పరిమితం చేయకూడదు. ప్రాచీన కాలం నుండి ప్రభాస్ పటాన్ ఒక పవిత్ర ప్రాంతం. ప్రభాస్-పటాన్, శివ-పటాన్ మరియు ప్రభాస్-తీర్థ వంటి వివిధ పేర్లతో పిలువబడే ఈ పట్టణం సమీపంలో మూడు అందమైన నదులు త్రివేణి వద్ద సంగమిస్తాయి; శ్రీకృష్ణుని అంత్యక్రియలు జరిగిన ఈ ప్రాంతం అత్యంత పవిత్రమైనది. దీని పొరుగునే వైరాగ్య క్షేత్రం మరియు గోపీ తలావ్ (ప్రజలు గోపీ చందనం పొందే ప్రదేశం) ఉన్నాయి. ఈ పవిత్ర భూమిని సందర్శించకుండా ఈ ప్రాంతానికి చేసే తీర్థయాత్ర అసంపూర్ణంగా పరిగణించబడుతుంది. ఈ ప్రాంతంలో కనిపించే శిథిలాల వివరాలను 'రిపోర్ట్ ఆన్ ది యాంటిక్విటీస్ ఆఫ్ కతియావాడ్ అండ్ కచ్' మరియు 'ది యాంటిక్విటీస్ ఆఫ్ ది టౌన్ ఆఫ్ దభోయ్ ఇన్ గుజరాత్' వంటి నివేదికలలో చూడవచ్చు. సోమనాథ్ శైవ మరియు వైష్ణవ సంప్రదాయాల అరుదైన సంగమానికి నిదర్శనం, భారతీయ వారసత్వం ఎల్లప్పుడూ వైవిధ్యభరితమైనది మరియు సమ్మిళితమైనది అని ఇది మనకు పదేపదే గుర్తుచేస్తుంది.

స్వతంత్ర భారతదేశంలో సోమనాథ్ చరిత్రలో ఆధునిక అధ్యాయం 12 నవంబర్ 1947న దీపావళి రోజున ప్రారంభమైంది; దేశ విభజన జరిగిన కొద్ది నెలలకే మన మొదటి ఉప ప్రధాన మంత్రి మరియు హోం మంత్రి సర్దార్ పటేల్ ఈ పవిత్ర భూమిని సందర్శించారు. సీనియర్ నాయకులు మరియు ప్రముఖ వ్యక్తులతో కలిసి, సర్దార్ పటేల్ ఈ చారిత్రక ఆలయాన్ని పునర్నిర్మించే నిర్ణయం తీసుకున్నారు. దీని ఫలితంగా జాతీయ చైతన్యాన్ని చాటే ఒక సంస్థాగత వ్యవస్థ ఏర్పడింది. సోమనాథ్ కేవలం ఒక పుణ్యక్షేత్రం యొక్క పునర్నిర్మాణంగానే కాకుండా, సాంస్కృతిక మరియు మేధో కేంద్రంగా కూడా భావించబడింది. 11 మే 1951న భారత రాష్ట్రపతి శ్రీ రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో జరిగిన ప్రతిష్ఠాపన వేడుక దేశం యొక్క ఉమ్మడి సాంస్కృతిక స్మృతిని పునరుద్ఘాటించింది.

భారతదేశం 2047 లక్ష్యం దిశగా పయనిస్తున్న తరుణంలో, ఈ నాగరికత విలువలు సరికొత్త ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయి. సాంకేతిక వేగం మరియు భౌగోళిక రాజకీయ అనిశ్చితి ఉన్న ఈ కాలంలో, పురోగతి అంటే మానవత్వాన్ని వదిలిపెట్టడం కాదని, అధికారం అంటే నియంత్రణను కోల్పోవడం కాదని నిరూపించడమే భారతదేశం మానవాళికి ఇచ్చే కానుక. సోమనాథ్ యొక్క పట్టుదల మనకు గుర్తుచేసేది ఏమిటంటే, జాతీయ మరియు ప్రపంచ నాయకత్వం కేవలం బలంతోనే కాకుండా జ్ఞానం, స్మృతి మరియు మానవ గౌరవం పట్ల ఉన్న అచంచలమైన నిబద్ధతతోనే నిలబడుతుంది.

లిలిసోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ 2026-27లిలి అనేది గుజరాత్‌లోని ప్రభాస్ పటాన్ వద్ద ఉన్న శ్రీ సోమనాథ్ జ్యోతిర్లింగం ప్రతిబింబించే నాగరికత వారసత్వం, ఆధ్యాత్మిక శక్తి మరియు సాంస్కృతిక కొనసాగింపును చాటిచెప్పేలా ఏడాది పొడవునా జరిగే జాతీయ స్మారక ఉత్సవం. భారతదేశ నాగరికత చరిత్రలో సోమనాథ్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. శతాబ్దాలుగా పదేపదే ధ్వంసమైనప్పటికీ, ప్రజల సామూహిక సంకల్పంతో ఈ ఆలయం మళ్ళీ మళ్ళీ నిర్మించబడింది; ఇది సాంస్కృతిక కొనసాగింపుకు మరియు జాతీయ ఆత్మవిశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది.

సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ (జనవరి 8-11, 2026 నుండి ప్రారంభమైంది) భారతదేశ నాగరికత ప్రయాణంలో రెండు ముఖ్యమైన మైలురాళ్లను సూచిస్తుంది: 1026లో సోమనాథ్ ఆలయంపై జరిగిన మొదటి దాడి నుండి వెయ్యి సంవత్సరాలు మరియు స్వాతంత్ర్యం తర్వాత 1951లో పునర్నిర్మించిన ఆలయాన్ని ప్రారంభించి డెబ్బై ఐదు సంవత్సరాలు. తద్వారా సోమనాథ్‌ను ఓర్పు, సామూహిక స్మృతి మరియు సాంస్కృతిక ఆత్మగౌరవానికి ఐక్య జాతీయ చిహ్నంగా నిలుపుతోంది. ఈ వేడుకలు 11 మే 2026న ఒక భారీ జాతీయ కార్యక్రమంతో ముగుస్తాయి; దీనికి మద్దతుగా దేశవ్యాప్తంగా జ్యోతిర్లింగాలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, జిల్లాలు మరియు శివాలయాలలో యాత్రలు, సాంస్కృతిక ప్రదర్శనలు, చర్చలు మరియు విద్యా కార్యక్రమాలు నిర్వహించబడతాయి. శ్రీ సోమనాథ్ ట్రస్ట్ అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్న గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, సోమనాథ్ సమగ్ర పునరుద్ధరణ దశలోకి ప్రవేశించింది. పాలనా సంస్కరణలు, మౌలిక సదుపాయాల మెరుగుదల, వారసత్వ పరిరక్షణ మరియు సాంస్కృతిక కార్యక్రమాలు ఈ ఆలయాన్ని ఒక సజీవ ఆధ్యాత్మిక కేంద్రంగా బలోపేతం చేశాయి. పర్యావరణ పరిరక్షణ చర్యలు మరియు మహిళా నేతృత్వంలోని సేవా కార్యక్రమాలు నాగరికత విలువలు సమకాలీన బాధ్యత మరియు సమ్మిళితత్వం ద్వారా ఎలా వ్యక్తమవుతున్నాయో ప్రతిబింబిస్తాయి. సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ సాంస్కృతిక, ఆధ్యాత్మిక మరియు విద్యా కార్యకలాపాల ద్వారా ఆధునిక సమాజానికి మరియు దాని సంస్కృతి యొక్క లోతైన సారాంశానికి మధ్య సంబంధాన్ని ఏర్పరుస్తుంది. సోమనాథ్ ఆలయం కేవలం దాని భౌతిక ఉనికి గురించి మాత్రమే కాదని, దాని నిజమైన సారాంశం ఒక తరం నుండి మరొక తరానికి స్పృహతో బదిలీ చేయబడే విలువలు మరియు బాధ్యతలలో ఉందని ఇది ప్రతి తరానికి గుర్తు చేస్తుంది. ఈ స్ఫూర్తితో, సోమనాథ్ నేడు కేవలం పునరుద్ధరించబడిన క్షేత్రంగానే కాకుండా, ఒక సజీవ తీర్థంగా నిలుస్తోంది. భారతదేశం ఇరవై ఒకటవ శతాబ్దంలో తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న వేళ, సోమనాథ్ స్ఫూర్తి ఒక మార్గదర్శక సూత్రాన్ని అందిస్తుంది: ఒక నాగరికత తన మూలాలలో బలంగా ఉన్నప్పుడు, పరిస్థితులకు అనుగుణంగా మారినప్పుడు మరియు సమ్మిళితంగా ఉన్నప్పుడు మాత్రమే అది శక్తివంతంగా మరియు ఐక్యంగా ఉంటుంది. సోమనాథ్ వారసత్వం మనల్ని నిరంతరం ప్రేరేపిస్తూ ఉండాలి - ఉద్దేశపూర్వకంగా నిర్మించడానికి, సమతుల్యతతో వ్యవహరించడానికి మరియు మనం ఎవరో అనే లోతైన అవగాహనతో ముందుకు సాగడానికి.

**జై సోమనాథ్! వందేమాతరం!**

# సోమనాథ్ నుంచి సిందూరం వరకు --- పునరుజ్జీవిస్తున్న భారతదేశ స్ఫూర్తి: కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

75 ఏళ్ల క్రితం జరిగిన అద్భుతమైన సోమనాథ్ పవిత్ర పుణ్యక్షేత్ర పునర్నిర్మాణం, ప్రతిష్ఠాపన, భారతదేశ నాగరిక వైభవాన్ని పునజీవింప చేయడంలో ఒక కీలక ఘట్టంగా నిలిచింది. ఇంకా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, శ్రీకారం చుట్టిన 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి మూలస్తంభాలైన భారతదేశ స్థైర్యాన్ని, సంకల్పబలాన్ని ఇది మరోసారి దృఢపరిచింది.



ఈ పవిత్రమైన కీలక ఘట్టం 75వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటుంది. ఈ తరుణం, గత వెయ్యిళ్లుగా మతోన్మాదులు ఈ ఆలయంపై జరిపిన దాడులను తట్టుకుని మరింత బలంగా నిలిచిన భారతీయ నాగరికత దృఢమైన పునాదిపైనా, శక్తిపైనా దేశానికి అపారమైన విశ్వాసాన్ని ఇస్తుంది. ప్రతి దాడి అనంతరం, గుజరాత్ ప్రశాంత సముద్ర తీరంలోని ఈ ఆలయం శిథిలాల నుంచి తన పూర్వ వైభవాన్ని పునరుద్ధరించుకుంది. ఈ ఆలయం అనేక విధాలుగా దేశ చరిత్రను ప్రతిబింబిస్తుంది. శాంతియుతమైన, ప్రియమైన మన ప్రజలు వారి విశ్వాస వ్యవస్థలు, సంస్కృతి, వారసత్వంపై జరిగిన క్రూరమైన దాడుల నుంచి తిరిగి పుంజుకున్నారు. ప్రధాని మోదీ చెప్పినట్లుగా, సోమనాథ్‌ను నాశనం చేసేందుకు పదేపదే ప్రయత్నాలు, కుట్రలు జరిగినట్లే, విదేశీ దురాక్రమణదారులు శతాబ్దాలుగా భారతదేశాన్ని తుడిచిపెట్టేందుకు ప్రయత్నించినప్పటికీ, ఈ పుణ్యక్షేత్రం గానీ, దేశం గానీ నాశనం చేయలేకపోయారు. సోమనాథునిపై జరిగిన దాడుల వెనుక ఉన్న ఉద్దేశం కేవలం దోపిడీ చేయడం కంటే ఎంతో దుర్మార్గమైనదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. "ఒకవేళ ఈ దాడులు కేవలం దోపిడీ కోసమే జరిగినట్లయితే, వెయ్యి ఏళ్ల క్రితం చేసిన తొలి భారీ దోపిడీతోనే అవి ఆగిపోయి ఉండేవి. కానీ నిజం అది కాదు. సోమనాథుని పవిత్ర విగ్రహాన్ని అపవిత్రం చేసి, ఆలయ స్వరూపాన్ని పలుమార్లు మార్చారు. అయినా సరే, సోమనాథ ఆలయాన్ని కేవలం దోపిడీ కోసమే ధ్వంసం చేయలేదని మనకు బోధిస్తుంది.""ద్వేషం, అణచివేత, భీభత్సంతో కూడిన క్రూరమైన చరిత్రను మన నుంచి దాచిపెట్టారు," అని ఆయన అన్నారు. నెహ్రూ ప్రతిఘటన - స్వాతంత్ర్యం తరువాత, సర్దార్ పటేల్ సోమనాథ్ పునర్నిర్మాణ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ఇది స్వాతంత్ర భారతదేశంలో జాతీయ ఆత్మవిశ్వాసానికి తొలి నిదర్శనం. కానీ ఇది కూడా అడ్డంకులను ఎదుర్కొంది. భారతదేశపు మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, ఆ చారిత్రక ప్రారంభోత్సవానికి హాజరవ్వాలన్న అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ నిర్ణయాన్ని అధికారికంగా వ్యతిరేకించారు. కానీ రాష్ట్రపతి 1951 మే 11న ఆ ఆలయాన్ని ప్రారంభించారు. శతాబ్దాల క్రూరమైన అణచివేత తర్వాత, ఈ పునర్నిర్మాణం భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవనానికి, నాగరికతకు బీజాలు వేసింది. ఉజ్జయిన్‌లోని కాశీ విశ్వనాథ, మహాకాళేశ్వర ఆలయాల పునరుద్ధరణ నుంచి అయోధ్యలోని భవ్యమైన రామ మందిరం వరకు; కేదార్‌నాథ్ పునరుజ్జీవనం నుంచి లెక్కలేనన్ని వారసత్వ ప్రదేశాల పరిరక్షణ వరకు, భారతదేశం తన నాగరికతా కథనాన్ని గౌరవంగా, సార్థకంగా తిరిగి పొందుతోంది. ఈ ప్రయత్నాలు సందర్శకులను పెంచుతున్నాయి. స్థానిక ప్రజలకు అనేక ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలను కల్పిస్తున్నాయి. ప్రపంచవ్యాప్త ప్రభావం - సోమనాథ్ వలె, భారతదేశం మరింత బలంగా ఆవిర్భవించింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా మరియు గొప్ప వారసత్వంతో ఆధునికతను విలక్షణంగా మేళవించే దేశంగా ఇది ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. 2014లో, దేశం మోదీ ప్రభుత్వాన్ని ఘనంగా ఎన్నుకున్న తర్వాత, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పాటించాలని రికార్డు స్థాయిలో 175 దేశాల ఆమోదంతో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. యోగా ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అన్ని సంస్కృతుల ప్రజలకు ప్రయోజనం చేకూర్చిన ఒక ప్రపంచ ఆరోగ్య ఉద్యమంగా మారింది. ఒక దశాబ్దం తర్వాత, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం బహుమతిగా ఇచ్చిన మధ్యప్రాచ్య భూమిలో ప్రధాని మోదీ ఒక భవ్యమైన ఆలయాన్ని ప్రారంభించారు. అంతకుముందు, బహ్రెయిన్‌లో 200 ఏళ్ల పురాతన ఆలయ పునరుద్ధరణను ప్రధాని ప్రారంభించారు. ఆయన ప్రవాస భారతీయులతో కూడా క్రమం తప్పకుండా సంభాషిస్తూ, వారిని భారతీయ సాంస్కృతిక వారసత్వానికి గర్వించదగిన రాయబారులుగా తీర్చిదిద్దుతున్నారు. ఆయుష్ ఁ యోగాను ప్రపంచీకరించడం -- భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహించడం, మన సాంప్రదాయ జ్ఞాన వ్యవస్థల నిపుణులకు ప్రపంచవ్యాప్త అవకాశాలను సృష్టించడం అనేది, ఇటీవలి కాలంలో భారత్ అభివృద్ధి చెందిన దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పరంపరలో ఒక కీలక అంశంగా ఉంది. మన కళాకారులు, కార్మికులు, రైతులు, మత్స్యకారులు, చిన్న వ్యాపారాలు, స్టార్టప్‌లకు లాభదాయకమైన ప్రపంచవ్యాప్త అవకాశాలను సృష్టించడమే కాకుండా, ఈ వాణిజ్య ఒప్పందాలు 'వికాస్ భీ, విరాసత్ భీ' అనే ప్రధానమంత్రి దార్శనికతను ముందుకు తీసుకువెళ్తున్నాయి. న్యూజిలాండ్‌తో ఇటీవల ముగిసిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారతదేశ సాంప్రదాయ వైద్యం, సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ రంగాలలో ప్రపంచవ్యాప్తంగా విస్తరించే అంశంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఇది ఆయుష్ వైద్యులు, యోగా శిక్షకులతో పాటు ఇతర భారతీయ సాంస్కృతిక, విజ్ఞాన నిపుణులు న్యూజిలాండ్‌లో పనిచేయడానికి వీలుగా వీసాలను అందిస్తుంది.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఆయుర్వేదం, యోగా, ఇతర సాంప్రదాయ వైద్య సేవల వాణిజ్యానికి అధికారికంగా అనుకూలమైన వ్యవస్థను కల్పిస్తుంది మరియు ఆయుష్‌ను ప్రపంచవ్యాప్తంగా ఒక సమకాలీన ఆరోగ్య సంరక్షణ పరిష్కారంగా నిలుపుతుంది. యూకే, ఈయూ, ఆస్ట్రేలియాలతో ఉన్న వాణిజ్య ఒప్పందాలలో కూడా ఇలాంటి నిబంధనలే ఉన్నాయి. యూరోపియన్ యూనియన్‌తో కుదిరిన స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం, ఆయుష్ వైద్యులు భారతదేశంలో పొందిన వృత్తిపరమైన అర్హతలను ఉపయోగించి వారి సేవలను అక్కడ అందించేందుకు అనుమతిస్తుంది. ఇది ఈయూ సభ్య దేశాలలో ఆయుష్ వెల్నెస్ సెంటర్లు, క్లినిక్‌ల స్థాపనకు కూడా సౌకర్యం కల్పిస్తుంది.

కొత్త ముప్పులను నిర్మూలిస్తూ విజయాన్ని సాధించడం - భారతదేశ సాంస్కృతిక వారసత్వం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నప్పటికీ, ఉగ్రవాదం మరియు చొరబాట్లను ఉపయోగించి భారతదేశ సామరస్య వారసత్వానికి భంగం కలిగిస్తున్న మతోన్మాదులకు ఈ దేశం ఇంకా లక్ష్యంగానే ఉంది. ప్రధాని మోదీ నాయకత్వంలోని నూతన భారతదేశం ఇటువంటి ముప్పులకు శక్తివంతంగా ప్రతిస్పందిస్తుంది. ఆపరేషన్ సింధూర్‌తో, భారతదేశం సీమాంతర ఉగ్రవాదులకు, వారి మద్దతుదారులకు గుణపాఠం చెప్పింది. ఇక ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో, చొరబాటుదారులకు మద్దతు ఇస్తూ, ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ, భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని దెబ్బతీస్తున్న పార్టీలను పశ్చిమ బెంగాల్ ఓటర్లు తిరస్కరించారు.

ముఖ్యంగా, ఆపరేషన్ సింధూర్, సోమనాథ ఆలయ పునర్నిర్మాణ వార్షికోత్సవాలు కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే ఉన్నాయి. ఈ రెండూ భారతదేశపు స్థితిస్థాపకతను, బలాన్ని చాటుతున్నాయి. సోమనాథ్ కథ చివరికి రాజకీయాలకు అతీతమైనది. ఇది లొంగుబాటుకు నిరాకరించిన ఒక నాగరికత కథ. పునర్నిర్మాణం జరిగిన డెబ్బై ఐదు సంవత్సరాల తర్వాత, సోమనాథ్ కేవలం ఒక ఆలయంగానే కాకుండా, భారతదేశపు స్థితిస్థాపకత, కొనసాగింపు, జాతీయ విశ్వాసానికి ఒక శాశ్వత చిహ్నంగా నిలుస్తుంది.

# తన బలాన్ని తిరిగి పుంజుకుంటున్న బెంగాల్:కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి

హౌరాను ఒకప్పుడు ఆసియా షెఫీల్డ్ గా పిలిచేవారు. హుగ్లీ నది తీరాన ఉన్న జనపనార మిల్లులు భారత ఉపఖండంలోనే అతిపెద్ద వ్యవస్థీకృత పరిశ్రమలకు కేంద్రంగా ఉండేవి. బిర్లాలు, టాటాలకు, ఐటీసీ, బ్రిటానియా, కోల్ ఇండియా, హిందుస్థాన్ మోటార్స్, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ వంటి సంస్థల ప్రధాన కార్యాలయాలకు కేంద్రంగా ఉంటూ, కోల్‌కత్తా భారతదేశ వాణిజ్య రాజధానిగా ఉండేది. బర్న్‌పూర్‌లోని ఐఐఎస్‌సీఓ 1918 నాటిది. దుర్గాపూర్ స్టీల్ ప్లాంట్ రెండవ పంచవర్ష ప్రణాళిక కాలం నాటిది. 1950-51లో దేశ తయారీ రంగ ఉత్పత్తిలో బెంగాల్ సుమారు 27 శాతం వాటాను కలిగి ఉండేది. నాకు ఆ కలకత్తా తెలుసు. నేను ఫారిన్ సర్వీస్‌లో చేరకముందు, నా తొలి ఉద్యోగాలలో ఆ నగరంలోని హిందుస్థాన్ లీవర్ సంస్థలో. ఒక యువకుడు తన సామాను పెట్టెతో వచ్చినా, దేశ వాణిజ్యం జరిగే ప్రదేశానికే వచ్చానని నిశ్చింతగా ఉండగలిగే ప్రదేశంగా అప్పట్లో కోల్‌కత్తా ఉండేది. దీపాలు వెలుగుతూ, ట్రామ్‌లు తిరుగుతూ, కంపెనీలు ఉద్యోగులను నియమించుకుంటూ ఉండేవి.



కేవలం ఒక ఆర్థిక దుర్వినియోగానికి మించిన ఉద్దేశపూర్వకమైన ఒక చర్య ఒక శతాబ్ద కాలం పాటు నిర్మించిన బెంగాల్ ను కూల్చివేసింది. 1977లో లెఫ్ట్ ఫ్రంట్ అధికారంలోకి వచ్చి ముప్పై నాలుగు ఏళ్ల పాటు పాలించింది. కార్మిక వర్గం అనే మాటల చాటు నుంచి, ఒక వ్యవస్థీకృత నీడ రాజ్యాన్ని వేళ్లూనుకుంది. కట్టడాలు కట్టేందుకు, దుకాణాలను నిర్వహించేందుకు, బట్టీ పెట్టేందుకు, రవాణా మార్గ నమోదుకు, పంచాయతీ సమావేశాన్ని నిర్వహించేందుకు అనుమతి తీసుకోవాలంటే వాటా ఇవ్వాల్సి ఉండేది. కార్యకర్తలు డబ్బు వసూలు చేశారు. పార్టీ ఆ డబ్బును బ్యాంకులో జమ చేసుకుంది. పెట్టుబడిదారులను తరిమికొట్టిన కార్మిక సంఘవాదం మాత్రమే కంటికి కనిపించేది. పౌరులను తరిమికొట్టిన దోపిడీ ఎవరికి కనిపించేది కాదు. 2000వ దశకంలో, లెఫ్ట్ ఫ్రంట్ స్వయంగా తన వైఖరిని మార్చుకుని టాటా మోటార్స్‌ను సింగూర్‌కు తీసుకొచ్చేందుకు ప్రయత్నించినప్పుడు, ప్రతిపక్షంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ నిరాహార దీక్ష చేపట్టి, 2008లో ఆ ప్రాజెక్టును గుజరాత్‌కు వెళ్లిపోయేలా చేసింది. అలాంటి మాఫియా రంగులను మార్చుకుంది కానీ కనుమరుగవలేదు.

మార్పు అనే వాగ్దానంతో 2011లో తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత కొత్త రూపంలో అదే పాత వ్యవస్థను అమలు చేసింది. పొందిన సేవలకు వాటాను ఇవాల్సిందే. కార్యకర్తలు సిండికేట్‌గా అవతరించారు. జాతీయ తయారీ రంగంలో బెంగాల్‌కు ఉన్న 27 శాతం వాటా 5 శాతం కన్నా తక్కువకు క్షీణించింది. ఒకప్పుడు జాతీయ సగటులో 127 శాతంగా ఉన్న తలసరి ఆదాయం 84 శాతానికి పడిపోయింది. ఆరు వేలకు పైగా నమోదిత కంపెనీలు వాటి ప్రధాన కార్యాలయాలను కోల్‌కత్తా నుంచి ఇతర ప్రాంతాలకు తరలించాయి. ఒకప్పుడు హౌరా లేదా సాల్ట్ లేక్‌లో పనిచేసే బెంగాల్ పిల్లలు ఇప్పుడు బెంగళూరు, హైదరాబాద్, పూణేలలో నివసిస్తున్నారు. వారి ఉద్యోగాలు, డబ్బు రాష్ట్రం విడిచి వెళ్ళిపోవడాన్ని చూసిన ఆ ఓటర్లు, వారి ఓటుతో లెక్క చెప్పారు.

స్వతంత్ర భారతదేశంలో అధికారంలో ఉన్న ఏ పాలకులైన సమర్థించుకోవాల్సిన అవసరం లేని అంశం, మహిళల పట్ల జరిగే సంఘటన, ఇదే మొత్తం వ్యవహారానికి కేంద్రబిందువుగా నిలిచింది. ఒక మహిళా ముఖ్యమంత్రి తన రాష్ట్రంలోని మహిళలపై జరిగిన హింసకు, హత్యలకు మూలమయ్యారు. ఆగష్టు 2024లో ఆర్.జి. కార్ మెడికల్ కాలేజీలో ఒక పోస్ట్ గ్రాడ్యుయేట్ శిక్షణ వైద్యురాలి పై అత్యాచారం, హత్య జరగడమే ఇందుకు నిదర్శనం. నేరం జరిగిన ప్రదేశంలో రాత్రంతా ఒక మూక విధ్వంసం సృష్టించగా, కోల్‌కతా పోలీసులు దానిని నివారించేందుకు నిరాకరించారు. కోల్‌కత్తా పోలీసుల విచారణ పై విశ్వాసాన్ని కలిగించలేదని నిర్ధారించిన కలకత్తా హైకోర్టు, దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు బదిలీ చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. చాలామంది మహిళ జూనియర్ డాక్టర్లు నలభై రెండు రోజుల పాటు సమ్మె చేయడమే ఇందుకు మూల కారణం.

సందేశ్‌ఖాలి, జనవరి 2024. యాభై ఐదు రోజులుగా పరారీలో ఉన్న తృణమూల్ జిల్లా పరిషత్ సభ్యుడికి వ్యతిరేకంగా సుందర్‌బన్స్‌లోని ఒక ద్వీపానికి చెందిన మహిళలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. అయితే రాష్ట్ర పోలీసులు ఈ విషయంలో ఎలాంటి కేసు నమోదు చేయలేదు. ఒకప్పుడు మార్పు గురించి ప్రస్తావించిన గెలిపొందిన ముఖ్యమంత్రి, తన రాష్ట్రంలోని సొంత పాలన కేడర్‌కు వ్యతిరేకంగా ఉన్న మహిళలు వారి భద్రత కోసం కోర్టులు, కేంద్ర ఏజెన్సీలను, వీధులను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇది ఖండించదగిన, అమానుషమైన విషయం.

బెంగాల్ మహిళలు భరించిన కష్టాలకు, ఆ రాష్ట్ర యువత త్యాగం చేసిన త్యాగాలు మాత్రమే సాటి. మొదటి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదా జరిగిన రాత్రి సాల్ట్ లేక్‌లోని తాళం వేసి ఉన్న ఒకే ఫ్లాట్ నుంచి ఇరవై ఒక్క కోట్ల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. దానికి అనుబంధంగా ఉన్న ఆస్తుల ద్వారా జరిపిన తదుపరి స్వాధీనాలతో మొత్తం యాభై కోట్ల రూపాయలు దాటింది. విద్యాశాఖ మంత్రిగా పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌కు అధ్యక్షత వహించిన, అప్పటి క్యాబినెట్ మంత్రి పార్థ చటర్జీని అరెస్టు చేయడం. తొలిదశలోనే చట్టవిరుద్ధమని తేలిన ఒక నియామకం కింద, ఇరవై ఐదు వేల ఏడు వందల యాభై మూడు మంది ఉపాధ్యాయులు, గ్రూప్-సి మరియు గ్రూప్-డి సిబ్బంది నియామకాలను ఏప్రిల్ 2024లో కలకత్తా హైకోర్టు రద్దు చేసింది. అయితే, ఈ తీర్పు సుప్రీంకోర్టుకు వెళ్లగా 2025లో దాన్ని సమర్థించారు.

బెంగాల్ యువతకు జీవితంలో ఒక స్థానం కల్పించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ మొత్తం పాఠశాల నియామక ప్రక్రియ, పదవులను అమ్ముకునే కౌంటర్‌గా మారిపోయింది. అక్కడ అర్హులైన అభ్యర్థులకు క్యూ కూడా కనిపించలేదు. ఈ కుంభకోణానికి తోడు, మరో సిట్టింగ్ క్యాబినెట్ మంత్రి జ్యోతిప్రియా మాలిక్‌ను ఇరికించిన రేషన్ కుంభకోణం కూడా ఉంది. దానికి తోడు పశువుల కుంభకోణం, కట్-మనీ సంస్కృతి, సిండికేట్ రాజ్ వ్యవస్థలు కూడా ఉన్నాయి. వీటన్నింటి మధ్య ఉన్న సంబంధాన్ని ఓటర్లు అర్థం చేసుకున్నారు. మాఫియా నడిపే రాష్ట్రంలో, లంచం ఇచ్చేందుకు నిరాకరించే పౌరుడే మొదటగా నష్టపోతాడు.

ఈ రికార్డుకు పోటీగా మరో రకమైన రికార్డు నిలిచింది. గత దశాబ్ద కాలంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద నాలుగు కోట్ల ఇరవై ఒక్క లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. 2019లో మూడు కోట్ల నీటి కనెక్షన్లు ఉండగా, జల్ జీవన్ మిషన్ కింద పదిహేను కోట్ల కుళాయి నీటి కనెక్షన్లు అందించారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా సుమారు యాభై ఐదు కోట్ల మంది లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయల వార్షిక కవరేజీ లభించింది. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా, ఒకప్పుడు బెంగాల్‌లోని ప్రతి సంక్షేమ కార్యక్రమానికి నిర్వచనంగా నిలిచిన లీకేజీ వ్యవస్థ కనుమరుగైంది. ఇవేవీ కేవలం ఊహాజనితాలు కావు. బెంగాల్‌లోని ప్రతి భారతీయ జనతా పార్టీ కార్యకర్త ఓటు అడిగినప్పుడు చూపిన ప్రామాణికాలు ఇవి.

దీని వెనుక ఒక బలమైన వ్యవస్థ ఉంది. ఎన్నికల కాలమంతా బెదిరింపులు, భయపెట్టడాలు, శారీరక హింసను సహించిన పార్టీ బూత్ స్థాయి కార్యకర్తలు, పన్నా ప్రముఖులు, ఇతర పార్టీలు విడిచిపెట్టిన పరిస్థితులలో ఓటర్ల నమోదు, రవాణా, పోలింగ్ కేంద్రాలకు రప్పించడం వంటి పనులను కూడా చేశారు. ప్రధానమంత్రి, హోంమంత్రిపై బెదిరింపులు, కేంద్ర బలగాలు వెళ్ళిపోయాక ఏమి జరుగుతుందనే ప్రకటనలు, ఎన్నికల అనంతర హింసాకాండ, అంతకుముందు జరిగిన ప్రాణనష్టం వంటివి కార్యకర్తకు గుర్తు చేయాల్సిన అవసరం లేదు. వాటన్నింటినీ ఓటర్లు స్వయంగా చూశారు. గౌరవనీయ హోంమంత్రి శ్రీ అమిత్ షా, తన కార్యకర్తలు ఏమి చేస్తున్నారో తెలుసుకుని, స్వయంగా బెంగాల్‌లో జిల్లా జిల్లా పర్యటించారు. కొన్నిసార్లు వారాల వ్యవధిలోనే అదే పట్టణానికి తిరిగి వచ్చేవారు. వారు ప్రయత్నిస్తున్నది ఎన్నికల సంచలనం కాదు. అది ఒక అనధికారిక వ్యవస్థను నిర్మూలించడం.

ఈ అద్భుత విజయం వెనుక ఉన్న అనేక మంది వారి కథను వారే చెబుతున్నరు. ఆర్.జి. కార్ బాధితురాలి తల్లి అయిన శ్రీమతి రత్న దేబ్‌నాథ్, పానిహటిలో భారతీయ జనతా పార్టీ తరఫున బరిలోకి దిగి, పదిహేను ఏళ్ల తృణమూల్ కంచుకోటను కూల్చివేసిన భారీ మెజారిటీతో గెలుపొందారు. రాష్ట్ర ప్రభుత్వం తనకు నిరాకరించిన దానిని డిమాండ్ చేయడానికి సందేశ్‌ఖాలిలో తన సొంత గడ్డపై నిలబడి, అదే డిమాండ్‌ను హింగల్‌గంజ్‌లో పోటీకి తీసుకువెళ్లిన శ్రీమతి రేఖా పాత్ర. ముప్పై ఏళ్లుగా వామపక్షాల పాలనలో, పదిహేను ఏళ్లుగా తృణమూల్ పాలనలో ఉన్న జిల్లాల ఓటర్లు, మొదటిసారిగా కమలం వైపు మొగ్గు చూపారు. 2026 మే 4వ తేదీ ఆదివారం నాడు, బెంగాల్ లెక్క తేల్చింది. ప్రకటించిన 293 స్థానాలకు గాను భారతీయ జనతా పార్టీ 206 స్థానాలను గెలుపొందింది. వరుసగా రెండు పార్టీల ఆధ్వర్యంలో సాగిన నలభై తొమ్మిదేళ్ల మాఫియా పాలన ముగిసింది. ఇది కేవలం ఎన్నికల తీర్పు మాత్రమే కాదు. ఇది ఒక నైతిక తీర్పు కూడా.

ఈ పురోగతిని ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్లుగా అనర్హత పేరుకుపోవడానికి అనుమతించిన ఒక రాష్ట్రంలో, తొంభై లక్షల అనర్హులైన పేర్లను తొలగించిన ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణను, ఓడిపోయిన పక్షం ఓటర్ల అణచివేతగా అభివర్ణిస్తోంది. ఫలితాల గణాంకాలు ఈ ప్రశ్నకు సమాధానం ఇస్తున్నాయి. పరిశీలన సమయంలో అత్యధిక తొలగింపులు జరిగిన ఇరవై నియోజకవర్గాలలో, తృణమూల్ కాంగ్రెస్ పదమూడింటిని గెలుచుకుంది. అత్యధిక తొలగింపులు జరిగిన సంషేర్‌గంజ్, లాల్‌గోలా, భాగబంగోలా, రఘునాథ్‌గంజ్ మరియు మెటియాబురుజ్ అనే ఈ ఐదు నియోజకవర్గాల నుంచి 2021 మరియు 2026 ఎన్నికలలో కూడా తృణమూల్ ఎమ్మెల్యేలే ఎన్నికయ్యారు. సవరణ సమయంలో తొలగించబడిన ఓటర్ల సంఖ్య కంటే తక్కువ మెజారిటీతో గెలుపొందిన నలభై తొమ్మిది నియోజకవర్గాలలో, ఇరవై ఆరింటిని భారతీయ జనతా పార్టీ, ఇరవై ఒక్కటిని తృణమూల్ కాంగ్రెస్ మరియు రెండింటిని కాంగ్రెస్ గెలుచుకున్నాయి. రాష్ట్ర చరిత్రలోనే అత్యధికమైన 92.93 శాతం ఓటింగ్ శాతం, ఓటర్ల జాబితాలు విశ్వసనీయమైనవా, కాదా అనే ప్రశ్నను తేల్చి చెప్పింది. ఓటర్లు ఇప్పటికే ఇచ్చిన తీర్పును వ్యతిరేకించడం ద్వారా, ఓడిపోయిన పక్షం ఓటర్లు తిరస్కరించిన దాదాగిరిని మాత్రమే తెలపుతుంది. కానీ వారు తీసుకున్న నిర్ణయంలోని వివేకాన్ని కాదు.

బెంగాల్ ఓటు వేసింది, బెంగాల్ ఎంచుకుంది. ఓటర్లు ఏమి కోరికున్నారో అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. శాంతిని, దాని వీధులను కమ్మేసిన హింస నుండి స్వేచ్ఛ. శ్రేయస్సును, అది నివసించే నగరానికి తిరిగి ఉపాధి లభించడం. స్థిరత్వాన్ని, దానిని బ్రతకనిచ్చినందుకు వాటా తీసుకోని పరిపాలన. దేశానికి మొట్టమొదటి పారిశ్రామిక ప్రాంతాన్ని, వాణిజ్య రాజధానిని, మరియు జాతీయ పరిపాలన తొలి రూపశిల్పులను అందించిన రాష్ట్రంలో ఒక సాంస్కృతిక, ఆర్థిక పునరుజ్జీవనం. నేను పనిచేసిన కలకత్తాను తిరిగి పొందవచ్చు. 2047 నాటికి వికసిత భారత్‌కు తన వంతు సహకారాన్ని తిరిగి అందించేందుకు బెంగాల్ సిద్ధంగా ఉంది. గత దశాబ్ద కాలంలోని ప్రతి సంక్షేమ పథకం మరియు మౌలిక సదుపాయాల నిర్ణయం వెనుక, పౌరుడినే లెక్కలోకి తీసుకునే ప్రధానమంత్రి ఉన్నారు. ఆ పౌరుడిపై విశ్వాసం ఉంచినందుకు ప్రతిఫలం ఇప్పుడు నమోదైంది.

# వర్తకసంఘం రద్దు చేయాలని కోరుతూ సంతకాల సేకరణ

## - భారీగా తరలివచ్చిన స్థానిక నిరుద్యోగులు, నిర్వాసితులు

## -కొండపైన దుకాణాలకు టెండర్ వేయాలని డిమాండ్

భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి)మే 11: యాదగిరిగుట్ట దేవస్థానం పరిధిలో కొండపైన వర్తక సంఘం రద్దు చేసి టెండరు వేయాలని కోరుతూ యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పాత గుట్ట చౌరస్తా వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కొండపైన వర్తక సంఘం పేరుతో జరుగుతున్నటువంటి ఆర్థిక దోపిడి గురించి మరియు కొండపైన గల 114 దుకాణాల వాళ్ళు వారి సొంత ఆస్తిలాగా గత కొన్నేళ్ళుగా వారే అనుభవిస్తూ టెండర్లు వేయకుండా కొత్తవారికి మరియు నిరుద్యోగులకు ఉపాధి కల్పన లేకుండా చేయడం మరియు గతంలో 14 దుకాణాలకు ఇప్పుడు 114 దుకాణాలు ఎలా పెరిగాయని ప్రశ్నించారు. మరియు వారికి ఏ ప్రతిపాదికన కేటాయించారో ఆ వివరాలు బయటకు వెల్లడించాలని ప్రశ్నించారు. దేవస్థానానికి నష్టం ఎలా జరుగుతుందనే వివరాలన్నీ సంతకాల సేకరణ దగ్గరకు వచ్చిన స్థానిక ప్రజలకు వివరిస్తూ చెప్పడం జరిగిందన్నారు. ఇట్టి కార్యక్రమంలో స్థానిక నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సంతకాల ప్రతులను సంబంధిత దేవాదాయ ధర్మాదాయ శాఖ వారికి మరియు ప్రభుత్వ పెద్దలకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో



స్థానికులు కాటబత్తిని ఆంజనేయులు, సుడుగు జీవన్ రెడ్డి, పల్లపు బాలయ్య, దేవపూజ అశోక్, దండబోయిన వీరేష్, బండ రామస్వామి, గ్యాదపాక బాల్ నర్సింహా, మాటూరి బాలయ్య, బుగ్గ ఆంజనేయులు, పబ్బాల ఉప్పలయ్య, మిరియాల క్రిష్ణ, కల్వకొలను సతీష్, కోన్నె సంజీవ, బండి అనిల్, గోపగాని ప్రసాద్, కర్రె ప్రవీణ్, మందోజు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికకు అన్యాయం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## -బండి సంజయ్, సంగప్పలపై కూడా పోక్సో కేసు నమోదు చేయాలి

## - బిఆర్ఎస్ నాయకులు కర్రె వెంకటయ్య, పాపట్ల నరహరి డిమాండ్

భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి)మే 11: మైనర్ బాధితురాలి కుటుంబం వద్దకు వెళ్లి బాధితురాలిని వారి తల్లిని బండి సంజయ్ వద్దకు తీసుకెళ్లిన బిజెపి అధికార ప్రతినిధి సంగప్ప మరియు కేంద్ర మంత్రి బండి సంజయ్ లపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయాలని యాదగిరిగుట్ట బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, నాయకులు పాపట్ల నరహరి డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ఏప్రిల్ 22వ తారీకు-ఏప్రిల్ 26వరకు సంగప్ప అనే బీజేపీ నేత కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ దగ్గరికి తీసుకెళ్లి కుటుంబాన్ని బెదిరించారని, మైనర్ బాలికకు అన్యాయం చేయదలుచుకున్న ఆ ఇద్దరిపైన కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథపైన పోక్సో కేసు పెట్టినప్పటికీ అది బెయిలబుల్ కేసు కానీ సెక్షన్ 11 పాక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ కుమారుడి విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎందుకు స్పందిస్తలేదో చెప్పాలన్నారు. బండి సంజయ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉండటం వల్ల రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదా లేక ఈ రాష్ట్రంలో హోంశాఖ కూడా ముఖ్యమంత్రి దగ్గరే ఉంది కాబట్టి ఎవరూ నోరు మెదపటం లేదా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా



చేయాలని డిమాండ్ చేశారు. తన ప్రసంగాల్లో ధర్మం న్యాయం అని మాట్లాడే బండి సంజయ్ ఈరోజు నీ వంతు వచ్చింది ధర్మం వైపు నిలబడతావా న్యాయం వైపు నిలబడతావా దోషి అయినటువంటి నీ కొడుకు ఏ వైపు నిలబెడతావో చెప్పాలన్నారు. ఒక మైనర్ బాలికపైన అత్యాచారం జరిగినా పోలీసులు పట్టించుకోకపోతే రెండుసార్లు ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేసిన ఆ బాలిక మీద కాంగ్రెస్ పార్టీలో ఉన్న మహిళా మంత్రులకు, ప్రజా ప్రతినిధులకు జాలి లేదా అని ప్రశ్నించారు. మీ కుటుంబాలలో మీ ఆడపిల్లలకు ఇలాంటి పరిస్థితి వస్తే ఇలాగే ఊరుకుంటారా, బాధితురాలికి న్యాయం చేయాలని ఆలోచన మీకు లేదా? కనీసం మానవత్వం కూడా లేదా అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆరె శ్రీధర్ గౌడ్, వాసం రమేష్, ర్యాకల రాజు, దండబోయిన వీరేష్, షేక్ నజీర్, ఆకుల శేఖర్ తదితరులున్నారు.

# దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను కలిసిన భూనిర్వాసితులు

## - న్యాయం చేయాలని వినతిపత్రం అందజేసిన బాధితులు

భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి)మే 11: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పునర్నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన భూనిర్వాసితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, డైరెక్టర్ హనుమంతరావులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధికి మా భూములు ఇచ్చి సహకరించామని, కానీ దేవాదాయ శాఖ అధికారులు, రాజకీయ నాయకులు కొండపైన వర్తకులకు అనుకూలంగా మాట్లాడుతున్నారని అన్నారు. అధిక ధరలకు వస్తువులను అమ్మి భక్తులను దోపిడీ చేస్తున్న విషయము అన్ని రాజకీయ పార్టీలకు తెలుసని, దీన్ని దృష్టిలో పెట్టుకొని కొండపైన వర్తక సంఘం దుకాణాలకు వేలం వేయాలని వర్తక సంఘం అధ్యక్షుడిగా కర్రె వెంకటయ్య గతంలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం మాట మార్చి వర్తకుల కడుపు కొట్టడం సరికాదని ఆయన వాఖ్యానిస్తున్నారు. కోట్లకు పడగలెత్తిన వర్తకులకు వత్తాసు పలకడం సరైనది కాదని తెలిపారు. దేవస్థానం ఆదాయానికి ఏడాదికి సుమారు రూ.30 కోట్లు నష్టపరిచే వర్తకులకు మద్దతు తెలపడం అన్యాయమని పేర్కొన్నారు. కొండకు ఉత్తర దిక్కులో గండిచెరువు నుండి ఊరకుంట చెరువు వరకు 93.03 ఎకరాల భూములను స్వచ్ఛందంగా ఎలాంటి షరతులు విధించకుండా ఇచ్చామని అయినప్పటికీ రైతులకు ఎలాంటి దుకాణాలు లేవని అన్నారు. మేము ఇచ్చిన భూముల్లోనే వర్తకులకు



దుకాణ సముదాయాలు కట్టించారని, ఆలయ అభివృద్ధిలో భాగంగా వర్తకులు ఎలాంటి ఆర్థిక, ఆస్తి నష్టం జరగకపోయినా కానీ, మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు తాత ముత్తాతల నుంచి సంక్రమించిన వందల ఏళ్లనాటి భూములను రైతులు జీవనోపాధిని కోల్పోయి అప్పగించి ప్రభుత్వానికి అండగా నిలబడ్డట్లు తెలిపారు. రైతు కుటుంబాలతో పాటు నిరుద్యోగ యువత కూడా ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్తున్నారు. అయినప్పటికీ స్థానికులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. ఉపాధి కోసం న్యాయం జరగాలని రైతులు, నిరుద్యోగులం నిస్వార్థ పోరాటం చేస్తున్నాం. దేవస్థానం ఉన్నతాధికారులుగా తమరు ఇప్పటికైనా నష్టాన్ని గుర్తించి వర్తక సంఘంలోని దుకాణాలకు టెండర్ నిర్వహించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భూనిర్వాసితులు బూడిద సురేందర్, బూడిద నాగరాజు, బూడిద దేవమ్మ, బూడిద పద్మ, బూడిద నరసింహ, బూడిద సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు ప్రోజెని మ్యాపింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి:

## రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మే 11(భారత శక్తి): ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఓటరు ప్రోజెని మ్యాపింగ్ కార్యక్రమాన్ని వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మ్యాపింగ్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఓటరు ప్రోజెని మ్యాపింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. కొన్ని జిల్లాల్లో ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతోందని పేర్కొంటూ, వెనుకబడిన జిల్లాలు ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు జరిగిన మ్యాపింగ్ ప్రక్రియకు సంబంధించిన పురోగతిని జిల్లాల వారీగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ ప్రతి దశను పరిశీలించాలని తెలిపారు.మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పులు, లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావాలని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# సినిమా

## పురుషాధిక్యతపై కృతి సనన్
# షాకింగ్ కామెంట్స్

భారతీయ చిత్ర పరిశ్రమలో దశాబ్దాలుగా కొనసాగుతున్న లింగ వివక్ష, పారితోషికాల అసమానతలపై బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. గ్లామర్ ప్రపంచం వెనుక ఉన్న చేదు నిజాలను ఆమె ఎంతో ధైర్యంగా బయటపెట్టారు. చలనచిత్ర నిర్మాణంలో బడ్జెట్ పరిమితులు వచ్చినప్పుడు, నిర్మాతలు మొట్టమొదట హీరోయిన్ల పారితోషికాలకే కోతలు విధిస్తున్నారని కృతి ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా బడ్జెట్‌లో సింహభాగం హీరోల రెమ్యూనరేషన్‌కే వెళుతున్నప్పటికీ, ఖర్చు తగ్గించాలనే ఆలోచన రాగానే కేవలం హీరోయిన్ల దగ్గరే ఎందుకు మొదలుపెడతారని ఆమె ప్రశ్నించారు. ఈ విషయంలో తాము ఎంతో పోరాటం చేయాల్సి వస్తోందని, నటీనటుల మధ్య ఈ స్థాయి వివక్ష చూపడం సరైనది కాదని ఆమె కుండబద్దలు కొట్టారు. కేవలం పారితోషికాల విషయంలోనే కాకుండా, షూటింగ్ సెట్స్‌లో కూడా హీరోయిన్లు ఎదుర్కొంటున్న చిన్నచూపు గురించి కృతి ప్రస్తావించారు. హీరో సెట్‌లోకి రాకముందే హీరోయిన్ రెడీగా ఉందా లేదా అని పదేపదే తనిఖీ చేస్తారని, హీరో వెయిట్ చేయకూడదనే ఉద్దేశంతోనే ఇలాంటి ఒత్తిడికి గురిచేస్తారని ఆమె పేర్కొన్నారు. నటీనటుల సమయానికి సమానమైన విలువ ఇవ్వకపోవడం చిత్ర పరిశ్రమలో ఉన్న లోతైన అసమానతలకు నిదర్శనమని ఆమె అభిప్రాయపడ్డారు.

సమర్థవంతమైన నటనను ప్రదర్శిస్తూ, సినిమాల విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, హీరోయిన్లను కేవలం అదనపు ఆకర్షణగా చూడటం మానేయాలని కృతి సనన్ విజ్ఞప్తి చేశారు. పారితోషికం, గౌరవం విషయంలో సమానత్వం ఉండాలని ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు, పరిశ్రమలోని ఇతర నటీమణుల నుంచి కూడా మద్దతు పొందుతున్నాయి.



## బోల్డ్ పాత్రలో డింపుల్..
# 'భోగి' లుక్ రిలీజ్

భిన్న కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు దర్శకుడు సంపత్ నంది సిద్ధమవుతున్నారు. ఆయన దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా రానున్న చిత్రం 'భోగి'. ఆగస్టు 28న విడుదల కానుంది. ఇప్పటికే హీరో, హరోయిన్ లుక్స్‌తో అంచనాలు కలిగించిన ఆయన తాజాగా ఇందులో కీలకపాత్రలో నటిస్తోన్న డింపుల్ హయాతి లుక్‌ను పంచుకున్నారు. ఇందులో ఆమె మందారం అనే పాత్రలో కనిపించనున్నట్లు దర్శకుడు చెప్పారు. ఎవరినీ లెక్కచేయని ఓ బోల్డ్ పాత్రలో ఆమె నటిస్తున్నట్లు తెలిపారు. 'ప్రపంచానికి ఆమె సౌందర్యం కావాలి. కానీ, ఆమె మనసును ఎవరూ అర్థం చేసుకోరు' అనే క్యాప్షన్‌తో డింపుల్ లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. ఇటీవలే అనుపమ పరమేశ్వరన్ పాత్రను కూడా టీమ్ పరిచయం చేసింది. ఇందులో ఆమె 'కందుల సులోచన రాణి'గా కనిపించనున్నారు. 'ప్రకృతి బిడ్డ.. గంగమ్మ నిలయం.. కందుల వారి గర్వం.. భోగి చిత్రానికి ఆమె ప్రాణం' అని ఆ పాత్రను పరిచయం చేశారు. ఉత్తర తెలంగాణ మహారాష్ట్ర ప్రాంతాలతో ముడిపడిన ఈ పీరియాడిక్ కథని పాన్ ఇండియా స్థాయిలో తెర పైకి తీసుకొస్తున్నారు.






## ప్రేమ ఎప్పుడూ గొప్పదే..
# విజయ్ సీఎం అయ్యాక త్రిష తొలి పోస్ట్

తమిళనాడులో నెలకొన్న ఉత్కంఠకు తెర దించుతూ.. ముఖ్యమంత్రిగా టీవీకే అధినేత విజయ్ ఆదివారం ఉదయం ప్రమాణం చేసిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమంలో నటి త్రిష సందడి చేశారు. సంప్రదాయ చీరకట్టులో నీలం రంగు పట్టుచీరలో హుందాగా కనిపించిన త్రిష అందరి దృష్టిని ఆకర్షించారు. విజయ్ ప్రమాణస్వీకారం అనంతరం ఆమె తాజాగా ప్రేమ గురించి పోస్ట్ పెట్టారు. "ప్రేమ ఎప్పుడూ గొప్పగానే వ్యక్తమవుతుంటుంది" అంటూ నీలిరంగు హార్ట్ ఏమోజీని జోడించారు. తనకెంతో ఇష్టమైన తన టీమ్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఆమె పంచుకున్న ఫొటోలు వైరల్ అవుతున్నాయి. విజయ్‌తో త్రిష ఐదు సినిమాల్లో నటించారు. అవి హిట్‌గా నిలవడమే కాకుండా ఇద్దరి కెరీర్‌ను మలుపుతిప్పాయి. తొలి సినిమా సమయంలోనే ఇద్దరూ మంచి స్నేహితులు అయ్యారు. ఆదివారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలోనూ విజయ్ ప్రమాణం చేస్తుండగా ఆమె కొంచెం భావోద్వేగానికి గురయ్యారు.

## ఓటీటీలోకి మలయాళ
# రొమాంటిక్ కామెడీ మూవీ.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?




ఓటీటీ ప్రేక్షకుల్లో మలయాళ సినిమాలకు ఉన్న ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పటికే ఎన్నో చిత్రాలు వినోదం పంచగా.. మరో సినిమా సందడి చేసేందుకు సిద్ధమైంది. అదే రొమాంటిక్ కామెడీగా రూపొందిన 'మధువీధు'. ఈ మూవీ విడుదల తేదీ వివరాలను ఓటీటీ సంస్థ 'సోనీలివ్' ప్రకటించింది. ఈ నెల 22 నుంచి స్ట్రీమింగ్ అవుతుందని వెల్లడించింది. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ ఆడియోతో అందుబాటులో ఉంటుందని తెలిపింది. మధువీధు అంటే హనీమూన్ అని అర్థం. మహిళల్లేని ఇంటికి కోడలిగా వెళ్లిన స్నేహ అనే యువతి పరిస్థితేంటన్నది ప్రధానాంశంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు విష్ణు అరవింద్. దానికి కామెడీని టచ్ చేశారు. 'నారదన్', 'మాస్టర్‌పీస్' లాంటి సినిమాలు, వెబ్‌సిరీస్‌ల్లో కీలక పాత్రలు పోషించిన షరఫ్ హీరో కాగా.. కల్యాణీ పాణిక్కర్ హీరోయిన్. ఇప్పటికే ఈ సినిమా మలయాళంలో థియేటర్లలో విడుదలైంది.



## బిజెపికి జై కొట్టిన
# రష్మీ గౌతమ్

బుల్లితెర యాంకర్ రష్మీ గౌతమ్ తన రాజకీయ మొగ్గును, సామాజిక దృక్పథాన్ని స్పష్టం చేస్తూ చేసిన పోస్ట్ ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. సాధారణంగా సెలబ్రిటీలు తమ రాజకీయ అభిప్రాయాలను బహిరంగంగా చెప్పడానికి వెనుకాడతారు, కానీ రష్మీ మాత్రం ఎంతో ధైర్యంగా తన గళాన్ని వినిపించారు. రష్మీ గౌతమ్ తన పోస్ట్‌లో భారతీయ జనతా పార్టీకి, ప్రధాని మోదీకి తన పూర్తి మద్దతు ఉంటుందని నిస్సంకోచంగా ప్రకటించారు. అయితే, ఇదే సమయంలో ఒక ముఖ్యమైన క్లారిటీ కూడా ఇచ్చారు. పార్టీకి మద్దతు ఇస్తున్నంత మాత్రాన, మహిళలపై జరిగే అఘాయిత్యాలను లేదా నేరస్తులను తాను సమర్థించబోనని స్పష్టం చేశారు. రాజకీయ మద్దతు వేరని... మానవత్వం, నైతిక విలువలు వేరని ఆమె చెప్పారు. తనను విమర్శించే వారు లేదా దూషించే వారి గురించి తాను అస్సలు పట్టించుకోనని, అలాంటి వారి వల్ల తన సమయం వృథా చేసుకోనని ఆమె ఘాటుగా సమాధానమిచ్చారు. మరోవైపు, ప్రతి సామాజిక సమస్యపై సెలబ్రిటీలను ట్యాగ్ చేసే సంస్కృతిపై రష్మీ అసహనం వ్యక్తం చేశారు. కేవలం ఒక పోస్ట్ చేయడం వల్ల క్షేత్రస్థాయిలో మార్పు రాదని, సమస్యలను పరిష్కరించే అధికారం ఉన్న అధికారులను ప్రశ్నించాలని ఆమె సూచించారు. తాను మనుషుల సమస్యల పట్ల సానుభూతి చూపగలను తప్ప, వాటిపై పోరాడే శక్తి తనకు లేదని ఆమె నిజాయతీగా అంగీకరించారు. అందుకే, గొంతులేని మూగజీవాల సంరక్షణకే తాను ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని, ఆ దిశగానే తన పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

# వన్యప్రాణుల సంరక్షణలో భారత్‌కు ప్రపంచ గుర్తింపు

* **జీవవైవిధ్య పరిరక్షణ మనందరి బాధ్యత: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**
* **జూ పార్కులో 'షేర్డ్ స్ట్రైప్స్ - షేర్డ్ ఫ్యూచర్' వర్క్ షాప్ ప్రారంభం**

హైదరాబాద్, మే 11 (భారతశక్తి): వన్యప్రాణుల సంరక్షణ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో విడదీయలేని భాగమని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. పులులు, చిరుతలు, ఆసియా సింహాలు వంటి పెద్ద పులి జాతుల సంరక్షణలో భారత్ ప్రపంచానికే దిక్సూచిగా నిలుస్తోందని చెప్పారు. సోమవారం నెహ్రూ జూలాజికల్ పార్కులో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, తెలంగాణ అటవీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'అంతర్జాతీయ బిగ్ క్యాట్ అలయన్స్' (IBCA) రెండు రోజుల వర్క్ షాప్‌ను ఆయన ప్రారంభించారు. 'షేర్డ్ స్ట్రైప్స్ షేర్డ్ ఫ్యూచర్' థీమ్‌తో జరుగుతున్న ఈ కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**ప్రకృతితోనే నాగరికత..**

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ప్రకృతి, వన్యప్రాణుల పట్ల గౌరవం, సహజీవనం అనేది భారతీయ జీవన విధానంలోనే ఉందన్నారు. వన్యప్రాణుల సంరక్షణ కేవలం పర్యావరణ బాధ్యత మాత్రమే కాదని, అది మన నాగరికతకు ప్రతీక అని పేర్కొన్నారు. నెహ్రూ జూ పార్క్ దేశంలోనే అత్యుత్తమ జంతు ప్రదర్శనశాలల్లో ఒకటిగా నిలిచిందని, అరుదైన జాతుల సంతానోత్పత్తి, ప్రజల్లో అవగాహన కల్పించడంలో ఈ పార్క్ కీలకంగా వ్యవహరిస్తోందని కొనియాడారు.

**గ్లోబల్ రోల్ మోడల్ గా భారత్**

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రారంభమైన 'ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్' (IBCA) ద్వారా ప్రపంచ దేశాలన్నీ పరిశోధనలు, అనుభవాలను పంచుకునే అవకాశం కలిగిందని గవర్నర్ తెలిపారు. భారత్ అనుసరిస్తున్న విధానాలు ఆసియా, ఆఫ్రికా దేశాలకు స్ఫూర్తినిస్తున్నాయని చెప్పారు. తెలంగాణలోని అమ్రాబాద్, కవ్వాల్ వంటి పులి సంరక్షణ కేంద్రాలు రాష్ట్ర జీవవైవిధ్యానికి నిలువుటద్దాలని, అడవుల పెంపకంలో రాష్ట్ర ప్రభుత్వ కృషి అభినందనీయమని పేర్కొన్నారు.




* **ప్రభుత్వ ప్రాధాన్యత అదే: మంత్రి కొండా సురేఖ**

అటవీ సంరక్షణ, వన్యప్రాణుల రక్షణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పర్యావరణ సమతుల్యత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం గవర్నర్ జూ పార్కులో సఫారీని సందర్శించి పెద్ద పులులు, ఇతర జంతువులను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన అటవీ జంతువుల చిత్ర ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, పీసీసీఎఫ్ సువర్ణ, వినయ్ కుమార్, ఎఫ్డీసీ ఎండీ సునీత భగవత్, రత్నాకర్ జౌహారి, సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్ మరియు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## తొర్రూర్ లో కన్నులపండువగా బీరప్ప స్వామి కల్యాణం

* **వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**
* **రూ. 50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం**

అబ్దుల్లాపూర్‌మెట్, మే 11(భారత శక్తి) : తెలంగాణ గ్రామీణ సంస్కృతీ సంప్రదాయాలకు బీరప్ప ఉత్సవాలు నిలువుటద్దాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్ గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీరప్ప స్వామి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

**వైభవంగా కల్యాణ వేడుక**

ఉత్సవాల్లో భాగంగా బీరప్ప కామరతి కల్యాణాన్ని వేద మంత్రోచ్చారణలు, ఒగ్గు కళాకారుల డోలు దరువుల మధ్య కనులపండువగా నిర్వహించారు. ఈ వేడుకను వీక్షించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డితో పాటు రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి కల్యాణాన్ని వీక్షించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

**సంస్కృతిని కాపాడుకుందాం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తరతరాలుగా వస్తున్న జానపద కళలను, వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆధునిక కాలంలోనూ ఒగ్గు కళను బతికిస్తున్న కళాకారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించిన ఆయన, ఆలయ అభివృద్ధికి, కురుమల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

**సీసీ రోడ్డు ప్రారంభం**

భక్తుల సౌకర్యార్థం గ్రామం నుంచి బీరప్ప ఆలయం వరకు *రూ. 50 లక్షల* వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

## రైతును నిలువునా ముంచేందుకు 'నకిలీ' పంజా!

* **శామీర్‌పేట వద్ద 100 కిలోల నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాల సీజ్**
* **గుంటూరు జిల్లాకు చెందిన ప్రధాన నిందితుడి అరెస్ట్**
* **మదనపల్లి నుంచి అక్రమ రవాణా.. ఎస్ఓటీ మెరుపు దాడి**

శామీర్‌పేట, మే 11 (భారత శక్తి) : అమాయక రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని, అక్రమ లాభాలే ధ్యేయంగా సాగుతున్న నిషేధిత విత్తనాల దందాను మల్కాజిగిరి స్పెషల్ ఆపరేషన్ టీమ్ (SOT) రట్టు చేసింది. సాగు సీజన్ ప్రారంభం కాకముందే అన్నదాతలను మోసం చేసేందుకు సిద్ధమైన ఓ అంతర్రాష్ట్ర ముఠా గుట్టును పోలీసులు విప్పారు. శామీర్‌పేట శివారులో నిర్వహించిన మెరుపు దాడుల్లో రూ. లక్షల విలువైన 100 కిలోల బీటీ3 (BGIII HP) రకం పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.

**ఓఆర్ఆర్ ఎగ్జిట్ వద్ద నిఘా**

నమ్మదగిన సమాచారంతో మల్కాజిగిరి ఎస్ఓటీ కంటోన్మెంట్ బృందం, వ్యవసాయ శాఖ అధికారులు మరియు శామీర్‌పేట పోలీసులు సంయుక్తంగా ఆదివారం సాయంత్రం శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్ (ORR) ఎగ్జిట్ నంబర్ 07 వద్ద మాటు వేశారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా సంచులతో వెళ్తున్న గుంటూరు జిల్లా చేబ్రోలుకు చెందిన *దాసరి శ్రీనివాసరావు (58)* అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న రెండు బ్యాగులను తనిఖీ చేయగా.. పర్యావరణానికి, పంట భూములకు తీవ్ర హాని కలిగించే నిషేధిత బీటీ3 విత్తనాలు బయటపడ్డాయి.





**మదనపల్లి నుంచి హైదరాబాద్ దాకా..**

నిందితుడు శ్రీనివాసరావు తన సహచరుడైన దాసరి సూరిబాబుతో కలిసి అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన మరో శ్రీనివాసరావు వద్ద ఈ విత్తనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు విచారణలో అంగీకరించాడు. వీటిని హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని రైతులు మరియు ఫెర్టిలైజర్ దుకాణదారులకు భారీ ధరకు విక్రయించి లాభపడాలని పథకం వేశాడు. కాగా, ఈ వ్యవహారంలో కీలక సూత్రధారులైన మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు.

**మళ్ళీ అదే బాట..**

అరెస్టయిన నిందితుడు శ్రీనివాసరావు పాత నేరస్థుడని పోలీసులు గుర్తించారు. గతంలో వికారాబాద్ జిల్లా యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా నిషేధిత విత్తనాలను విక్రయిస్తూ పోలీసులకు చిక్కాడు. పాత కేసులు ఉన్నప్పటికీ ధనార్జనే ధ్యేయంగా నిందితుడు మళ్లీ అదే దారి పట్టడం గమనార్హం.

**అన్నదాతలకు ముప్పు!**

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి లేని, శాస్త్రీయంగా ధృవీకరించని బీటీ3 రకం విత్తనాల వల్ల సాగు భూములు విషతుల్యం అవుతాయని హెచ్చరించారు. "వీటి వల్ల ఆశించిన స్థాయిలో దిగుబడి రాదు సరి, నేల కాలుష్యం పెరిగి రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలకు గురవుతారు" అని వ్యవసాయ అధికారులు స్పష్టం చేశారు.

**పోలీసుల చర్యలు**

ఈ ఘటనపై శామీర్‌పేట పోలీసులు *Cr. No. 383/2026* కింద భారతీయ న్యాయ సంహిత (BNS), పర్యావరణ పరిరక్షణ చట్టం, విత్తన నియంత్రణ చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి బి. సుమతి ఐపీఎస్ పర్యవేక్షణలో జరిగిన ఈ ఆపరేషన్‌లో ఎస్ఓటీ అదనపు డిసిపి నంద్యాల నరసింహారెడ్డి, ఇన్ స్పెక్టర్ కె. శ్రీనివాస్, శామీర్‌పేట ఎస్ హెచ్ఓ ఎస్. శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



## వర్షా కాలం ముందే నాలా పనులు పూర్తి చేయాలి

* **మిథులా నగర్‌లో నిలిచిపోయిన ఎస్ఎన్‌డీపీ పనుల పునఃప్రారంభం**
* **అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

బడంగ్‌పేట్, మే 11(భారత శక్తి) : మహేశ్వరం నియోజకవర్గం జిల్లెలగూడ డివిజన్ పరిధిలోని మిథులా నగర్‌లో సుదీర్ఘ కాలంగా అసంపూర్తిగా నిలిచిపోయిన ఎస్ఎన్‌డీపీ (SNDP) నాలా పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సోమవారం ఈ పనులను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి, తిరిగి ప్రారంభించారు.

**నాణ్యతతో కూడిన వేగమే లక్ష్యం**

ఈ సందర్భంగా ఆమె నాలా పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా పనులను సత్వరమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

* వేగవంతం: వర్షాలు మొదలవ్వకముందే ప్రధాన సివిల్ పనులను ముగించాలి.
* నాణ్యత: పనుల విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.
* అలసత్వం వద్దు: ప్రజలకు అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం**

నిలిచిపోయిన పనులు మళ్లీ పట్టాలెక్కడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు అక్కల భూపాల్ రెడ్డి, డిప్లాల్ చౌహాన్, అరకల కామేష్ రెడ్డి, మదారి రమేష్, అనిల్ కుమార్ యాదవ్, విజయ్, దిండు భూపేష్ గౌడ్, లక్ష్మణ్ ముదిరాజ్, గోపి యాదవ్ తదితరులతో పాటు మహిళా ప్రతినిధులు సునీత, సుర్వి లత, పంతంగి మాధవి, బిందు, నిర్మల రెడ్డి పాల్గొన్నారు.

## చెరువులకు 'హైడ్రా' కెమెరా కవచం

* **900 సీసీటీవీలతో నిరంతర నిఘా.. కబ్జాలకు ఇక బ్రేక్!**

హైదరాబాద్, మే 11 (భారత శక్తి) :నగరంలోని చెరువుల రక్షణ కోసం హైడ్రా (HYDRAA) మరో కీలక అడుగు వేసింది. చెరువుల కబ్జాలను అడ్డుకోవడానికి, అక్రమ నిర్మాణాలను నిరోధించడానికి అత్యాధునిక సాంకేతికతను రంగంలోకి దించింది. ఇందులో భాగంగా 264 చెరువుల పరిధిలో సుమారు 900 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, సోమవారం నుంచి నిరంతర నిఘా వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో పాటు హైడ్రా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వర్‌కు ఈ కెమెరాలను అనుసంధానించారు. ఈ నూతన నిఘా వ్యవస్థను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రారంభించారు.

**నిమిషాల్లోనే వాహనాల గుర్తింపు**

సాధారణంగా చెరువులను ఆక్రమించే వారు అర్ధరాత్రి వేళల్లో నిర్మాణ వ్యర్థాలను (C&D Waste), మట్టిని తెచ్చి చెరువు కుంటల్లో నింపేస్తుంటారు. ఇకపై అలాంటి చర్యలకు పాల్పడితే వెంటనే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందుతుంది.



* వాహనాల ట్రాకింగ్: మట్టిని అక్రమంగా తరలించే వాహనాల నంబర్ ప్లేట్లను సీసీటీవీల ద్వారా గుర్తించి, వాటి యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటారు.
* లేక్ ప్రొటెక్షన్ టీమ్స్ అలర్ట్: కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించే సిబ్బంది, ఏదైనా అక్రమం జరిగినట్లు గుర్తిస్తే.. వెంటనే క్షేత్రస్థాయిలో ఉన్న లేక్ ప్రొటెక్షన్ ఫోర్స్ టీమ్స్‌ను అప్రమత్తం చేస్తారు.

* **కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం**

చెరువుల వద్ద ఏర్పాటు చేసిన ఈ కెమెరాల దృశ్యాలను హైడ్రా కార్యాలయంతో పాటు బంజారాహిల్స్‌లోని స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ICCC)' కు కూడా అనుసంధానం చేశారు. దీనివల్ల నిఘా మరింత పటిష్టంగా ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న టీమ్స్‌కు ఈ టెక్నాలజీ తోడవ్వడంతో చెరువుల రక్షణ వ్యవస్థ మరింత బలపడిందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

**కీలక అంశాలు:**

మొత్తం చెరువులు: 264
ఏర్పాటు చేసిన కెమెరాలు: 900
నిఘా లక్ష్యం: మట్టి పోయడం, వ్యర్థాలు వేయడం, అక్రమ కబ్జాలను అడ్డుకోవడం. ఈ కార్యక్రమంలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, అదనపు కమిషనర్ ఆర్. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. నగర సంపదైన చెరువులను కాపాడటంలో ప్రజలు కూడా సహకరించాలని అధికారులు కోరారు.

## అనధికార వార్తలను పట్టించుకోవద్దు



* **శ్రీకోసగుండ్ల ఫణిగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రతిష్టాపకులు, ప్రధాన పూజారి కోమండూరి శేషాచారి విజ్ఞప్తి.**

ఎల్బీనగర్, మే 11(భారత శక్తి): శ్రీకోసగుండ్ల ఫణిగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌కు సంబంధించిన వార్తలు 11052026 తేదీన కొన్ని దినపత్రికల్లో ప్రచురితమైన నేపథ్యంలో దేవస్థానం ప్రతిష్టాపకులు, ప్రధాన పూజారి కోమండూరి శేషాచారి స్పందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ దేవస్థానం యాదాద్రి దేవస్థానం దత్తత ఆలయమని, ఆలయానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రకటనలు తాను గానీ, యాదాద్రి దేవస్థానం గానీ, దేవాదాయ శాఖ కమిషనర్ గానీ విడుదల చేయలేదని స్పష్టం చేశారు. ఎవరి అనుమతి లేకుండా వచ్చిన ఈ వార్తలు పూర్తిగా అనధికారికమని తెలిపారు. కాబట్టి భక్తులు, ప్రజలు ఇటువంటి వార్తలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇకముందు దేవస్థానానికి సంబంధించిన వార్తలు ప్రచురించే ముందు తప్పనిసరిగా తనను సంప్రదించాలని పత్రికా సంపాదకులకు కోరారు.

# ప్రాణం చాలా విలువైనది.. చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి..

* టిజీఏఎఫ్ఎం అధ్యక్షులు డా. వసంత్ నాయక్, జనరల్ సెక్రటరీ డా. జి. మహేందర్

కాప్రా, మే 11 (భారతశక్తి): ప్రాణం చాలా విలువైనదని చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి టిజీఏఎఫ్ఎం అధ్యక్షులు డా. వసంత్ నాయక్, జనరల్ సెక్రటరీ డా. జి. మహేందర్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్డులో నేషనల్ ఫోరెన్సిక్ మెడిసిన్ డే సందర్భంగా తెలంగాణ అకాడమీ ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5K హెల్త్ అవేర్‌నెస్ మారథాన్ విశేషంగా ఆకట్టుకుంది. రన్ ఫర్ హెల్త్, రన్ ఫర్ జస్టిస్ అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఫోరెన్సిక్ వైద్యులు, పీజీ విద్యార్థులు మరియు వివిధ వైద్య విభాగాలకు చెందిన డాక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిజీఏఎఫ్ఎం అధ్యక్షులు డా. వసంత్ నాయక్, జనరల్ సెక్రటరీ డా. జి. మహేందర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 12ను "నేషనల్ ఫోరెన్సిక్ మెడిసిన్ డే"గా నిర్వహిస్తారు. న్యాయ వ్యవస్థకు




తోడ్పడే ఫోరెన్సిక్ మెడిసిన్ కేవలం మరణాల విచారణకే పరిమితం కాకుండా, నివారించగల మరణాల వెనుక ఉన్న కారణాలను సమాజానికి తెలియజేసి ప్రజల ప్రాణాలను కాపాడడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుందని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు. ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు, గుండెపోటులు, మద్యపానం, మానసిక ఒత్తిడి, ఆత్మహత్యలు, జీవనశైలి వ్యాధుల కారణంగా సంభవించే విషాద మరణాలను చూసే ఫోరెన్సిక్ వైద్యులు, నివారణే ఉత్తమ రక్షణ అనే సందేశాన్ని సమాజానికి అందించేందుకు ఈ మారథాన్ నిర్వహించారు. మార్చ్యూరీలలో చూసిన అనుభవాలు ప్రజల్లో ఆరోగ్య చైతన్యంగా మారాలని టిజీఏఎఫ్ఎం ఈ కార్యక్రమం ద్వారా పిలుపునిచ్చింది. ఈ మారథాన్ కేవలం ఫిట్‌నెస్ కార్యక్రమం మాత్రమే కాకుండా, ఆరోగ్య




అవగాహన, రోడ్డు భద్రత, మానసిక ఆరోగ్యం, వ్యసనాల నివారణ మరియు సమాజ బాధ్యతపై ఫోరెన్సిక్ వైద్యుల నుంచి వచ్చిన శక్తివంతమైన సందేశంగా నిలిచింది. ఫోరెన్సిక్ మెడిసిన్ అనేది కేవలం మరణాన్ని అర్థం చేసుకోవడం మాత్రమే కాదని జీవితాన్ని కాపాడడం కూడా అనే భావనతో టిజీఏఎఫ్ఎం చేపట్టిన ఈ కార్యక్రమం భవిష్యత్తులో మరిన్ని ప్రజారోగ్య కార్యక్రమాలకు మార్గదర్శకంగా నిలవనుందన్నారు. ఈ కార్యక్రమంలో, డా. సూరజ్, డా. కృపాల్ సింగ్, డా. నాగ మోహన్, డా. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సాధారణ ప్రజలు మరియు చిన్నారులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. దాదాపు 300 మంది పాల్గొన్న ఈ మారథాన్‌లో 25-30 మంది చిన్నారులు పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## జీహెచ్ఎంసీలో 'ప్రజావాణి'.. మొరపెట్టుకున్న జనం!

* ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా తీరని గోస
* హెడ్ ఆఫీస్‌లో 41 దరఖాస్తులు.. పట్టించుకోని క్షేత్రస్థాయి యంత్రాంగం
* మొత్తం 59 వినతులు స్వీకరించిన అధికారులు




హైదరాబాద్, మే 11 (భారత శక్తి): బల్దియాలో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. సోమవారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసులో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో నగర పౌరులు సుదూర ప్రాంతాల నుండి వచ్చి అధికారులకు మొరపెట్టుకున్నారు. ఈ ఒక్క రోజే మొత్తం 59 వినతులు రాగా, అందులో అత్యధికంగా 41 అప్లికేషన్లు కేవలం హెడ్ ఆఫీసులోనే రావడం గమనార్హం.

**కదలని ఫైళ్లు.. తీరని తిప్పలు**

జోనల్ ఆఫీసుల్లో సమస్యలు కొలిక్కి రాకపోవడంతోనే జనం హెడ్ ఆఫీస్ మెట్లు ఎక్కుతున్నారు. టౌన్ ప్లానింగ్, భూసేకరణ, పారిశుధ్యం వంటి విభాగాల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పనులపై బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావాణిలో అదనపు కమిషనర్ రవి కిరణ్, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, సీసీపీ శ్రీనివాస్, డైరెక్టర్ వెంకటేశ్వరరావు సహా పలువురు అధికారులు పాల్గొని అర్జీలు తీసుకున్నారు. అందిన వినతులపై ఆయా విభాగాల అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు.

**జోన్ల వారీగా 'ప్రజావాణి' తీరు:**

ప్రజల నుండి వచ్చిన వినతుల్లో జోన్ల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. కొన్ని జోన్లలో అంకెలు తక్కువగా ఉన్నప్పటికీ, సమస్యల తీవ్రత మాత్రం తగ్గడం లేదు.

హెడ్ ఆఫీస్: 41, శంషాబాద్: 07, ఖైరతాబాద్: 04, రాజేంద్రనగర్: 03, సికింద్రాబాద్: 03, చార్మినార్: 01, గోల్కొండ: 0, వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువ శాతం అక్రమ కట్టడాల కూల్చివేత, డ్రైనేజీ సమస్యలు, ఆస్తి పన్ను గొడవలపైనే ఉన్నట్లు తెలుస్తోంది. మరి ఈ వినతులైనా పరిష్కారమవుతాయా లేక బుట్టదాఖలు అవుతాయా అని జనం ఎదురుచూస్తున్నారు.

## బండి సంజయ్ కుమార్ ను వెంటనే కేంద్ర మంత్రి వర్గం నుండి తొలగించాలి

* బిఆర్ఎస్ నాయకుల డిమాండ్



ఎల్బీనగర్, మే 11 (భారత శక్తి): కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ను వెంటనే కేంద్ర మంత్రి వర్గం నుండి బర్తరఫ్ చేయాలని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఆర్కే పురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ లు డిమాండ్ చేశారు. సోమవారం భారాస డివిజన్ పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. తన కుమారుడు సాయి భగీరథ్ మైనర్ బాలికపై అత్యాచారం చేసినట్లు ఆరోపణలు వస్తుంటే వాస్తవాలు కప్పిపుచ్చడానికి మంత్రి ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. మైనర్ బాలికను మోసం చేసిన సంజయ్ కుమారుడు భగీరథ్ పైన కేసులు నమోదు చేయాలని కేంద్ర మంత్రి పదవి నుండి సంజయ్ ను బర్తరఫ్ చేయాలని ప్రధానిని కోరారు. చట్టం అనేది డబ్బులున్న వారికీ చుట్టమా అని ప్రశ్నించారు. విషయ పరిజ్ఞానం లేకుండా ప్రజా సమస్యలు పట్టించుకోకుండా కాంగ్రెస్ సర్కార్ డైవర్ట్ పాలిటిక్స్ చేయడం విడ్డూరమన్నారు. భగీరథ్ పై పోక్సో కేసు కాకుండా రేవంత్ రెడ్డి సర్కార్ బాధితురాలికి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. నరేంద్రమోడీ సభలో దేవుడిని, కులాన్ని అడ్డం పెట్టుకుని పోతున్నామని బండి సంజయ్ మాట్లాడడం వారి నైజం బయటపడిందన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కేసును ముందుకెళ్లకుండా బండి సంజయ్ ప్రవర్తిస్తున్న తీరు ఆక్షేపనీయమన్నారు. బాలిక తల్లిదండ్రులు గత మూడు నెలల క్రితం కేసు పెడతానని అంటే పెట్టనీయకుండా అడ్డుకుని కాంగ్రెస్, బిజెపి లోపయకారి ఒప్పందానికి నిదర్శనమన్నారు. బాలిక తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత ఈవిషయంపై మాట్లాడకపోవం విస్మయం కలిగిస్తుందన్నారు. రాష్ట్ర పోలీసు శాఖకు స్వేచ్ఛ ఇవ్వాలని అప్పుడే బాధితురాలికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దగోని వెంకటేష్ నాయకులు గొడుగు శ్రీనివాస్, రామాచారి, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఖాకీలకు 'శ్రీ చైతన్య' ఊరట

* నగరంలో భానుడి భగభగ.. ప్రధాని పర్యటనలో పహారా
* పోలీస్ సిబ్బందికి మజ్జిగ, లస్సీ పంపిణీ





హైదరాబాద్, మే 11 (భారత శక్తి) : విద్యా రంగంలో అప్రతిహత విజయాలతో దూసుకుపోతున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలు సామాజిక బాధ్యతలోనూ తమ ప్రత్యేకతను చాటుకున్నాయి. నగరంలో మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు అండగా నిలిచేందుకు వినూత్న సేవా కార్యక్రమాన్ని చేపట్టాయి.

* విధుల నిర్వహణలో అండగా..

హైదరాబాద్‌లోని మాధాపూర్, హైటెక్ సిటీ పరిసరాల్లో సోమవారం ప్రధాని నరేంద్ర మోడీ పర్యటించారు. ఈ సందర్భంగా నగరం అంతటా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ, గంటల తరబడి రహదారులపై పహారా కాస్తున్న వందలాది మంది పోలీస్ సిబ్బందికి శ్రీ చైతన్య కావూరి హిల్స్ జోన్ బృందం మజ్జిగ, లస్సీ ప్యాకెట్లు, తాగునీటిని పంపిణీ చేసింది. క్షేత్రస్థాయి నుంచి వార్తలను కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధులకు సైతం మజ్జిగ పంపిణీ చేసి వారి దాహార్తిని తీర్చారు.

**మానవీయ కోణం**

శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ల దిశానిర్దేశంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కావూరి హిల్స్ జోన్ ఎగ్జిక్యూటివ్ డీన్ ఆంజనేయులు, ఏజీఎం శివ ప్రసాద్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. "దేశ ప్రధాని పర్యటన వేళ శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులు చేస్తున్న కృషి వెలకట్టలేనిది. ఎండలో వారు పడుతున్న శ్రమను గుర్తించి, స్వల్ప ఉపశమనం కలిగించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టాం" అని తెలిపారు. విద్యాబోధనతో పాటు విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఇటువంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. శ్రీ చైతన్య బృందం చూపిన ఈ మానవీయ చొరవను అటు పోలీసు అధికారులు, ఇటు ప్రజలు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు.



## జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తాం

: మంత్రి పొంగులేటి

* అన్ని సొసైటీలు ఏకతాటిపైకి రావాలి
* మంత్రికి గ్రేటర్ జర్నలిస్టుల సొసైటీ వినతి

హైదరాబాద్, మే 11 (భారత శక్తి) : రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్నలిస్టుల గృహ నిర్మాణ సమస్య పరిష్కారానికి అన్ని హౌసింగ్ సొసైటీలు ఏకతాటిపైకి రావాలని సూచించారు. సొసైటీలన్నీ కలిసి జేఏసీగా ఏర్పడి, అర్హులైన జర్నలిస్టుల సమగ్ర జాబితాను రూపొందించాలని, అప్పుడే పారదర్శకంగా న్యాయం చేసే వీలుంటుందని ఆయన పేర్కొన్నారు.

* **మా సొసైటీని గుర్తించండి: ప్రతినిధుల విజ్ఞప్తి**
* గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టుల కోసం 2008లో ఏర్పాటు చేసిన తమ సొసైటీని ప్రభుత్వం గుర్తించాలని ప్రతినిధులు కోరారు. 17 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సొసైటీలో ప్రస్తుతం వెయ్యి మందికి పైగా సభ్యులు ఉన్నారని వివరించారు.
* 17 ఏళ్ల నిరీక్షణ: గత ప్రభుత్వం పలుమార్లు విన్నవించినా స్థల కేటాయింపులో చొరవ చూపలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.
* ప్రాతినిధ్యం కల్పించాలి: జర్నలిస్టు ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం నిర్వహించే సమీక్షా సమావేశాలకు తమను ఆహ్వానించాలని, జేఏసీలో భాగస్వాములను చేయాలని కోరారు.
* చెల్లింపులకు సిద్ధం: ప్రభుత్వం నిర్దేశించిన ధర చెల్లించి స్థలాలు పొందేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ నేతృత్వంలోని బృందం అనంతరం మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డిని, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు (ముకుంద రెడ్డి)ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు రవికుమార్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిటీలో 'జనగణన' షురూ.. నేటి నుంచే ఇంటింటికీ ఎన్యుమరేటర్లు!

* గ్రేటర్ వ్యాప్తంగా మొదలైన గృహ గణన ప్రక్రియ
* సెన్సస్ 2027 కోసం 25 వేల మంది సిబ్బంది రంగంలోకి
* ప్రజలు సహకరించాలంటున్న జీహెచ్ఎంసీ కమిషనర్



హైదరాబాద్, మే 11 (భారతశక్తి) : సిటీలో సెన్సస్ (జనగణన) సందడి మొదలైంది. 2027లో జరగబోయే మహా జనాభా గణనలో భాగంగా.. తొలి దశ 'గృహ గణన' (House Listing) పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాల్లో ఎన్యుమరేటర్లు క్షేత్రస్థాయిలోకి వెళ్తున్నారు. వచ్చే నెల (జూన్ 9) వరకు ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించనున్నారు.

**పక్కా ప్లాన్‌తో సర్కార్..**

గణన కోసం సర్కార్ పక్కా ఏర్పాట్లు చేసింది. గ్రేటర్ వ్యాప్తంగా 19,868 బ్లాకులను గుర్తించి, వాటిని డిజిటల్ మ్యాపింగ్ చేసింది. భారీగా సిబ్బంది: మొత్తం 21,773 మంది ఎన్యుమరేటర్లు, 3,402 మంది సూపర్‌వైజర్లకు ఇప్పటికే ట్రైనింగ్ ఇచ్చారు.

**సెల్ఫ్ ఎన్యుమరేషన్:**

ఈసారి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకునే ఛాన్స్ ఇవ్వగా.. సుమారు 1.27 లక్షల ఫ్యామిలీలు సొంతంగా డీటెయిల్స్ అప్‌లోడ్ చేశాయి. డిజిటల్ సెన్సస్: పాత పద్ధతిలో కాకుండా 'హెచ్.ఎల్.ఓ' అనే మొబైల్ యాప్ ద్వారా అప్పటికప్పుడే డేటాను ఎన్యుమరేటర్లు ఆన్‌లైన్ చేస్తున్నారు.

**ఏం చేస్తారంటే?**

1. నెంబర్లు వేస్తారు: ప్రతి ఇంటికి వెళ్లి భవనాన్ని తనిఖీ చేసి, దాని మెయిన్ డోర్ దగ్గర చాక్ పీస్ లేదా పెయింట్‌తో సెన్సస్ నంబర్ వేస్తారు.
2. వసతుల ఆరా: ఇల్లు పక్కాదా? కచ్చాదా? ఇంట్లో ఎన్ని గదులున్నాయి? తాగునీరు, కరెంట్, టాయిలెట్ వంటి వసతులు ఎలా ఉన్నాయి? అనే వివరాలు అడిగి తెలుసుకుంటారు.
3. జియో ట్యాగింగ్: కేటాయించిన బ్లాక్ మ్యాప్ ప్రకారం ప్రతి ఇంటిని జియో ట్యాగ్ చేస్తారు. దీనివల్ల ఏ ఒక్క ఇల్లు మిస్ అయ్యే ఛాన్స్ ఉండదు.

**గణన షెడ్యూల్ ఇలా..**

గృహ గణన (మొదటి దశ): 2026 మే 11 నుంచి జూన్ 9 వరకు. జనాభా గణన (రెండో దశ): 2027 ఫిబ్రవరి 9 నుంచి ఫిబ్రవరి 28 వరకు.

* **రివిజనల్ రౌండ్: 2027 మార్చి 1 నుంచి 5 వరకు.**

వివరాలు కరెక్ట్ గా చెప్పండి: కమిషనర్ కర్ణన్ నగర భవిష్యత్తు కోసం ప్రభుత్వం రూపొందించే పథకాలకు ఈ డేటానే కీలకమని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. "సిటీ డెవలప్‌మెంట్ కావాలన్నా, ప్రజా సేవలు మెరుగుపడాలన్నా కచ్చితమైన లెక్కలు ఉండాలి. అందుకే ఎన్యుమరేటర్లు మీ ఇంటికి వచ్చినప్పుడు ప్రజలందరూ సహకరించి కచ్చితమైన వివరాలు చెప్పాలి" అని ఆయన కోరారు.

# చెన్నైలో స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం విజయ్

చెన్నై, మే 11(భారత శక్తి) : తమిళనాడు నూతన ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్.. డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ఆయన నేరుగా చెన్నైలోని స్టాలిన్ నివాసానికి వెళ్లారు. తన నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి విజయ్‌ను స్టాలిన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయ్‌ను ఆత్మీయ ఆలింగనం చేసుకుని, శాలువాతో సత్కరించారు. ఈ భేటీలో స్టాలిన్ కుమారుడు, మాజీ మంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు. డీఎంకే మిత్రపక్షాలైన కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎంల మద్దతుతోనే విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. టీవీకే పార్టీకి మద్దతు



ఇచ్చే విషయంలో తమ మిత్రపక్షాలకు స్టాలిన్ పూర్తి స్వేచ్ఛ కల్పించారు. ఈ నేపథ్యంలోనే, ముఖ్యమంత్రి పీఠం ఎక్కేందుకు పరోక్షంగా సహకరించిన స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకే విజయ్ ఆయనను కలిసినట్లు తెలుస్తోంది. సీఎం బాధ్యతలు చేపట్టాక విజయ్, స్టాలిన్‌ను కలవడం ఇదే తొలిసారి. ఈ భేటీ తమిళ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తించింది.

## ఏపీకి నిధులు.. మాకేవి? : మంత్రి పొన్నం

హైదరాబాద్, మే 11(భారత శక్తి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణన, హౌస్ హోల్డ్ సర్వే ఫారమ్‌లలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సర్వే ఫారమ్‌లో కేవలం ఎస్సీ, ఎస్టీ అనే ఆప్షన్లు మాత్రమే ఉన్నాయని, మెజారిటీ జనాభా కలిగిన బీసీల ప్రస్తావనే లేకపోవడం వారిని విస్మరించడమేనని మండిపడ్డారు. బీసీల అభివృద్ధికి కులగణన అత్యవసరమని, కేంద్రం ఈ విషయంలో వివక్ష చూపుతోందని ఆయన విమర్శించారు. తెలంగాణపై కేంద్రం చూపుతున్న వివక్షపై స్పందించాలని రాష్ట్ర బీజేపీ నేతలకు మంత్రి సవాల్ విసిరారు. గత 12 ఏళ్లలో కేంద్రం నుంచి తెలంగాణకు వచ్చిన నిధులపై సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద లేదా మరెక్కడైనా సరే బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్న కేంద్రం, తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనపై స్పందిస్తూ, "రాష్ట్రానికి ఏం ప్రాజెక్టులు ఇస్తారో చెప్పకుండా, బంగారం కొనొద్దు అని సలహాలు ఇవ్వడానికే మోదీ వచ్చారా?" అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అనేకసార్లు కేంద్ర మంత్రులను కలిసి విన్నవించినా నిధుల విడుదలపై స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాముడిని తాము కూడా పూజిస్తామని, అయితే బీజేపీలాగా ఓట్ల కోసం దేవుడిని వాడుకోమని స్పష్టం చేశారు.

## తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా విజయలక్ష్మి

హైదరాబాద్, మే 11(భారత శక్తి) : తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియమితులయ్యారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్, ఆరుగురు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత, శశికళ యాదవ రెడ్డి, సదాలక్ష్మి, రాధాబాయి, ఉజ్మా షకీరాలను నియమించారు. వీరి పదవీకాలం ఐదేళ్ల పాటు ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ రాష్ట్రంలోని మహిళల హక్కులను పరిరక్షించడానికి, వారిపై జరుగుతున్న అన్యాయాలు, వేధింపులను అరికట్టడానికి ఏర్పాటు చేయబడిన చట్టబద్ధమైన సంస్థ. ఇది మహిళలకు న్యాయం చేకూర్చడం, సంక్షేమం మరియు సాధికారత కోసం పనిచేస్తుంది.

## నీట్ 2026 పేపర్ లీక్?.. రాజస్థాన్‌లో కలకలం

ఢిల్లీ, మే 11(భారత శక్తి) : దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు రాసిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) యూజీ2026లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై రాజస్థాన్ పోలీసులు విచారణ చేపట్టారు. పరీక్షకు ఒకరోజు ముందే సర్క్యులేట్ అయిన 'గెస్ పేపర్'లోని ప్రశ్నలు, అసలు ప్రశ్నపత్రంలోని ప్రశ్నలతో దాదాపుగా సరిపోలడంతో ఈ వివాదం మొదలైంది. ఈ ఘటనపై రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (SOG) దర్యాప్తు ప్రారంభించింది. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మే 3న నీట్ పరీక్ష జరగగా, మే 2 రాత్రే ప్రశ్నపత్రం లీక్ అయిందని కొందరు విద్యార్థులు స్థానిక ఉద్యోగ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బయాలజీ, కెమిస్ట్రీ విభాగాల్లో 100కు పైగా ప్రశ్నలు అసలు పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. రాజస్థాన్ డీజీపీ ఆదేశాలతో ఎస్‌వోజీ, యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ATS) బృందాలు రంగంలోకి దిగి విచారణ జరుపుతున్నాయి. ఈ ఆరోపణలపై జాతీయ పరీక్షల మండలి (NTA) స్పందించింది. మే 7న తమకు ఈ విషయంపై సమాచారం అందిందని, వెంటనే దర్యాప్తు సంస్థలకు తెలియజేశామని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి రాజస్థాన్, ఉత్తరాఖండ్‌లలో సుమారు 8 నుంచి 13 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరోవైపు, పూర్తి భద్రతా ప్రమాణాలతోనే పరీక్ష నిర్వహించామని, దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తామని ఎన్టీఏ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ విషయంపై విచారణ కొనసాగుతోంది.

## భారత్‌ను ఎవరూ లొంగదీయలేరు: మోదీ

ఢిల్లీ, మే 11(భారత శక్తి) : భారత్‌ను తలవంచేలా చేసే శక్తి ప్రపంచంలో ఏదీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 1998లో పోఖ్రాన్‌లో జరిపిన అణు పరీక్షలను గుర్తుచేస్తూ, భారత సంకల్పం ఎంత దృఢమైనదో ప్రపంచానికి ఆనాడే తెలిసొచ్చిందని అన్నారు. సోమవారం గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంలో జరిగిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్' వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 1998 మే 11న భారత శాస్త్రవేత్తలు పోఖ్రాన్‌లో అణు పరీక్షలు జరిపి దేశ సత్తాను ప్రపంచానికి చాటారని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఆ పరీక్షల తర్వాత ప్రపంచ దేశాలు మనపై అనేక ఆంక్షలు విధించి, ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలని చూశాయని అన్నారు. అయినప్పటికీ భారత్ వెనక్కి తగ్గలేదని, మే 13న మరోసారి పరీక్షలు జరిపి తన రాజకీయ సంకల్పాన్ని నిరూపించుకుందని వివరించారు. "మనం వేరే మట్టితో తయారైన వాళ్ళం" అంటూ ఆనాటి ధైర్యాన్ని కొనియాడారు. సోమనాథ్ ఆలయం గురించి మాట్లాడుతూ.. 75 ఏళ్ల క్రితం జరిగిన ఆలయ పునరుద్ధరణ కేవలం ఒక సాధారణ కార్యక్రమం కాదని, అది భారత సాంస్కృతిక స్వేచ్ఛా ప్రకటన అని మోదీ అభివర్ణించారు. చరిత్రలో ఎన్నోసార్లు ఆలయాన్ని ధ్వంసం చేసినా, ప్రతిసారీ పునర్నిర్మించామని, ఇది భారత విశ్వాసానికి ఉన్న బలమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత సోమనాథ్ ఆలయ నిర్మాణంలోనూ బుజ్జగింపు రాజకీయాలు జరిగాయని, సర్దార్ పటేల్ వంటి వారి ప్రయత్నాలను నెహ్రూ వ్యతిరేకించారని విమర్శించారు. ఇదే తరహా రాజకీయాలు అయోధ్య రామమందిర నిర్మాణం విషయంలోనూ కొనసాగాయని అన్నారు. పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆలయంలో విశేష మహా పూజ, కుంభాభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హెలికాప్టర్ల ద్వారా ఆలయ గోపురంపై పూలవర్షం కురిపించారు.

## హంటావైరస్ ఎఫెక్ట్: షిప్ నుంచి ప్రయాణికుల తరలింపు

ఢిల్లీ, మే 11(భారత శక్తి) : ఎంవీ హోండియస్ అనే విలాసవంతమైన క్రూయిజ్ షిప్‌లో ప్రాణాంతక హంటావైరస్ వ్యాప్తి చెందడం తీవ్ర కలకలం రేపింది. ఈ వైరస్ కారణంగా నౌకలో ఒకరు మరణించడంతో వివిధ దేశాలు తమ పౌరులను హుటాహుటిన వెనక్కి రప్పించి కఠినమైన క్వారంటైన్ నిబంధనలు అమలు చేస్తున్నాయి. జర్మనీకి చెందిన నలుగురు ప్రయాణికులను ప్రత్యేక విమానంలో తరలించి ఫ్రాంక్‌ఫర్ట్‌లో క్వారంటైన్‌కు పంపినట్లు జర్మన్ మీడియా వెల్లడించింది. ఇప్పటికే ఓ జర్మన్ మహిళ డ్యూసెల్డార్ఫ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అయితే, ఇప్పటివరకు ఎవరిలోనూ వైరస్ లక్షణాలు కనిపించలేదని అధికారులు తెలిపారు. మరోవైపు, బ్రిటన్‌కు చెందిన 20 మంది ప్రయాణికులను మాంచెస్టర్ విమానాశ్రయం నుంచి నేరుగా మెర్సీసైడ్‌లోని ఆరోవ్ పార్క్ ఆసుపత్రికి తరలించారు. వారికి 72 గంటల పాటు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆ తర్వాత 42 రోజులు స్వీయ ఐసోలేషన్‌లో ఉండాలని ఆదేశించారు. మొత్తం 45 రోజుల పాటు వారిని పర్యవేక్షణలో ఉంచనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. స్పెయిన్ కూడా సుమారు 90 మంది ప్రయాణికులు, సిబ్బందిని తరలించింది. ఇతర దేశాల పౌరులను కూడా వారి వారి స్వదేశాలకు పంపే ప్రక్రియ కొనసాగుతోంది.

### ఏమిటీ హంటావైరస్?

ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ప్రకారం హంటావైరస్‌లు ప్రధానంగా ఎలుకల నుంచి మనుషులకు వ్యాపిస్తాయి. వైరస్ సోకిన ఎలుకల మూత్రం, లాలాజలం లేదా వ్యర్థాలతో సంబంధం ఏర్పడినప్పుడు మనుషులకు ఈ వ్యాధి సోకుతుంది. ఇది ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కొన్ని సందర్భాల్లో ఇది ప్రాణాంతకంగా మారుతుంది. దీనికి నిర్దిష్ట చికిత్స లేనప్పటికీ, లక్షణాల ఆధారంగా సకాలంలో వైద్య సంరక్షణ అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## త్వరలో 17 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల్లో 'ఎస్ఐఆర్': ఎన్నికల సంఘం

- **ఐదు రాష్ట్రాల ఎన్నికలు సహా వివిధ కారణాలతో తాత్కాలిక బ్రేక్**
- **99 కోట్ల మంది ఓటర్లలో 60 కోట్ల ఓటర్ల 'ఎస్ఐఆర్' ప్రక్రియ పూర్తి**
- **మిగిలిన 40 కోట్ల ఓటర్ల 'ఎస్ఐఆర్' ప్రక్రియ త్వరలో చేపట్టనున్నట్లు వెల్లడి**

ఢిల్లీ, మే 11(భారత శక్తి) : రాబోయే కొద్దిరోజుల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) మూడవ దశను ప్రారంభిస్తామని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. 40 కోట్ల మంది ఓటర్లను కవర్ చేస్తూ, మిగిలిన 17 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల్లో 'ఎస్ఐఆర్' ఉంటుందని వెల్లడించారు. ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరిగాయి. ఈ నేపథ్యంలో 'ఎస్ఐఆర్' ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఫలితాలు వెలువడిన నేపథ్యంలో మూడో దశకు సమాయత్తమవుతుంది. ఇప్పటి వరకు ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ, పుదుచ్చేరి, అండమాన్ నికోబర్ దీవులు, లక్షద్వీప్, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా, బీహార్ రాష్ట్రాలలో 'ఎస్ఐఆర్' చేపట్టారు. అసోంలోనూ ప్రత్యేక సవరణ కార్యక్రమం జరిగింది. మొత్తం దేశంలోని 99 కోట్ల మంది ఓటర్లలో 60 కోట్ల ఓటర్లకు సంబంధించిన 'ఎస్ఐఆర్' ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. వాస్తవానికి, ఏప్రిల్ నుంచి సర్ ప్రక్రియ చేపట్టనున్నట్లు పై రాష్ట్రాలకు ఫిబ్రవరి 19వ తేదీన ఈసీ లేఖ రాసింది. ఐదు రాష్ట్రాల ఎన్నికలు సహా వివిధ కారణాల వల్ల బ్రేక్ పడింది. వాటితో పాటు ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు సుప్రీంకోర్టుకు వెళ్ళడం కూడా జాప్యానికి కారణమైంది.

## ఫిన్‌లాండ్‌కు విద్యా బృందం: రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మే 11(భారత శక్తి) : విదేశాల్లో అమల్లో ఉన్న విద్యావిధానాలను అధ్యయనం చేయడానికి 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించామని, అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి ఉత్తమ విద్యావిధానాలను తెలంగాణలో అమలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన విద్యావారోత్సవాల కార్యక్రమంలో మాట్లాడుతూ, విద్యావ్యవస్థకు సంబంధించి రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని, అందుకే విద్యాశాఖను తానే నిర్వహిస్తున్నానని అన్నారు. విద్యా వ్యవస్థలో తెలంగాణ దశాబ్దాలుగా వివక్షకు గురైందని అన్నారు. అందుకే 1969లో తెలంగాణ ఉద్యమం వచ్చిందని, నాటి నుంచి నాలుగున్నర దశాబ్దాలు పోరాడి తెలంగాణను సాధించుకున్నామని తెలిపారు. అందరికీ నాణ్యమైన విద్య అందించాలని అన్నారు. తమ ప్రభుత్వం రాగానే 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని, 60 రోజుల్లో పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందించినట్లు చెప్పారు. వివాదాలు లేకుండా 36 వేల మంది టీచర్లను బదిలీ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలు ఫలితాల్లో ఎందుకు వెనుకబడి ఉన్నాయో ఆలోచించాలని అన్నారు. విద్యాశాఖకు 15 శాతం నిధులు పెంచుతామని హామీ ఇచ్చారు. తెలంగాణలో ఉత్తమ విద్యావిధానాలను అమలు చేస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకహారం పెట్టనున్నట్లు చెప్పారు. మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్ ఫాస్ట్ పథకం అమలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టామని అన్నారు. విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని, కానీ మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నామని అన్నారు. టెన్ ప్లస్ టు విధానం లేకపోవడం వల్ల డ్రాపవుట్లు పెరుగుతున్నాయని వెల్లడించారు. కుల వివక్షను నిర్మూలించేందుకు తాము ఇంటిగ్రేటెడ్ స్కూళ్ళ నిర్మాణం చేపట్టామని ముఖ్యమంత్రి తెలిపారు.



## గృహహింస కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ, మే 11(భారత శక్తి) : భార్యను ఏ భర్త కూడా పశువులా చూడకూడదని, ఆమెకు గౌరవంతో జీవించే సర్వ హక్కులు ఉన్నాయని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓ గృహహింస కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. గృహహింస ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ముందస్తు బెయిల్ కోసం వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారించింది. అనంతరం అతడి అభ్యర్థనను తోసిపుచ్చింది. అంతకుముందు పాట్నా హైకోర్టు కూడా అతని బెయిల్‌ను తిరస్కరించింది. నిందితుడు మద్యం మత్తులో భార్యపై దాడి చేశాడని బాధితురాలు తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. నేలపైకి తోయడంతో ఇటుక తగిలి ఆమె తలకు గాయమైందని అన్నారు. ఆ తర్వాత కర్రతోనూ దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడు మూడు వివాహాలు చేసుకున్నాడని కోర్టుకు తెలిపారు. ఇప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బాధితురాలు అతడి మొదటి భార్య. బాధితురాలి వాదనలు విన్న న్యాయస్థానం, "మీరు మీ భార్యను ఎందుకు కొట్టాలనుకున్నారు? ఇలాగే వేధిస్తే ఆమె మిమ్మల్ని వదిలి వెళ్ళిపోతుంది కదా. మీరు రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోండి" అని సూచించింది. నిందితుడి ముందస్తు బెయిల్‌ను తిరస్కరించింది.

## తమతో కలిసి రావాలన్న మోదీ వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి స్పందన

హైదరాబాద్, మే 11(భారత శక్తి) : రాష్ట్ర అభివృద్ధి కోసం రాజకీయాలను పక్కన పెట్టి కేంద్రంతో కలిసి పనిచేసేందుకు తాము సిద్ధమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'గుజరాత్ కు ఇచ్చినంత తెలంగాణకు కూడా ఇస్తాం. మాతో కలిసిరండి' అని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును స్వాగతిస్తూ, పార్టీల ఐడియాలజీలు వేరైనా ప్రజల సంక్షేమం కోసం 'గివ్ అండ్ టేక్' (ఇచ్చిపుచ్చుకునే) ధోరణి అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విజన్ 2047, 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాలను చేరుకోవడానికి కేంద్రంతో కలిసి నడుస్తామని రేవంత్ చెప్పారు. ఎన్నోసార్లు



కలిసినా కేంద్ర నుంచి ఆశించిన మద్దతు రాలేదని రేవంత్ అన్నారు. ప్రధాని 2 గంటల పాటు సమయం ఇస్తే తమ ప్రణాళికలను వివరిస్తామని చెప్పారు.

## మే 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగలు

హైదరాబాద్, మే 11(భారత శక్తి) : తమ పార్టీ భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు నెల రోజుల పాటు వాడవాడలా జెండా పండుగలు నిర్వహించనున్నట్లు కవిత నేతృత్వంలోని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ప్రకటించింది. ఈ మేరకు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా మే 20 నుండి జూన్ 20 వరకు రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి వరకు పెద్ద ఎత్తున టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహిస్తామని తెలిపింది. పార్టీ ఆవిర్భావ సభలో తెలిపిన పార్టీ విధానాలను, పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వివరిస్తారని వెల్లడించింది. నేడు తెలంగాణ ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఎక్కడికక్కడ గళమెత్తవలసిందిగా పార్టీ నాయకులను కార్యకర్తలకు ఇప్పటికే సూచించినట్లు తెలిపింది. అందులో భాగంగా రాష్ట్రస్థాయి అంశాలతో పాటు స్థానిక సమస్యల పట్ల కూడా అక్కడి శ్రేణులు స్పందించడం, అవసరమైనచోట పోరాటానికి సిద్ధంగా ఉంటారని తెలిపింది. టీఆర్ఎస్ జెండా పండుగలో భాగంగా కార్యకర్తలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరువ కావాలని పిలుపునిచ్చింది. కలిసి వచ్చే వారిలో సమాజం పట్ల బాధ్యత, అంకితభావం కలిగిన చురుకైన కార్యకర్తలతో సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపింది. రాజకీయ చైతన్యం నిండిన ఒక బలమైన జన సమూహాన్ని ప్రజా ఉద్యమాల కోసం




నిర్మిద్దామని పిలుపునిచ్చింది.

# ఆత్మ రక్షణకు కరాటే దోహదం..

* ప్రతి ఒక్కరు స్వీయ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి..
* క్రీడల పట్ల ఆసక్తి కలిగిన ఎమ్మెల్యే దొరకడం అదృష్టం..
* సినీ నటుడు సుమన్..
* పటాన్చెరులో అట్టహాసంగా ముగిసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 10వ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలు..
* విజేతలకు సినీ నటుడు సుమన్ తో కలిసి బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్..



పటాన్‌చెరు, మే 11 (భారత శక్తి) ; ప్రస్తుత సమాజంలో స్వీయ రక్షణ కోసం విద్యార్థినిలు, మహిళలు తప్పకుండా కరాటే నేర్చుకోవాలని.. దీని ద్వారా మానసిక ప్రశాంతత.. శారీరక ధారుఢ్యత లభిస్తుందని సినీ నటుడు సుమన్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని భారతరత్న పీవీ నరసింహారావు ఆడిటోరియంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సౌజన్యంతో.. లక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక పదవ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హీరో సుమన్ మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తి కలిగి.. నిరంతరం క్రీడల అభివృద్ధికి నిబద్ధతతో కృషి చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి దొరకడం పటాన్‌చెరు నియోజకవర్గం ప్రజల అదృష్టమని అన్నారు. గత పది సంవత్సరాలుగా జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలకు సహకారం అందించడం పట్ల అభినందనలు తెలిపారు. తాను విద్యార్థి దశ నుండి మార్షల్ ఆర్ట్స్ ని నేర్చుకోవడం ప్రారంభించామని.. 50 సంవత్సరాలు గడిచిన ఇంకా ఆసక్తి తగ్గలేదని తెలిపారు. చదువుతోపాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ఏడాది పొడవునా వివిధ అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడలకు పటాన్చెరు కేంద్రంగా నిలవడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకట్ రెడ్డి, వెంకటేష్, షకీల్, రామ్మోహన్, వినోద్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.







# బోధనా పద్ధతులపై గీతంలో శిక్షణ

* భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు వృత్తి వికాస కార్యక్రమం
* శిక్షణలో ఐఐటీ, ఐఐఎస్సీ, బార్క్ నిపుణులు

పటాన్‌చెరు, మే 11 (భారత శక్తి) : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని, భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'అధునాతన భావనలు, బోధనా పద్ధతులు, విద్యా సాధనాలు' అనే అంశంపై భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజుల రెసిడెన్షియల్ వృత్తి వికాస కార్యక్రమాన్ని (ఆర్పీడీపీ) జూన్ 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇండియన్ ఫిజిక్స్ అసోసియేట్ (ఐపీఏ) విశాఖ చాప్టర్ సహకారంతో, గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. భావనాత్మక అవగాహనను ప్రయోగాత్మక అభ్యాసం, సమకాలీన బోధనా పద్ధతులతో అనుసంధానించడం ద్వారా పాఠశాల, యూజీ స్థాయిలో భౌతికశాస్త్ర విద్యను బలోపేతం చేయడానికి దీనిని రూపొందించారు. తరగతి గదులలో శాస్త్రీయ జిజ్ఞాస, చురుకైన అభ్యాసం, భావనా స్పష్టత, ప్రత్యక్ష ప్రయోగాలను ప్రోత్సహించే వినూత్న బోధనా పద్ధతుల కోసం పెరుగుతున్న అవసరాన్ని తీర్చడమే ఈ కార్యక్రమ లక్ష్యం. ప్రముఖ సంస్థల నుంచి విశిష్ట విద్యావేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులను ఒకచోట చేర్చి, ఇందులో పాల్గొనే వారికి భౌతికశాస్త్రంలోని అధునాతన భావనలు, ఆధునిక విద్యా సాధనాలు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రయోగాత్మక పద్ధతులు, అనుకరణలు, ఐసీటీ ఆధారిత బోధన, విద్యార్థి మూల్యాంకన వ్యూహాలపై ఈ కార్యక్రమంలో అవగాహన కల్పిస్తారు. గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కు చెందిన అధ్యాపక బృందం బోధనా పద్ధతులు, అభ్యాసన సిద్ధాంతాలపై ప్రత్యేక సెషన్లను కూడా నిర్వహించి, ఈ కార్యక్రమాన్ని లక్ష్యాన్ని మరింత సుసంపన్నం చేయనుంది. ఈ మూడు రోజుల కార్యక్రమంలో విద్యుదయస్కాంత సిద్ధాంతం, ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్, సూపర్ కండక్టివిటీ, అయస్కాంతత్వం, అణు వికిరణం, ప్రయోగాత్మక ప్రదర్శనలు, స్వయంగా తయారు చేసుకునే భౌతిక శాస్త్ర కిట్లు, తరగతి గది బోధనా పద్ధతులు, అభ్యసన మూల్యాంకన పద్ధతులు వంటి అంశాలు ఉంటాయి. ఈ శిక్షణా కార్యక్రమంలో గీతం సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎస్. అనంత రామకృష్ణ; విశిష్ట విజిటింగ్ ఆచార్యుడు ప్రొఫెసర్ బి.వి.ఆర్. టాటా; ఐఐటీ మద్రాసు ఆచార్యుడు ప్రొఫెసర్ టి.ఎస్. నటరాజన్; బెంగళూరులోని ఐఐఎస్ సీకి చెందిన ప్రొఫెసర్ విబోర్ సింగ్ వంటి నిపుణులు పాల్గొంటారు. అలాగే గీతం విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ జి.రవి కుమార్; బాబా అణు శక్తి సంస్థ పూర్వ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జి.ఎ. రామారావు; మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ఆచార్యులు ప్రొఫెసర్ వనజ, ముంబైలోని టాటా ప్రాథమిక పరిశోధనా సంస్థ, హోమీ భాభా విద్యా సంస్థకు చెందిన ప్రొఫెసర్ దీపాచారి తదితరులు పాల్గొని, సదస్యులకు తగిన మార్గదర్శనం చేయనున్నారు. ఈ కార్యక్రమం పాఠశాల స్థాయి భౌతిక శాస్త్రం, విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయుల కోసం ఉద్దేశించారు. భౌతికశాస్త్ర విద్యలో ఉత్తమ పద్ధతులు, వినూత్న విధానాలను పంచుకోవడానికి ఒక సహకార వేదికను సృష్టించడం దీని లక్ష్యం. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ జి.సాయిప్రీతి, డాక్టర్ టి.విశ్వం సమన్వయం చేస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు తమ పేర్ల నమోదు, ఇతరత్రా వివరాల కోసం కార్యక్రమ సమ్వనకర్తలు షామాబీ (77802 74121) లేదా గోపీకృష్ణ (87120 18815) లను సంప్రదించవచ్చు.

# దిగ్విజయంగా అధికారులు నిర్వహించిన మెగా జాబ్ మేళా




ఎల్బీనగర్, మే 11 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా నేడు 11th మే 2026 సోమవారం నాడు రంగారెడ్డి జిల్లాలోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం నందు మెగా జాబ్ మేళాను మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఐ.టి. ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్, పరిశ్రమలు & వాణిజ్యం మరియు శాసనసభ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారు ముఖ్యఅతిధిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ శ్రీమతి కె.కిరణ్మయి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, టీయుఎఫ్ఐడిసీ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్లు శ్రీమతి శ్రీలక్ష్మి, డి. వినయ్ కుమార్, మహేష్, డీట్ డైరెక్టర్ జె. రాజేశ్వర్ రెడ్డి, టాస్క్ సీఈఓ నితిన్ కుమార్ రెడ్డి మరియు జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇందులో ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పరిశ్రమలు, ఐ.టి. కంపెనీలు, ఇతర సేవా రంగ సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుండి దాదాపు 4318 మంది ఉద్యోగార్థులు జాబ్ మేళాలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి తమ ప్రసంగంలో ఈనాటి జాబ్ మేళా కార్యక్రమం గురించి మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి 123 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. జాబ్ మేళా నిర్వహిస్తున్న కంపెనీల విధానాల గురించి యువతకు తెలియజేశారు. ఉదాహరణకు ఏఐ, ఐటీ రంగాల, గురించి తెలియజేశారు. ఈ ప్రభుత్వం యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం యువత అపార అవకాశాలు గల ఉత్పత్తి, సేవా మరియు రవాణా రంగాల్లో యువత నైపుణ్యత పెంచుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన డీట్ నిరుద్యోగులకు, పరిశ్రమలకు మధ్య వారధిగా ఎన్నో అవకాశాలను కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రసంగిస్తూ నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశమే ప్రభుత్వ సంకల్పమని తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో 3716 ఉద్యోగార్థులు పాల్గొనగా 1645 మంది షార్ట్ లీస్ట్ కాగా 779 ఉద్యోగార్థులను ఎంపిక చేయడం జరిగింది. ఎంపికైన కొంత మంది అభ్యర్థులకు ఐటీ మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలను అందచేయడం జరిగింది.

# బీసీ వాదాన్ని బలోపేతం చేస్తున్న బీసీ ప్రభంజనం సభ

* ఒకవైపు బీసీ నేతలకు ఆహ్వానం మరోవైపు బీసీ సమగ్ర కులాలతో సమన్వయం



ఎల్బీనగర్, మే 11 (భారత శక్తి): ఎల్బీనగర్ లో జరగనున్న బీసీ ప్రభంజనం సభకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోందని బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ బీసీ సంఘాల నాయకులు కెవి గౌడ్, ఉపేంద్ర యాదవ్, రాయబండి పాండు రంగాచారి, జాల కిషన్ లు తెలిపారు. మే 24 న ఎల్బీనగర్ ఎస్ కే గార్డెన్ లో జరిగే బీసీ ప్రభంజనం సభకు రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాల అగ్ర నాయకులు, మేధావులు హాజరు కానున్నారని బీసీ సంఘాల నాయకులు వివరించారు. ఇప్పటికే రాజ్యసభ సభ్యులు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, మాజీ ఎంపీ ఎల్బీనగర్ కాంగ్రెస్ ఇంచార్జి మధుయాష్కీ గౌడ్ లను బీసీ ప్రభంజనం నాయకులు కలిసారు. సోమవారం బీసీ ఇంటలెక్షువల్ ఫోరం చైర్మన్ మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవిలును కలిసిన బీసీ సంఘాల నేతలు బీసీ ప్రభంజనం సభకు రావాలని కోరారు. అదే విధంగా సీనియర్ జర్నలిస్టు, పాశం యాదగిరిని కలిసిన బీసీ ప్రభంజనం నాయకులు బీసీ ఉద్యమానికి మద్దతుగా రాజకీయాలకు అతీతంగా ఏకం కావాల్సిన అవసరం ఉందని బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ బీసీ నేతలకు వివరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వి. హనుమంతురావును కలవడం జరిగిందని బీసీ ప్రభంజనం సమన్వయకర్త టియుడబ్ల్యుజె రాష్ట్ర నాయకులు జాల కిషన్ తెలిపారు. మే 24 న ఎల్బీనగర్ లో జరిగే బీసీ ప్రభంజనం సభ విజయవంతం చేయడానికి బీసీలు అందరూ ఒక్క తాటి పైకి రావాలని బీసీ సంఘాల నాయకులు కెవి గౌడ్, ఉపేంద్ర యాదవ్, రాయబండి పాండు రంగాచారి విజ్ఞప్తి చేస్తున్నారు. రాజ్యాధికారానికి దూరంగా ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ బహుజనులు అందరూ ఐక్యత చాటాలని ఎస్సీ ఎస్టీ బీసీ జేఏసీ కన్వీనర్ తెలంగాణ వెంకన్న విజ్ఞప్తి చేశారు. బీసీ ప్రభంజనం సభకు దళిత గిరిజన బీసీ సంఘాల నాయకులు పాల్గొంటారని ఆయన వివరించారు.

# నిధులున్నా పనులు ఎందుకు ఆరంభించరు?

* జలమండలి అధికారులను నిలదీసిన మాజీ కార్పొరేటర్లు




హయత్‌నగర్, మే 11 (భారత శక్తి) : హయత్‌నగర్ డివిజన్ పరిధిలో గతంలో మంజూరైన భూగర్భ డ్రైనేజీ పనులను వెంటనే చేపట్టాలని మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వారు జలమండలి అధికారులను కార్యాలయంలో కలిసి, పెండింగ్‌లో ఉన్న పనుల పురోగతిపై సమీక్షించారు.

**ప్రధాన సమస్యలు ఇవే:**

*నిధులున్నా నిలకడ: మహేశ్వరి కాలనీ, దత్తాత్రేయ కాలనీ, పద్మాలయ కాలనీ, బ్లడ్ బ్యాంక్ కాలనీ, సాయి కాలనీ, దుర్గా నగర్, పి&టి కాలనీ, గాయత్రి నగర్ ప్రాంతాల్లో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు.

* ముంచుకొస్తున్న వర్షాకాలం: సామనగర్ నుండి హయత్‌నగర్ పాత జాతీయ రహదారి వరకు చేపట్టాల్సిన ట్రంక్ లైన్ పనులు ఆలస్యమవుతున్నాయి. వానాకాలం లోపు ఈ పనులు పూర్తి చేయకుంటే ప్రజలకు ఇబ్బందులు తప్పవని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.
* చెరువుల కాలుష్యం: గత ఏడాది సరైన మురుగునీటి సౌకర్యం లేక పద్మావతి కాలనీ, వస్పరి కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారని, మురుగునీరు చేరడం వల్ల కుమ్మరికుంట చెరువు పూర్తిగా కలుషితమైందని గుర్తు చేశారు.

**అధికారులకు వినతి:**

ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి సీజీఎం నాగేంద్ర బాబు, డీజీఎం నాగరాజు, జీఎం మహేందర్ నాయక్, మేనేజర్లు సందీప్, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

# బడంగ్‌పేట్‌లో జనగణన షురూ!

* క్షేత్రస్థాయిలో జోనల్, డిప్యూటీ కమిషనర్ల తనిఖీ

బడంగ్‌పేట్, మే 11(భారత శక్తి) : బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం నుంచి జనగణన (సెన్సస్) ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. తొలిరోజు క్షేత్రస్థాయిలో జరుగుతున్న వివరాల సేకరణను శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ, బడంగ్‌పేట్ డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య స్వయంగా పర్యవేక్షించారు.

**ఇంటింటికీ ఎన్యుమరేటర్లు**

సర్కిల్ పరిధిలోని పలు డివిజన్లలో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరును పరిశీలించిన అధికారులు, రిజిస్టర్లలో వివరాల నమోదు ప్రక్రియను అడిగి



తెలుసుకున్నారు. ఎన్యుమరేటర్లకు, సూపర్వైజర్లకు విధివిధానాలపై పలు సూచనలు చేశారు.

* ఖచ్చితత్వమే ప్రామాణికం: డిప్యూటీ కమిషనర్

ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ.. జనగణన ప్రక్రియలో ప్రతి అంశాన్ని అత్యంత పారదర్శకంగా నమోదు చేయాలని ఆదేశించారు.

* వివరాల సేకరణ: ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలి.
* అవగాహన: గణన ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి వారి నుంచి పూర్తి సహకారం తీసుకోవాలి.

జవాబుదారీతనం: ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా, ఎలాంటి తప్పులు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలి.

ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు ఈ గణాంకాలే ప్రాతిపదిక అని, కావున ప్రజలు కూడా అధికారులకు సహకరించి సరైన వివరాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఇతర గణన అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.